ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఖమ్మం
: fb.com/vaartha Digital
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
6-9-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 216 పేజీలు: 8+16 వెల: 6.50

ఎన్డీయె కూటమిలో తేలని సర్దుబాట్లు
ముంబయి మహానగరానికి మానవ బాంబుల ముప్పు 5లో


హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద గణేశ నిమజ్జనంకోసం ఏర్పాటు చేసిన భారీ క్రేన్‌లు

## మహా నిమజ్జనం నేడే

**గణేశ శోభయాత్రకు హైదరాబాద్ నలుమూలలా విస్తృత ఏర్పాట్లు**

**ట్యాంక్‌బండ్ వద్ద భారీ క్రేన్లు సిద్ధం**

**నగరమంతటా 47 వేల మంది పోలీసులతో బందోబస్తు**

**ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం మధ్యాహ్నానికే పూర్తయ్యే అవకాశం**



**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** జంట నగరాలతో పాటు శివార్లలో శనివారం జరగనున్న గణేశ నిమజ్జనోత్సవానికి పోలీసు శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. ట్రై కమిషనరేట్ల పరిధుల్లో 47 వేల మంది పోలీసులను బందోబస్తు కోసం రంగంలో దించారు. దీంతో పాటు సున్నిత, అతి సున్నిత ప్రాంతాలలో సాయుధ బలగాలను మొహరించగా డ్రోన్లతో పహారా కోసం ప్రత్యేకంగా డ్రోన్‌బృందాలను నియమించారు. హైదరాబాద్‌లో నిమజ్జనం సాఫీగా సాగేందుకు వీలుగా టెక్నా >>2

# విద్యతోనే వెలుగుదారి

## టీచర్లతోపాటు కష్టపడతా..

### ఎక్కడికి రమ్మన్నా వస్తా..

### తెలంగాణకు కొత్త విద్యావిధానం కావాలి

### రెండోసారి సిఎం అవ్వాలనుకుంటున్నా

**టీచర్స్‌డే సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేసిన సిఎం రేవంత్**


శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన గురుపూజోత్సవంలో ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేస్తున్న సిఎం రేవంత్. చిత్రంలో మంత్రి పొంగులేటి, కెకె తదితరులు

**హైదరాబాద్, ప్రభాతవార్త, సెప్టెంబరు 5:** తెలంగాణ రాష్ట్రంలో విద్యాభివృద్ధి కోసం టీచర్లు ఎక్కడికి రమ్మంటే అక్కడి వస్తానని.. తండాలు, గ్రామాలు ఎక్కడికైనా వస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మీతోపాటు నేను కష్టపడతానని అన్నారు. రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధికోసం ప్రత్యేకంగా నూతన విద్యావిధానం కావాలన్నారు. విద్యారంగాన్ని గత ప్రభుత్వం వ్యాపారంగా మార్చుకుందని సిఎం విమర్శించారు. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీ మూతపడే పరిస్థితికి వచ్చిందన్నారు. సెప్టెంబర్ 5న గురుపూజోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని శిల్పా కళావేదికలో నిర్వహించిన గురుపూజోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కె కేశవరావు, ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ఏవిఎన్ రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, కళాశాల విద్య కమిషనర్ శ్రీదేవ సేన, ఇంటర్ విద్య డైరక్టర్ కృష్ణ ఆదిత్య, పాఠశాల విద్య డైరక్టర్ నవీన్ నికోలస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాల నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 120 మందికి అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురు పూజోత్సవ కార్యక్రమానికి రావడం సంతోషంగా ఉందన్నారు. విద్యాశాఖ అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్నదని, విద్యాశాఖను స్వయంగా పర్యవేక్షిస్తూ ప్రతిసమస్యను పరిష్కరిస్తున్నానని తెలిపారు. విద్యాశాఖలో ఎన్నోసంస్కరణలు తీసుకు రావాల్సిన అవసరముందన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లోనూ నర్సరీ, ఎల్‌కెజి, యూకెజి తరగతులు బోధిస్తున్నట్లుచెప్పారు. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల >>2

**ధరణి ముసుగులో దోపిడి చేసిన బిఆర్ఎస్: సిఎం** 7లో


కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

## 'బెంజికారు, హవాయి చెప్పులకు ఒకే పన్ను వేయలేం'

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 5:** దేశవ్యాప్తంగా 'ఒకే దేశం.ఒకే పన్ను' విధానాన్ని అమలు చేయడం ప్రస్తుత పరిస్థితుల్లో సాధ్యం కాదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. విలాసవంతమైన బెంజ్ కారుపైనా, సామాన్యుడు వాడే హవాయి చెప్పులపై ఒకే రకమైన పన్ను విధించడం ఎంతమాత్రం సమంజసం కాదని ఆమె తేల్చి చెప్పారు. దేశంలోని వివిధ ప్రాంతాల మధ్య ఆర్థిక అభివృద్ధిలో తీవ్ర అసమానతలు ఉన్నాయని, ఇలాంటి సమయంలో ఒకే పన్ను రేటును అమలు చేయడం ఆచరణ సాధ్యం కాదని మంత్రి అన్నారు. >>2


అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

## 'భారత్, రష్యాలతో పెరుగుతున్న దూరం'

**వాషింగ్టన్, సెప్టెంబరు 5:** భారత్‌తోపాటు ప్రపంచ దేశాలపై విధించిన టారిఫ్‌లు ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తుండటాన్ని అమెరికన్లతోపాటు అమెరికన్‌ప్రజాప్రతినిధులు కూడా జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రత్యేకించి భారత్‌తో పెట్టుకోవద్దని, భారత్‌ను మిత్రదేశంగానే చూడాలని చేస్తున్న విజ్ఞప్తులను పెడచెవిన పెడుతున్న ట్రంప్ ఎట్టకేలకు కొంత పశ్చాత్తాప ధోరణితో ఉన్నట్లు కనిపిస్తున్నారు. తాజాగా భారత్-అమెరికా సంబంధాలపై అధ్యక్షుడు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు దిగజారయనే అర్థంలో మాట్లాడిన >>2



## ఆడబిడ్డలకు సర్కార్ దసరా కానుక

**రూ. 1600 విలువైన చీరెలు ఉచితంగా పంపిణీ**

**రాష్ట్ర వ్యాప్తంగా 65 లక్షల చీరెలు సిద్ధం**


**హైదరాబాద్,సెప్టెంబర్ 5,ప్రభాతవార్త:** దసరా పండుగ నేపథ్యంలో తెలంగాణ సర్కార్ ఆడబిడ్డలకు చీరలు పంపిణీ చేసేందుకు రెడీ అవుతోంది. గత ప్రభుత్వంలో ఇచ్చినట్లుగా నాసిరకం చీరలు కాకుండా.. ఒక్కొక్కటి రూ.800 ఖరీదుచేసే రెండు చీరను పంచనుంది.ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా ఈ చీరల పంపిణీ ప్రారంభించనుంది. ఈ నెలలోనే మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల చీరలు పంపిణీ చేయబోతున్నారు.తెలంగాణలో దసరా పెద్దపండుగకాగా.. ఇకబతుకమ్మవేడుక తెలంగాణకే హైలెట్‌గా నిలుస్తుంది. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఎక్కడెక్కడికో వెళ్లిన వారు సైతం దసరా పండుగకు సొంత ఊళ్లకు చేరుకుంటారు. ఇదిలా చిన్నది,పెద్దది అనే తేడాలేకుండా.. పండుగ పూట కొత్త చీర కట్టుకోవాలని ప్రతి ఆడబిడ్డ ఆశ పడుతుంది. అయితే ఆర్థిక పరిస్థితి అనుకూలిస్తే.. కుటుంబం అంతా దసరా పండుగకు కొత్త బట్టలు తీసుకుంటారు. లేదంటే తల్లిదండ్రులు ఊరుకుని పిల్లలకు కొత్త బట్టలు కొంటారు. కానీ పండుగ నాడు ఆడబిడ్డ కొత్త చీర కట్టుకుంటేనే అందం. దీన్ని దృష్టిలో పెట్టుకుని తెలంగాణలో ప్రభుత్వాలు బతుకమ్మ పండగకు ఉచితంగా చీరలు పంపిణీ చేసేవి. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆడబిడ్డలకు బతుకమ్మ సందర్భంగా చీరలు పంచేందుకు రెడీ అయ్యింది.ఈసారి బతుకమ్మ పండుగ సందర్భంగా రేవంత్ సర్కార్ తెలంగాణ ఆడబిడ్డలకు రూ.1600 రూపాయల ఖరీదు చేసే.. రెండు అందమైన చీరలను ఉచితంగా పంచేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద తెలంగాణలోని మహిళలకు వీటిని పంచనుంది. బతు >>2

# ఖాళీగా 10వేల టీచర్ పోస్టులు

**4454 మందికి పదోన్నతులు, 6 వేల మంది విరమణ**

**డిఎస్సీద్వారా భర్తీ చేయాలంటున్న నిరుద్యోగులు**

**ఇప్పటికే టెట్ ముగించి ఫలితాలు ప్రకటించిన ప్రభుత్వం**



**హైదరాబాద్, ప్రభాతవార్త, సెప్టెంబరు 5:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో సుమారు 10వేలకి పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గత నెల 26 వరకు చేపట్టిన ఉపాధ్యాయులు పదోన్నతుల మూలంగా 4500 పోస్టులు ఖాళీ అయ్యాయి. దాంతోపాటు ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా పదవీ విరమణ పొందే ఉపాధ్యాయుల సంఖ్య 6వేలకిపైగా ఉంటుంది. ఈ నేపథ్యంలో మొత్తం ఉపాధ్యాయుల ఖాళీలు సుమారు 10వేలకి పైగానే ఉండే అవకాశం ఉంది. రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సంబంధించిన పదోన్నతుల ప్రక్రియ ఆగస్టు 26తో ముగిసింది. మొత్తం 4454 మంది ఉపాధ్యాయులకి పదోన్నతులు లభించాయి. వారిలో 880 మంది గ్రేడ్-2 గెజిటెడ్ హెడ్మాష్టర్లుగా పదోన్నతులు పొందగా.. 811 మంది పిఎస్‌హెచ్‌ఎంలుగా, 2763 మంది స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందారు. ఉపాధ్యాయుల పదోన్నతులపై ఉన్న స్టేను హైకోర్టు గత ఆగస్టు నెల 20న ఎత్తివేయడంతో పదోన్నతుల ప్రక్రియ తిరిగి ప్రారంభించి ఆగస్టు 26లోపుగా ముగించారు. ప్రస్తుతం స్కూల్ అసిస్టెంట్లు(ఎస్‌ఏ)గా పనిచేస్తున్న 880 మందికి గ్రేడ్-2 గెజిటెడ్ హెడ్మాష్టర్లుగా పదోన్నతులు పొందారు. వారిలో మల్టీ జోన్-1లో 490 మంది, మల్టీ జోన్-2లో 390 మందికి కలిపి 880 మందికి జీహెచ్‌ఎంలుగా పదోన్నతులు లభించాయి. 2,763 మంది ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా, మరో 811 మంది ఎస్‌జీటీలకు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయు(పీఎస్‌హెచ్‌ఎం)లుగా పదోన్నతి లభించింది. దీంతో మొత్తం 4454 మంది ఉపాధ్యాయులు పదోన్నతులు పొందారు. ప్రతి ఏడాది కూడా రాష్ట్రంలోని 26వేల పైచిలుకు పాఠశాలల్లో సుమారు 6 వేల మంది వరకు ఉపాధ్యాయులు పదవీ >>2


## కాళేశ్వరంపై కదిలిన సిబిఐ

**హైదరాబాద్‌కు వచ్చిన సంస్థ డైరెక్టర్ ప్రవీణ్ సూద్**

**ఎన్‌డిఎస్‌ఎ, విజిలెన్స్ నివేదికల పరిశీలన, అధికారులతో భేటీ**




**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రాజకీయంగా ప్రకంపనలు సృష్టించిన కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలపై సిబిఐ విచారణకు సంబంధించి మరో ముందడుగు పడింది. ఈ ప్రాజెక్టులో అక్రమాలపై జాతీయ ఆనకట్టల భద్రతా ప్రాధికర సంస్థ (ఎన్‌డిఎస్‌ఎ) ఇచ్చిన నివేదిక ఆధారంగా సిబిఐ విచారణకోరుతూ రాష్ట్ర హోంశాఖ గత ఆదివారం రాత్రి సిబిఐకి లేఖ రాయడం తెలిసిందే. దీనిపై లేఖ అందినట్లు ఢిల్లీలోని సిబిఐ కార్యాలయం నుంచి రాష్ట్ర హోం శాఖకు సమాధానం కూడా అందడం విదితమే. అయితే ఇదంతా జరిగి నాలుగు రోజులు గడిచిన తరు >>2



## సరిహద్దు కంచెకూ 'భద్రత' లేదా?

**భారీ వర్షాలకు 30 కి.మీ మేర కొట్టుకుపోయిన వైనం**

**ఫిరోజ్‌పూర్, సెప్టెంబరు 5:** పంజాబ్‌లోని రావినదికి వరదల ఉధృతి కారణంగా పాకిస్తాన్‌తో పంజాబ్‌వెంబడి ఉన్న సరిహద్దు దెబ్బతిన్నది. పంజాబ్ సరిహద్దు సుమారు 30 కిలోమీటర్లమేర ఇనుపకంచె కొట్టుకుని పోయింది. దీనితోభద్రతా దళాలు డజన్లకొద్దీ పోస్టులు ఖాళీచేయాల్సి వచ్చింది. గురుదాస్‌పూర్, అమృత్‌సర్, పఠాన్‌కోట్ జిల్లాల్లోని 50కిపైగా బిఎస్ఎఫ్ చెక్‌పోస్టులు దెబ్బతిన్నాయి. ఇనుప కంచె సుమారు 30 కిలోమీటర్లు కొట్టుకుపోయిందని అధికారులు తెలిపారు. కంచెకొట్టుకునిపోయినా బిఎస్ఎఫ్ సిబ్బంది మాత్రం తమ గస్తీని కొనసాగిస్తూనే ఉన్నారు. ఇబ్బందికర పరిస్థితులున్నా పడవలతో పర్యవేక్షిస్తున్నారు. ఇక అదే అదునుగా మాదకద్రవ్యాల స్మగ్లర్లు భారత్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్నట్లు సైన్యం గుర్తించింది. భద్రతను మరింత కఠినతరంచేసారు. స్మగ్లర్ల ప్రయత్నాలను దళాలు అడ్డుకుంటున్నాయి. గుర్దాస్‌పూర్‌లో దాదాపు 30 నుంచి 40 వరకూ ఔట్‌పోస్టులు మునిగిపోయాయి. స్థానికులు సురక్షితప్రాంతా >>2

## కామారెడ్డిలో 15న కాంగ్రెస్ సభ

**బిసి డిక్లరేషన్ చేసిన ప్రదేశంలోనే సమావేశం**

**హైదరాబాద్,సెప్టెంబరు 5,ప్రభాతవార్త:** రిజర్వేషన్ 50శాతం పరిమితి ఎత్తివేస్తూ బిసి రిజర్వేషన్ 42శాతం కల్పిస్తూ అసెంబ్లీ తీర్మానం చేసి తమ చిత్తశుద్ధిని చాటుకున్నామని తెలంగాణ సమాజానికి చాటి చెప్పడానికి కాంగ్రెస్ పార్టీ ఈనెల 15న కామారెడ్డిలో భారీ బహిరంగసభ ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తోంది. 2023 నవంబరులో కామారెడ్డిలో సభ ఏర్పాటు చేసి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య >>2

# 3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ మా లక్ష్యం

**● యువ తెలంగాణ ప్రపంచంతో పోటీపడుతోంది ● విద్యారంగంలో భారీగా పెట్టుబడులు ● ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ సమావేశంలో డి.సిఎం భట్టి**


ఇండియన్ బిజినెస్ స్కూల్ కార్యాక్రమంలో మాట్లాడుతున్న డి.సిఎం భట్టి

**హైదరాబాద్,సెప్టెంబరు 5,ప్రభాతవార్త:** తెలంగాణ రైజింగ్ 2047, మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు తెలంగాణ యువ రాష్ట్రం వేగంగా పరుగులు తీస్తోందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం ఆయన గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో మోతిలాల్ ఓస్వాల్ ఎగ్జిక్యూటివ్ సెంటర్ ప్రారంభోత్సవం అనంతరం ప్రసంగించారు. రాష్ట్ర విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను పూర్తిగా ఉచితంగా అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ప్రారంభిస్తున్నాం అన్నారు. 25 ఎకరాల విస్తీర్ణంలో 200కోట్ల పెట్టుబడితో ఒక్కో పాఠశాల నిర్మిస్తున్నాం, రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి 104 పాఠశాలల నిర్మాణం ప్రారంభించినట్టు వివరించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న చాకలి ఐలమ్మ పేరిట మహిళా యూనివర్సిటీ భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.500 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఆనంద్ మహీంద్రా వంటి దిగ్గజాన్ని చైర్మన్‌గా నియమించి స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని ఐఎస్‌బి నిర్వాహకులు స్కిల్ యూనివర్సిటీని, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్‌ను సందర్శించి వాటికి అవసరమైన సలహాలు సూచనలు ఇవ్వా లని డిప్యూటీ సిఎం కోరారు. ఐఎస్‌బి విద్యార్థులు గొప్ప అదృష్టవంతులు ఒక్కో తరగతి గది రూ 1.50 కోట్ల నుంచి రెండు కోట్ల వరకు వెచ్చించి నిర్మించారు. తాను ఒకటి నుంచి ఐదో తరగతి వరకు సింగిల్ టీచర్ ప్రభుత్వ పాఠశాలలో తెలుగు మీడియంలో చదువుకు న్నానని, రాసుకునేందుకు పలకలు కూడా లేక పోవడంతో మా >>2



శుక్రవారం ఖైరతాబాద్ మహాగణపతి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన సిఎం రేవంత్ రెడ్డి

# ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించిన సిఎం

**హైదరాబాద్,సెప్టెంబరు 5,ప్రభాతవార్త:** ఖైరతాబాద్ మహాగణపతిని శుక్రవారం తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ..."71 ఏళ్ల క్రితం గణేశ్ ఉత్సవ సమితి ఒకే ఒక్క అడుగు గణేశుడిని ప్రతిష్ఠించుకుని ఉత్సవాలను ప్రారంభించింది. దేశంలోనే గణేశ్ ఉత్సవాలకు ఖైరతాబాద్ ప్రసిద్ధి చెందింది. ఒక్కసారి నిర్వహణే కష్టమైన ఈరోజుల్లో ఎన్ని ఇబ్బందులు వచ్చినా వాటిని తట్టుకుంటూ ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ సమితి ఉత్సవాలను కొనసాగిస్తోంది. గతంలో పిసిసి అధ్యక్షుడిగా, ఇప్పుడు సిఎంగా ఈ ఉత్సవాల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. రాష్ట్రంలో గణేశ్ మండపాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందించింది. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో ఎక్కడా సమస్యలు లేకుండా ఉత్సవాలను పూర్తిచేసుకున్నాం. ఉత్సవాలను విజయవంతంగా ముగించిన గణేశ్ ఉత్సవ సమితి సభ్యులను అభినందిస్తున్నా. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉత్సవ సమితికి అన్ని విధాలుగా సహకారం అందిస్తాం" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, శాసనసభ్యులు దానం నాగేందర్, హెచ్‌ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జిహెచ్‌ఎంసి కమిషనర్ కర్ణన్, జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, ఆర్డీవో సాయిరాం, ఉత్సవ కమిటీ సభ్యులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



శుక్రవారం న్యూఢిల్లీలో ఉత్తమ ఉపాధ్యాయులకు జాతీయ అవార్డులు ప్రదానం చేస్తున్న రాష్ట్రపతి ముర్ము

# మహా నిమజ్జనం నేడే

>> లజీని వాడుతున్న పోలీసు శాఖ ట్రై కమిషనరేట్లలో ఏడు లక్షలకు పైగా సిసి కెమెరాల సేవలను వాడుకుంటున్నారు.

హైదరాబాద్‌లో గణేశ ఉత్సవాలు శనివారంతో ముగియనున్నాయి. గత నెల 27వ తేదీన మొదలైన గణేష్ వేడుకలు ధూంధాంగా కొనసాగుతుండడం తెలిసిందే. హైదరాబాద్‌తో పాటు సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధుల్లో మూడు లక్షల వరకు విగ్రహాలు ప్రతిష్ఠించడం విదితమే. ఇందులో ఇప్పటి వరకు చిన్న విగ్రహాలతో పాటు ఓ మోస్తరు ఎత్తు కలిగిన విగ్రహాలు రెండు లక్షల వరకు వుండగా వీటిలో 80శాతం ఇప్పటికే ట్యాంక్‌బండ్‌తో పాటు ఆయా ప్రాంతాలలోగల చెరువులు, కుంటలు, బల్దియా ఏర్పాటు చేసిన కృత్రిమ కొలనుల్లో నిమజ్జనం అయ్యాయి. మిగతా విగ్రహాలు శనివారం నాడు నిమజ్జనం కానున్నాయి. ఇందులో మెజారిటీ విగ్రహాలు భారీవే కావడం గమనార్హం. కాగా శనివారం నాడు జరిగే నిమజ్జనం కోసం ట్యాంక్‌బండ్‌తో పాటు శివార్లలోని చెరువులు, కుంటల వద్ద ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి కాగా ఈ సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఏర్పాట్లు చేశారు. గణేశ ఉత్సవాల సందర్భంగా మెజారిటీ విగ్రహాలు ట్యాంక్‌బండ్ నెక్లెస్ రోడ్డు మార్గంలోనే నిమజ్జనం అవుతుండడంతో ఇక్కడ అదనపు బలగాలను మొహరించారు. హైదరాబాద్ వరకు వస్తే 29 వేల మంది పోలీసులు బందోబస్తులో వుండగా సైబరాబాద్‌లో ఆరు వేలమంది, రాచకొండ పరిధిలో 12 వేల మందిని మొహరించారు. గణేశ ఉత్సవాల కోసం పోలీసు, పౌర విభాగాలు నెలన్నరగా ఏర్పాట్లు చేయడం విశేషం. ట్యాంక్‌బండ్‌లో శనివారం నాటి చివరి రోజు నిమజ్జనంలో 25 వేల విగ్రహాలు వచ్చే వీలుందని అధికారులు అంచనా వేయసాగారు. పిఒపి విగ్రహాలకు నెక్లెస్‌రోడ్, ఎన్టీఆర్ మార్గలలో ఏర్పాటు చేసిన కృత్రిమ కొలనుల్లో నిమజ్జనానికి ఏర్పాట్లు చేశారు. దీంతో పాటు జంట నగరాలు, శివార్లలో బల్దియా ఆధ్వర్యంలో 200 వరకు కృత్రిమ నీటి కొలనులు ఏర్పాటుచేయడంతో ఇక్కడకూడా పెద్దసంఖ్యలో విగ్రహాలను నిమజ్జనం చేయసాగారు. గణేష్ నిమజ్జనం ప్రధాన ఊరేగింపు బాలాపూర్ రాచకొండ పరిధిలో వుండగా అక్కడి నుంచి ట్యాంక్‌బండ్ వరకు వున్న 19 కిలోమీటర్ల మార్గంలో వెయ్యికిపైగా సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇక గణేష్ బందోబస్తు కోసం నగరంలోని అన్ని మార్గాలు కలిపి 120 కిలోమీటర్ల దూరంగా నిర్ణయించారు.

ఈ క్రమంలో అన్నిచోట్ల పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. నిమజ్జనంలో ప్రజల భాగస్వామ్యం, స్వచ్ఛంద సేవకుల సేవలను పెంచారు. ఇక గణేష్ విగ్రహాల తరలింపు సవ్యంగా సాగేందుకు సిసి కెమెరాలను, టెక్నాలజిని మరోసారి వాడుతున్నారు. దీనివల్ల ముఖ్యమైన విగ్రహాల వద్ద జరిగే అన్ని కార్యక్రమాలను బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ రూం నుంచి నిరంతరం పరిశీలించేందుకు వీలుంటుంది.

బందోబస్తు కోసం రంగంలో దిగిన 27 వేల మంది పోలీసులను జోన్ల వారిగా కేటాయించారు. నగరంలో 18 జంక్షన్లను కీలకమైనవిగా గుర్తించారు. ఇక్కడ సాయుధ బలగాలను మొహరించారు. ఇదే సమయంలో జంట నగరాలు, శివార్లలో బందోబస్తును నిరంతరం పర్యవేక్షించేందుకు ఏడు లక్షలకు పైగా సిసి కెమెరాల సేవలను వాడుకోనున్నారు. కాగా శనివారం నాటి నిమజ్జనంలో ట్యాంక్‌బండ్‌లో మొత్తం మీద 25 వేల విగ్రహాలు నిమజ్జ్ఞం అయ్యే వీలుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక నిమజ్జనం వేళ డిజెలను నిషేధించగా, మద్యం తాగి ఎవరూ రావద్దని, ఇలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఇదే సమయంలో పేలుడు పదార్థాలను గుర్తించేందుకు ప్రత్యేకంగా శిక్షణ పొందినజాగిలాలను, ఆపదలో వున్న వారిని రక్షించేందుకు గజ ఈతగాళ్లను రంగంలో దించారు. ఎవరికైనా ఏమైనా జరిగితే వెంటనే వైద్య సేవలందించేందుకు పలుచోట్ల అంబులెన్స్‌లు సిద్ధంగా వుంచారు. ఆకతాయిల భరతం పట్టేందుకు షీ బృందాలను రంగంలో దించారు. ఖైరతాబాద్ వినాయక విగ్రహం ఈసారి కూడా త్వరగానే నిమజ్జనం అయ్యేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. బందోబస్తు ఏర్పాట్ల గురించి సిటీ కొత్వాల్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ నిమజ్జనం రోజున డిజెలకు అనుమతి లేదని తెలిపారు. నిమజ్జనం కోసం వచ్చే వారు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. గణేష్ నిమజ్జనం వీలైనంత త్వరలో పూర్తి చేసేందుకు కృషి చేస్తామని ఆయన వెల్లడించారు.

**రెండు రోజుల పాటు మద్యం, కల్లు అమ్మకాలు బంద్**

ఇదిలావుండగా గణేశ నిమజ్జనం పురస్కరించుకుని జంట నగరాలు, శివార్లలో రెండు రోజుల పాటు మద్యం, కల్లు అమ్మకాలను నిలిపివేస్తూ సర్కారు ఆదేశాలు జారీ చేసింది. శనివారం ఉదయం ఆరు గంటల నుంచి ఆదివారం సాయంత్రం ఆరు గంటల వరకు మద్యం, కల్లు అమ్మకాలు చేయరాదు. మద్యం దుకాణాలు, కల్లు కాంపౌండ్లు, బార్ అండ్ రెస్టారెంట్లు, పబ్‌లు, మిలటరీ క్యాన్‌టీన్లు, స్టార్ హోటళ్లకు కూడా ఈ నిషేధం వర్తి స్తుందని సర్కారు జారీ చేసిన ఉత్తర్వులో వుంది.

## గణేశ నిమజ్జనం సందర్భంగా నేడు హైకోర్టుకు సెలవు

### హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ పరిధిలోని కోర్టులకూ సెలవు

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** జంట నగరాలలో శనివారం జరగనున్న గణేశ నిమజ్జనం నేపథ్యంలో హైకోర్టుకు సెలవు ప్రకటించారు. దీంతో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధుల్లోని కోర్టులకు, తెలంగాణ జుడిషియల్ అకాడమి, తెలంగాణ లీగల్ సెల్ అథారిటీ, హైకోర్టు లీగల్ సర్వీసెస్‌కమిటీ, మిడియేషన్, ఆర్బిట్రేషన్ కేంద్రాలకు కూడా సెలవు ప్రకటించారు. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

## 'భద్రత' లేదా?

>> లకు తరలివెళ్లారు. ఎటువంటి ప్రాణనష్టం లేదని అధికారులు తెలిపారు. గురుదాస్‌పూర్, అమృత్‌సర్, ఫిరోజ్‌పూర్ సెక్టార్లలోసుమారు 30 కిలోమీటర్ల కంచె కొట్టుకుపోయిందని పంజాబ్‌ఫ్రాంటియర్ డిఐజి ఎకె విద్యార్థిని తెలిపారు. అమృత్‌సర్‌లోని షాజాదా గ్రామంలో నీటిమట్టంపెరగడంతోసైనికులు కమల్‌పూర్‌లోని బిఎస్‌ఎఫ్‌పోస్టును ఖాళీ చేసారు. కర్తార్‌పూర్ సాహిబ్‌కారిడార్ సమీపంలోని ప్రసిద్ధ బిఎస్‌ఎఫ్ పోస్టుకూడా మునిగిపోయింది.ఇసిబ్బంది తాత్కాలికంగా డేరాబాబా నానక్‌లోని గురుద్వారా దర్బార్ సాహిబ్‌కు తరలివెళ్లారు. రావినదిలో జీరో లైన్‌కు రెండువైపులా వరదలు వచ్చాయి. దీనితో పాకిస్థాన్‌రేంజర్లుకూడా తమ ఫార్వర్డ్ పోస్టులను వదిలివేయాల్సి వచ్చింది.

## కాంగ్రెస్ సభ

>> చేత బిసి డిక్లరేషన్ ప్రకటించారు.రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలలలో బిసి రిజర్వేషన్ పెంచుతామని అప్పటి టిపిసిసి అధ్యక్షుడునేటి సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కులగణన చేసి బిసి జనాభా లెక్కలు తేల్చారు. అసెంబ్లీలో తీర్మానం చేసి 42శాతం రిజర్వేషన్ బిల్లును గవర్నర్‌కు పంపారు.గవర్నర్ నుంచి కేంద్రానికి ఆ బిల్లు చేరింది.

# విద్యతోనే వెలుగుదారి

>> కంటే నాణ్యమైన విద్య అందిస్తామని ప్రతిజ్ఞ చేద్దామన్నారు. ప్రతి ఏటా 200 మంది టీచర్లను విదేశాలకు పంపి.. అక్కడి విద్యా విధానం అధ్యయనం చేసేలా ప్రోత్సహిం చాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఢిల్లీలో కేజ్రీవాల్ రెండోసారి ముఖ్యమంత్రి కావడానికి ఆయన చేసిన విద్యాభివృద్ధే కారణమన్నారు. తనకు స్వార్థం ఉందని.. టీచర్లు బాగా పని చేస్తే తానూ రెండోసారి, మూడోసారి సీఎం అవ్వాలనుకుంటున్నానని అన్నారు. మీతోపాటే నేనూ కష్టపడతానని.. తాను పామ్ హౌస్‌లో పడుకుంటాను.. మళ్లీ సీఎంను చేయండి అని అనట్లేదన్నారు. విద్యాభివృద్ధి కోసం టీచర్లు ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తానని స్పష్టం చేశారు. ఐటీఐలను అప్డేట్ చేసి ఆడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్స్‌గా మార్చామన్నారు. ముఖ్యమంత్రులు చాలా మంది రెవెన్యూ, ఆర్థిక శాఖ, నీటిపారుదల శాఖలని వారి దగ్గర పెట్టుకుంటారని.. కానీ నేను మీ సోదరుడిగా విద్య శాఖను నా దగ్గర పెట్టుకున్నానని అన్నారు. స్వయంగా విద్య శాఖను పర్యవేక్షిస్తున్నానని తెలిపారు. విద్యశాఖ వివాదస్పదమని ఆ శాఖను తీసుకోవద్దని.. వేరే వారికి కేటాయించాలని తన సహచరులు చెప్పినప్పటికీ తాను కావాలనే విద్య శాఖను తన వద్దే ఉంచుకున్నానని రేవంత్ రెడ్డి తెలిపారు. విద్యా శాఖలో సమస్యలు అర్థం చేసుకుని పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నానని.. పదేళ్లలో విద్యా శాఖ అస్తవ్యస్తమైందన్నారు. కేజీ టూ పీజీ ఉచిత విద్య అందిస్తామని గత ప్రభుత్వం చెప్పి పదేళ్ల గడిచిందని.. మరి అది అమలు జరిగిందా అనేది మీరే ఆలోచించుకోవాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రతీ పల్లెకు జైతెలంగాణ నినాదాన్ని చేరవేసింది ఉపాధ్యాయులేనని.. ఆనాడు బడికి వచ్చే పిల్లల్నే కాదు తల్లిదండ్రులను ప్రభావితం చేసి ఉద్యమం వైపు నడిపించింది ఉపాధ్యాయులేనన్నారు. గత పదేళ్లుగా టీచర్ల బదిలీలు జరగలేదని.. 2017 నుంచి టీచర్ల నియామకాలు జరగలేదన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కేవలం 55 రోజుల్లో 11 వేల టీచర్ల నియామకాలు పూర్తి చేశామన్నారు. విద్యార్థులకు అందించే డైట్, కాస్మొటిక్ చార్జీలు పెంచాలన్న ఆలోచన ఆనాటి పాలకులకు ఎందుకు రాలేదని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. విద్యను లాభసాటి వ్యాపారంగా మార్చుకుని ఆధిపత్యం చెలాయించాలని ఆనాటి పాలకులు ప్రయత్నించారని మండిపడ్డారు. ప్రొఫెసర్లను నియమించకుండా యూనివర్సిటీలను నిర్వీర్యం చేశారని, ఉస్మానియా, కాకతీయ వైభవాన్ని కోల్పోయె పరిస్థితి ఆనాడు తీసుకొచ్చా రన్నారు. ఉపాధ్యాయ సంఘాలు ఎప్పుడు తన దగ్గరకు వచ్చినా సమస్యలు విని పరిష్కరించే ప్రయత్నం చేశామన్నారు. ఎక్కడైనా కొంత ఆలస్యం కావచ్చు కానీ సమస్య పరిష్కరించకుండా ఉండలేదన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంలో ఉపాధ్యాయుల సేవలు అవసరమన్నారు. తెలంగాణలో 27 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 24 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు రాష్ట్రంలో ఉన్న 10 వేల ప్రైవేటు పాఠశాలల్లో 34 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని అన్నారు. ప్రైవేట్ స్కూల్స్ కంటే ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎక్కువ విద్యావంతులు, సామాజిక బాధ్యత తెలిసినవారన్నారు. టీచర్లకు జీతాలు ఇచ్చి చేతులు దులుపుకుంటే సరిపోదని.. మౌళిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో స్వయంసహాయక సంఘాలకు నిర్వహణ బాధ్యత అప్పగించామన్నారు. ప్రతీ ఏటా రూ. 130 కోట్లు స్కూల్స్ నిర్వహణకు నిధులు మంజూరు చేస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు.

చదువొక్కటే పేదల తలరాతను మారుస్తుందని.. రాష్ట్రం తలరాతను మారుస్తుంది టీచర్లని అన్నారు. గతంలో ప్రతీ ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గేదని.. కానీ ప్రజా ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 3లక్షలు పెరిగిందనానరు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూల్స్‌కు ధీటుగా తీర్చిదిద్దుదామని ప్రతినబూనుదామన్నారు. తెలంగాణకు ఒక నూతన ఎడ్యుకేషన్ పాలసీ అవసరమని.. పేద పిల్లల జీవితాలను మార్చేలా ఆ పాలసీ ఉండాలని.. అందుకే ఎడ్యుకేషన్ పాలసీని రూపొందించేందుకు కమిటీని నియమించామన్నారు. పునాది బలంగా ఉన్నప్పుడే ఎన్ని అంతస్తులైనా కట్టొచ్చని.. విద్య విషయంలోనూ పునాది బలంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచిస్తున్నానని.. వరల్డ్ బెస్ట్ మోడల్‌గా యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్‌ను నిర్మిస్తున్నామన్నారు. 65 ఐటీఐలను టాటా కంపెనీతో కలిసి జాయింట్ వెంచర్ గా ఏటీసీలుగా అప్ గ్రేడ్ చేశామన్నారు. దేశ ప్రతిష్టను పెంచేలా తెలంగాణలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ అకాడమీని ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. 140 కోట్ల మంది జనాభా ఉన్న భారత్.. ఒలింపిక్స్‌లో ఒక్క స్వర్ణం సాధించలేదన్నారు. కానీ దక్షిణ కొరియాలో ఒక్క యూనివర్సిటికి చెందిన వారే 16 స్వర్ణపతకాలు సాధించారన్నారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీయండి. వారికి ప్రభుత్వమే అన్ని సదుపాయాలు కల్పిస్తుంది. క్రీడల్లో రాణించిన క్రికెటర్ సిరాజ్, బాక్సర్ నిఖత్ జరీన్ డీఎస్పీ అయ్యారని రేవంత్ తెలిపారు. తెలంగాణలో డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపేందుకు ఈగల్ ఫోర్స్‌ను తీసుకొచ్చామన్నారు. విద్యార్థుల భవిష్యత్తే తెలంగాణ భవిష్యత్తని.. ఆ భవిష్యత్తును మీ చేతుల్లో పెడుతున్నామన్నారు. మీరు, నేను కలిసి తెలంగాణను పునర్నిర్మించుకుందామని.. అందుకు అందరూ కలిసిరావాలని విజ్ఞప్తి చేస్తున్నానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తానూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకొనే ఈ స్థాయికి వచ్చానని.. గతంలో గురుపూజోత్సవం ఎప్పుడైనా జరిగిందా? అందులో సీఎం పాల్గొన్నారా? అని ప్రశ్నించారు. తెలంగాణ పునర్నిర్మాణంలో టీచర్ల సహకారం కావాలన్నారు.

# టీచర్ పోస్టులు

>> విరమణ పొందుతుంటారు. అదే మాదిరిగా ఈ ఏడాది కూడా 6వేల మంది వరకు ఉపాధ్యాయులు పదవివిరమణపొందారు. దీంతో మొత్తంగా సుమారు 10వేలకి పైగా పోస్టులు ఖాళీగా ఉండే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలను వెంటనే డిఎస్‌సి ద్వారా భర్తీ చేయాలని బిఎడ్, డిఎడ్ అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే ఈ యేడాది జూన్‌లో టెట్ పరీక్షలను నిర్వహించి ఫలితాలను సైతం విడుదల చేశారు.

దీంతో ఎలాగూ టెట్ పరీక్షను కూడా నిర్వహించారు కాబట్టి.. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకోసం కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చినట్టుగా డిఎస్‌సినిర్వహించి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు. అయితే రాష్ట్రంలోని 26,120 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో 1.08 లక్షల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో 16.70 లక్షల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈలెక్కన చూస్తే.. విద్యార్థులు, ఉపాధ్యాయుల రేషియా ఉండాల్సినదానికంటే ఎక్కువగానేఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

# దసరా కానుక

>> కమ్మ పండుగ సందర్భంగా ఒక్కో మహిళకు రెండు చీరలు పంపిణీ చేయనుంది.అయితే గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో కూడా మహిళలకు బతుకమ్మ చీరల పేరుతో ప్రభుత్వం చీరలు పంపిణీ చేసింది. అయితే ఆ చీరలు చాలా నాసిరకంగా ఉండేవి. దీంతో చాలా మంది వాటిని తీసుకోవడానికి ఇష్టపడేవారు కాదు. ఒకవేళ తీసుకున్నా.. వినియోగించేవారు కాదు. పండుగ కానుక పేరు చెప్పి ఇంత నాసిరకం చీరలు పంపిణీ చేయడం ఎందుకు అనే విమర్శలు కూడా వచ్చాయి. వీటిని దృష్టిలో పెట్టుకున్న రేవంత్ సర్కార్.. ఈసారి ఆడబిడ్డలకు మంచి నాణ్యమైన చీరలు పంపిణీ చేసేందుకు రెడీ అవుతోంది.దీనిలో భాగంగా ఒక్కొక్కటి 800 రూపాయల విలువ గల రెండు నాణ్యమైన చీరలు అందిచేందుకు రేవంత్ సర్కార్ రెడీ అయ్యింది. ఇందిరా మహిళా శక్తి పథకం కింద సెప్టెంబర్ 22 నుంచి 30 వరకు రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల చీరలు పంపిణీ చేయనున్నారు. ఈ పథకం ద్వారా 6000 మందికి పైగా చేనేత కార్మికులకు ఉపాధి కల్పించింది సర్కార్. చీరలు చాలా అందంగా.. ఎంతో మన్నికగా ఉన్నాయని అంటున్నారు. రేవంత్ సర్కార్ పంపిణీ చేయబోయే చీరలకోసం ఆడవారు ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు.

# 18 నుంచి ఏపి అసెంబ్లీ సమావేశాలు

**విజయవాడ,సెప్టెంబర్ 5,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 18వ తేదీ నుంచి జరుగబోతున్నాయి. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారు. అసెంబ్లీ సమావేశాలు18వ తేదీ ఉదయం 9 గంటలకు, కౌన్సిల్ సమావేశాలు ఉదయం 10 గంటలకు మొదలవుతాయి. మొదటి రోజు సమావేశం అనంతరం రెండు సభల బిఎసి సమావేశాలు జరుగుతాయి. ఆరోజు సమావేశాల ఏజెండా, ఎన్ని రోజులు సభలు జరగాలి అనే అంశంపై నిర్ణయం తీసుకుంటారు. ఈ సారి కూడా అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాబోమని ఇప్పటికే వైసీపీ అధినేత జగన్ చెప్పారు. అయితే, వరుసగా 60 అసెంబ్లీ పని దినాలు హాజరుకానిపక్షంలో అనర్హత వేటు పడుతుందని ఇప్పటికే డిప్యూటి స్పీకర్ రఘురామకృష్ణంరాజు వైసీపీ నేతల్ని హెచ్చరించారు. తిరుపతిలో సెప్టెంబరు 14, 15 తేదీల్లో మహిళా ఎమ్మెల్యేలకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

## వారం - వర్జ్యం

06-09-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
చతుర్దశి రా. 1.38
ధనిష్ఠ రా. 10.52
వర్జ్యం : తె.5.41-ఉ.7.12
దు.తె.5.56-ఉ.7.33
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** భూముల విషయంలో ఏర్పడిన వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి.

**వృషభం :** ఆరోగ్యం వాహనాల విషయంలో మెలుకువ అవసరం. సోదరుల కలయిక.

**మిథునం:** సంతాన విద్యా విషయంలో నూతన బాధ్యతలు చేపడతారు. శుభవార్తలు.

**కర్కాటకం :** సోదరి, సోదరులతో విభేదాలు తలెత్తుతాయి. వృత్తి, వ్యాపారాలు విస్తరిస్తారు.

**సింహం:** చిన్ననాటి మిత్రుల ద్వారా కీలక సమాచారం తెలుసుకుంటారు. వాహనసౌఖ్యం.

**కన్య :** పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. ప్రయాణాలు.

**తుల :** గృహం కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి. సంఘంలో ఓ ప్రత్యేక గౌరవం పొందుతారు.

**వృశ్చికం:** ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. కొత్త పెట్టుబడులకు అనుకూల సమయం.

**ధనుస్సు:** కోర్టు కేసులు పరిష్కారమవుతాయి. శుభకార్యాలలో బంధుమిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**మకరం:** రాజకీయ, కళా రంగాల వారికి ప్రభుత్వం నుండి ఆహ్వానాలు అందుతాయి.

**కుంభం:** భూముల విషయంలో నూతన అగ్రిమెంట్లు చేసుకుంటారు. ఋణాలు తీరుస్తారు.

**మీనం :** కొన్ని అవకాశాలు అప్రయత్నంగా లాభిస్తాయి. భాగస్వామ్య వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కాళేశ్వరంపై కదిలిన సిబిఐ

>> వాత శుక్రవారం నాడు సిబిఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్ హఠాత్తుగా హైదరాబాద్‌కు వచ్చారు. కోఠిలోని సిబిఐ జోనల్ కార్యాలయాన్ని ఆయన సందర్శించి ఇక్కడి అధికారులతో సమావేశమయ్యారు. ఈ భేటీ వివరాలు తెలియరానప్పటికీ కాళేశ్వరం ప్రాజెక్టులో అక్రమాలకు సంబంధించి ఎన్‌డిఎస్‌ఎ ఇచ్చిన నివేదికను ఆ యన పరిశీలించి దీనిపై ఎలా ముందుకు వెళ్లాలనే దానిపై ఇక్కడి అధికారులతో చర్చించినట్లు తెలిసింది. దీంతో పాటు అంతకు ముందు రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఇదే ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై రూపొందించిన నివేదికను కూడా ప్రవీణ్ సూద్ పరిశీలించినట్లు తెలిసింది.

కాళేశ్వరం ప్రాజెక్టులో అక్రమాలపై పిసి ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కెసిఆర్, హరీష్ రావు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారించిన హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించడం తెలిసిందే. అయితే సర్కారు మాత్రం ఎన్‌డిఎస్‌ఎ ఇచ్చిన నివేదిక ఆధారంగా సిబిఐ విచారణను కోరుతూ కేంద్రానికి లేఖ రాసింది. ఇది హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘించడం కాదని, ఎన్‌డిఎస్‌ఎ నివేదిక ఆధారంగా విచారించడం మాత్రమేనని అడ్వకేట్ జనరల్ తెలిపారు. ఈ నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టులో అక్రమాలపై సిబిఐ విచారణ ఎలా సాగుతుందనే దానిపై ఉత్కంఠ నెలకొన్న తరు ణంలో ఆ విభాగం డైరెక్టర్ ప్రవీణ్ సూద్ ఢిల్లీ నుంచి ప్రత్యేకంగా హైదరాబాద్‌కు వచ్చి జోనల్ అధికారులతో సుదీర్ఘంగా భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. అయితే ప్రవీణ్ సూద్ హైదరాబాద్ రాకకు సంబంధించి జోనల్ సిబిఐ అధికారులు ఎలాంటి వివరాలు వెల్లడించలేదు.

# పెరుగుతున్న దూరం

>> ఆయన తాము భారత్, రష్యాలకు దూరమైనట్లే అని వ్యాఖ్యానించారు. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) సదస్సులో మోడీ, పుతిన్, జిన్‌పింగ్‌లు కలిసి ఉన్న ఫొటోను షేర్ చేసిన ట్రంప్ ఆ మూడు దేశాలకు ఉజ్వల భవిష్యత్తు కలిగి ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. 'భారత్, రష్యాలను చైనాకు కోల్పోయినట్లు కనిపిస్తోంది. ఆ మూడు దేశాలకు ఉజ్వల, సుసంపన్నమైన భవిష్యత్తు ఉండాలని కోరుకుంటున్నా' అని ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో వ్యంగ్యంగా పోస్టు పెట్టారు.

ప్రతీకార సుంకాలతో ప్రపంచ దేశాలపై ట్రంప్ విరుచుకుపడుతున్న వేళ తియాన్‌జిన్ వేదికగా జరిగిన ఎస్‌సిఒ సదస్సులో రష్యా, చైనా, భారత్ అధినేతలు ఒకే వేదికపై కనిపించారు. అంతర్జాతీయంగా ఎదురవుతున్న సవాళ్లపై చర్చించిన వీరు తామంతా ఏకతాటిపై ఉన్నట్లు సంకేతాలిచ్చారు. అంతేకాకుండా ట్రంప్,జిన్‌పింగ్, మోడీలు పరస్పరం కరచాలనాలు చేసుకుంటూ ఎడతెగని చర్చలు జరపడం కూడా అమెరికా అధ్యక్షుడికి ఎంతమాత్రం మింగుడుపడలేదు. అందువల్లనే ఈ ముగ్గురి సంబంధాలపై ట్రంప్ ఛలోక్తులు విసిరినా కొంత కలవరపాటుకు గురయ్యారు. ప్రపంచ వాణిజ్యరంగం పరంగాను, ఉక్రెయిన్‌తో యుద్ధంపరంగాను ఎదురవుతున్న సమస్యలపైనా ఈ ముగ్గురునాయకులు చర్చలుజరిపారు. ఇంధనం నుంచి రక్షణ, వాణిజ్యం, ఉగ్రపోరు ఇతర అన్నింట్లోను పరస్పరం సమైక్యంగా పనిచేయాలని ఈ ముగ్గురునేతలు నిర్ణయించారు. వీరి సమావేశంపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరిగింది. ట్రంప్ తీరువల్లే ఆ మూడు దేశాలు ఒక్కటయ్యాయనే వాదన కూడా అమెరికాలో వినిపించింది. ఈ నేపథ్యంలో మిత్ర దేశంగా ఉన్న భారత్ దూరమైనట్లు ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రష్యాతో ఇంధనం కారుచౌకగాకొని అధిక ధరలకు ఉక్రెయిన్‌కు విక్రయిస్తుండటంవల్లనే యుద్ధం కొనసాగుతోందని, ఇందుకు పరోక్షంగా భారత్ కారణమని కూడా ట్రంప్ హెచ్చరికలుచేస్తూ మొత్తంగా 50శాతం సుంకాలు వసూలుచేస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఢిల్లీ,మాస్కో బీజింగ్‌లమధ్య బలపడుతున్న బంధాన్ని ట్రంప్ ఇలా బహిరంగంగా అంగీకరించడం ఇదే తొలిసారి. దశాబ్దాలుగా చైనా ప్రభావాన్ని అడ్డుకోడానికి భారత్‌ను ఒక వ్యూహాత్మక భాగస్వామిగా అమెరికాచూస్తోంది. రిపబ్లికన్లు, డెమొక్రాట్లు తేడాలేకుండా అన్ని అమెరికా ప్రభుత్వాలు భారత్‌తో సంబంధాలు బలపరుచుకోడానికే ఆసక్తిచూపించాయి. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడు అయిన తర్వాత ఆయన నిర్ణయాలు పరిస్థితులను సమూలంగా మార్చివేసాయి. సుంకాలమీద సుంకాలు వేస్తుండటంతో ఇరుదేశాలమధ్య అంతరం భారీగాపెరిగింది.

# ఒకే పన్ను వేయలేం

>> జిఎస్టీని ప్రవేశపెట్టిన దివంగత నేత అరుణ్ జైట్లీతో తనకు జరిగిన సంభాషణను ఈ సందర్భంగా ఆమె గుర్తుచేసుకున్నారు. బెంజ్ కారును, హవాయి చెప్పులను ఒకే గాటన కట్టి ఒకే పన్ను విధించగలమా అని జైట్లీ గారు అనేవారు. బెంజ్ కారు కొనే వ్యక్తి ఎక్కువ పన్ను చెల్లించగలడు. కానీ, హవాయి చెప్పులు కొనే సామాన్యుడు అంత భారం మోయలేడు. అందుకే ప్రస్తుతానికి దేశంలో ఒకే జిఎస్టీ రేటు లేదు. అలా చేయడం అన్యాయం అవుతుందని నిర్మల వివరించారు. దేశంలోని అన్ని ప్రాంతాలు సమానంగా ఆర్థిక అభివృద్ధి సాధించినప్పుడు మాత్రమే ఒకే పన్ను విధానం గురించి ఆలోచించగలమని ఆమె తెలిపారు. ప్రభుత్వం తగ్గించిన పన్నుల ప్రయోజనాలు పూర్తిగా వినియోగదారులకు చేరేలా కఠినమైన పర్యవేక్షణ ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు. ఇదే సమయంలో, పరిశ్రమ వర్గాల నుంచి డిమాండ్లు వస్తున్నప్పటికీ పెట్రోల్, డీజిల్‌ను జిఎస్టీ పరిధిలోకి తీసుకువచ్చే ఆలోచన ప్రస్తుతానికి లేదని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. అలాగే, రియల్ ఎస్టేట్ డెవలపర్లకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటిసి) పునరుద్ధరించే ప్రణాళికలు కూడా ఏమీ లేవని ఆమె తేల్చి చెప్పారు.అలాగే విపక్ష పార్టీలపైనా ఆర్థికమంత్రి విమర్శలుచేసారు. ఒకప్పుడు జిఎస్టీని గబ్బర్‌సింగ్ ట్యాక్స్ అంటూ ఎగతాళిచేసినవారే ఇపుడు పన్ను సంస్కరణలుచేయగానే క్రెడిట్ తీసుకునేందుకు ఉత్సాహంతో ఉన్నారని అన్నారు. గత యుపిఎ ప్రబుత్వంలో 91శాంవరకూ ఆదాయపు పన్ను విధించిన రోజులున్నాయన్నారు. జిఎస్టీలో సంస్కరణలవల్ల రాష్ట్రాలతోపాటు కేంద్రానికి కూడా ఆదాయంలో కొంత కోత ఉంటుందని నిర్మలా సీతారామన్ తెలిపారు. తమ ప్రభుత్వానికి ప్రజల అవసరాలే ప్రథమం అని ఆ తర్వాతనే రాబడులపై ఆలోచిస్తామన్నారు. ట్యారిఫ్‌లవల్ల ఎగుమతిదారులకు ఎదురయ్యే సమస్యల పరిష్కారంపైనా కేంద్రం దృష్టిపెట్టినట్లు తెలిపారు. 8ఉఊ

# 3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ మా లక్ష్యం

>> గురు వులు ఇసుక పైనే అక్షరాలు దిద్దిన సందర్భాన్ని డిప్యూటీ సిఎం గుర్తు చేశారు. గురుపూజ దినోత్సవం రోజు ఐఎస్‌బి వంటి గొప్ప విద్యాలయంలో ఎగ్జిక్యూటివ్ సెంటర్ ప్రారంభించుకోవడం అభినందనీయం అన్నారు. తాను ఈ స్థానానికి రావడానికి కృషి చేసిన గురువర్యులందరికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గత ఒక్క ఏడాదిలోనే ఐఎస్‌బి దాదాపు 200 ప్రోగ్రాముల ద్వారా 6,000 మందికి పైగా ప్రొఫెషనల్స్‌ను శిక్షణ ఇవ్వడం గొప్ప విషయం అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఐఎస్ బి నీ ఒక విద్యాసంస్థ గానే కాదు, భాగస్వామిగా చూస్తుందని తెలిపారు.తెలంగాణ ప్రభుత్వ ఆరోగ్య అధికారులకు శిక్షణ ఇవ్వడం నుండి, చేతివృత్తులు, ఎన్నికలు లేదా మెట్రో రైలు వంటి రంగాలపై స్వతంత్ర అధ్యయనాలు నిర్వహించడం వరకు, ఒఎస్‌బి తన పరిశోధన ద్వారా విధానాలను ఎలా మలచవచ్చో చూపిందనీ తెలిపారు. తెలంగాణ ఐఎస్‌బి వంటి సంస్థలతో, యంగ్ ఇండియా వంటి కార్యక్రమాలతో మార్పులో భాగమవడమే కాకుండా, దానికి నాయకత్వం వహించాలని సంకల్పించిందన్నారు.దాదాపు 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మితమవుతున్న ఈ సెంటర్, లెక్చర్ హాల్స్, చర్చా స్థలాలు, మౌనంగా ఆలోచించడానికి మూలలు, ఆ ఆశయానికి ఓ నంగరంలా నిలుస్తుందన్నారు.ఈ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సందర్భంలో, సహకారం అనే కొత్త యుగాన్ని కూడా ప్రారంభిద్దాం, రాష్ట్రం, విద్యాసంస్థలు, పరిశ్రమ కలిసి భారతదేశ భవిష్యత్తును మలచే మార్గంలో పయనిద్దాం అని పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ దారిలో ధృఢ నిశ్చయంతో నడుస్తుందనీ తెలిపారు.విద్య అనేది కేవలం ప్రొఫెషనల్స్ తయారు చేయడమే కాకుండా, సమాజంకోసం, మానవత్వం కోసం నాయకులను తీర్చిదిద్దాలన్నది మా ప్రజా ప్రభుత్వ సంకల్పం అని తెలిపారు. ఈ సెంటర్ భవిష్యత్ తరాలకు దిక్సూచి ఇలా మారి, వారిని అగ్రగామిత్వం, సమానత్వం, ఆవిష్కరణల వైపు దారి చూపాలని కోరుకుంటున్నాను అన్నారు.స్కిల్స్ యూనివర్సిటీ ఇప్పటికే ప్రారంభమై, తొలి సంవత్సరంలోనే వందలాది విద్యార్థులకు శిక్షణ ఇచ్చింది.2025 నాటికి దాని శాశ్వత కాంపస్ ఫ్యూచర్ సిటీ"లో ఏర్పడుతుంది.అలాగే, మొదటి దశలో 58 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, రూ.11,000 కోట్లకు పైగా పెట్టుబడితో, విద్యార్థులను సమగ్రంగా తీర్చిదిద్దడానికి, అకాడమిక్ నుంచి పోటీ పరీక్షల వరకు నిర్మితమవుతున్నాయి.మీ సహకారంమార్గదర్శకత్వం, నిధులు లేదా భాగస్వామ్యం రూపంలో వాటి ప్రభావాన్ని మరింత పెంచి, ఈ రోజు మనం జరుపుకుంటున్న రాష్ట్రనిర్మాణం భావనను మరింత విస్తరించగలదనీ డిప్యూటీ సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సెంటర్ మనకు ఒక సత్యాన్ని గుర్తు చేస్తుంది, ఎంత సీనియర్ అయినా నేర్చుకోవడం ఆగదు.కొన్నిసార్లు, ఉత్తమ నాయకులు అంటే ఉత్తమ విద్యార్థులే అని డిప్యూటీ సీఎం వివరించారు.ఈ సెంటర్ కేవలం ఎంబిఎ లు, సిఇఒలు మాత్రమే కాకుండా భారతదేశం గర్వపడేలా సమస్యలకు పరిష్కారాలు కనుగొనే వ్యక్తులను తయారు చేయాలి అన్నారు.

# రాష్ట్రంలో కొత్తగా మెడికల్ ఎక్విప్‌మెంట్ ఉత్పత్తి యూనిట్

## జర్మనీకి చెందిన బేబిగ్ సంస్థ ఏర్పాటు

## సిఎం రేవంత్‌రెడ్డితో సంస్థ ప్రతినిధుల భేటీ

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొత్తగా మెడికల్ ఎక్విప్‌మెంట్ ఉత్పత్తి యూనిట్ ప్రారంభం కానుంది. జర్మనీకి చెందిన బేబిగ్ మెడికల్ కంపెనీ ఈ యూనిట్‌ను ప్రారంభించనుంది. ఇందుకు సంబంధించి బేబిగ్ చైర్మన్, సిఇఒ జార్జ్‌చాన్ బృందం శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో కలిశారు. రాష్ట్రంలో మెడికల్ ఎక్విప్‌మెంట్ ఉత్పత్తి యూనిట్‌ను ప్రారంభిం చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వారు ముఖ్యమంత్రికి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. బేబిగ్ సంస్థకు అవసరమైన సహకారం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. మెడికల్ ఎక్విప్‌మెంట్ ఉత్పత్తి చేసే యూనిట్‌ను నెలకొల్పేందుకు అనువైన స్థలం, ఇతర అంశాలకు సంబంధించి అధ్యయనం చేసి వెంటనే నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వాసుపత్రుల్లో మెడికల్ ఎక్విప్‌మెంట్‌తోపాటు, కేన్సర్ చికిత్సకు ఉపయోగపడే రేడియేషన్ సెంటర్లను కూడా ఏర్పాటు చేయాలని బేబిగ్ ప్రతినిధులకు సిఎం రేవంత్‌రెడ్డి సూచించారు.



# దీపావళిలోపే 'వందేభారత్ స్లీపర్' రైలు ప్రారంభం

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** ఢిల్లీ నుంచి పాట్నా మీదుగా ప్రయాగ్ రాజ్‌కు వెళ్లే తొలి వందేభారత్ స్లీపర్ రైలు ప్రారంభం కానుంది. దీపావళి ల్లోపే పరుగులు పెట్టించాలని రైల్వేశాఖ యోచిస్తుంది. వేగం, సౌకర్యం, భద్రత పరంగా ఒక కొత్త ప్రయాణ అనుభూతిని అందించనుంది. స్లీపర్ రైలు మెరుగైన సదుపాయాలు, వేగం వల్ల రాజ్‌ధాని ఎక్స్‌ప్రెస్ కన్నా ఎక్కువ మంది ప్రయాణికులను ఆకర్షించనుంది. ఈ రైలులో సిసిటివి కెమెరాలు, ఎల్ఇడి స్క్రీన్లు, ఆటోమేటిక్ డోర్లు, అడ్వాన్స్‌డ్ ఫైర్ సేఫ్టీ సిస్టం, పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టం, విజువల్ ఇన్ఫర్మేషన్ డిస్ప్లేలు ఉంటాయని, ఇది సాధారణ వందే భారత్ చెయిర్ కార్‌కి కొనసాగింపుగా తీసుకువస్తున్నారు. హైస్పీడ్ రైలు స్లీపర్ క్లోచ్‌లు కలిగి ఉండి, విమాన ఛార్జీల కన్నా తక్కువ ఖర్చుతో ప్రయాణించగల మరో ఆప్షన్‌గా తీసుకురాబోతున్నారు. దీన్ని బీఈఎంఎల్ సంస్థ ఆధునిక ఐసీఎఫ్ టెక్నాలజీతో తయారుచేసింది. గంటకు 180 కిలోమీటర్ల వరకు దూసుకుపోయే సామార్థ్యంతో సిద్ధం చేస్తున్నారు. రైలు లోపల అంతా విమానాల్లో ఉండేలా మెరుగైన డిజైన్‌తో తయారు చేశారు. టికెట్ ధర రాజ్‌ధాని ఎక్స్‌ప్రెస్ కంటే 10 నుంచి 15 శాతం ఎక్కువగా ఉంటుందని తెలుస్తుంది. అయితే ఇప్పటికే ట్రయల్ రన్ పూర్తి చేసి, ఢిల్లీలోని శాకర్‌పూర్‌కు స్లీపర్‌కోచ్ రైలును తరలించారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో మార్పులు చేయనున్నారు. ప్రస్తుతం 7 మార్గాల్లో వందే భారత్ రైలు నడుస్తోంది. ఇందులో 4 రైళ్లల్లో 8 కోచ్‌లు, 3రైళ్లు 16 కోచ్‌లతో నడుస్తున్నాయి. ప్రయాణికుల సంఖ్య పెరుగుతుండటంతో అదనపు కోచ్‌లకు కేంద్రం భావిస్తున్నట్లు తెలుస్తుంది.

## కవిత విషయంలో

# ఆచితూచి అడుగులేస్తున్న బిఆర్ఎస్ అధినాయకత్వం

## ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కెసిఆర్ గణపతి హోమం

## కెసిఆర్ మా బాస్ : మాజీమంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబరు 5,ప్రభాతవార్త:** భారత రాష్ట్రసమితి (బిఆర్ఎస్) నుంచి ఎమ్మెల్సీ కవితను సస్పెండ్ చేశాక కూడా బిఆర్ఎస్ నాయకత్వంపై విమర్శల దాడులు కొనసాగిస్తున్నప్పటికీ బిఆర్ఎస్ అధినేత కెసిఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీమంత్రి హరీశ్‌రావు, మాజీఎంపి సంతోష్‌రావు ఎలాంటి ప్రతి విమ ర్శలు చేయకుండా ఆచితూచి అడుగులు వేస్తున్నారు. లండన్ పర్యటనలో ఉన్న హరీశ్‌రావును.. కవిత వివాదాస్పద వ్యాఖ్యలపై స్పందించాలని కోరినా ఆయన నిరాకరించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన ట్విట్టర్ హ్యాండిల్ నుంచి కారు గుర్తును, కెసిఆర్ పక్కన తాను కూర్చొని ఉన్న ఫొటోను తొలగించారు. బయోలో ఇంతకు ముందు ఎమ్మెల్సీ ఉండగా దానిని సైతం తొలగించారు. మాజీ ఎంపి తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలుగా మాత్రమే పెట్టుకొన్నారు. కెసిఆర్ కుటుంబం మౌనంగా ఉన్నప్పటికి బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మాజీ మంత్రులు మీడియా సమావేశం వేదికగా కవిత వైఖరిని తప్పుపడుతున్నారు. ఇరువైపులా సోషల్ మీడియా బృందాలు ఆసక్తికరమైన పోస్టులు చేస్తూ బిఆర్ఎస్ రాజకీయాలపై ఉత్కంఠత కలిగిస్తున్నారు. కవిత తన కూతురు పుట్టిరోజు సందర్భంగా ఇంట్లోనే పూజలు చేసి కేక్ కట్‌చేశారు. ఆనవాయితీగా జూబ్లిహిల్స్ పెద్దమ్మగుడిలో పూజలు నిర్వహించాల్సి ఉండగా ఈ యేడు గుడికి పోనట్లు తెలిసింది. మరోవైపు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఎర్రవెల్లిలోని తన వ్యవసాయక్షేత్రంలో గణపతిహోమం చేశారు. గత ఐదురోజులుగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిరామరావు, మాజీ మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి ఇతర నాయ కులు అక్కడే ఉన్నారు. తెలంగాణజాగృతి నాయకులు కూడా కవితను విబేధిస్తూ విమర్శలు చేస్తున్నారు.

కోరుట్ల మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ఏకంగా ప్రెస్‌మీట్‌లో కవితకు మతిభ్రమించిందని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం లండన్‌లో పర్యటిస్తున్న హరీష్‌రావు అక్కడి బిఆర్ఎస్ నేతలతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ బిఆర్ఎస్‌కు ఆటుపోట్లు కొత్తేమి కాదన్నారు. కేసులకు భయపడని చరిత్ర గులాబి శ్రేణులదని, బిఆర్ఎస్‌కు ఎప్పటికైనా సుప్రీం కెసిఆర్ అని తెలిపారు. పార్టీలో సొంత నిర్ణయాలు ఉండవని కలిసికట్టుగానే నిర్ణయాలు తీసుకొని పనిచేయడం ప్రజాసేవచేడం కెసిఆర్ తమకు నేర్పారని ఆయనతెలిపారు. రేవంత్ ప్రభుత్వం ఎంక్వైరీలతో డైవర్షన్ రాజకీయాలతో పాలనను గాలికి వదిలేసిందని అన్నారు. హరీష్‌రావు కాళేశ్వరంలో అవినీతికి పాల్పడ్డారని తమ కుటుంబాన్ని చీల్చడానికి కుట్రలు చేశారని ఆరోపించడంతోపాటు ఫ్లైట్‌లో రేవంత్ కాళ్లు హరీష్ పట్టుకొన్నారని కవిత చేసిన వ్యాఖ్యలకు మీడియా ప్రశ్నించినా ఆయన ఇండియాకు వెళ్లాక మాట్లాడుతానని చెప్పారు. ఆయన వ్యక్తిగత సిబ్బంది కూడా తరువాత మాట్లా డుతారని మీడియాను బుజ్జగించారు. శనివారం హైదరాబాద్‌కు రాగానే నేరుగా ఎర్ర వెల్లి ఫామ్‌హౌజ్‌కు వెళ్లి కెసిఆర్‌తో సమావేశం కాబోతుండటంతో ఉత్కంఠత నెల కొంది. కాళేశ్వరం మూడు పిల్లర్లు కుంగితే రాద్దాంతం చేస్తున్నారని ప్రభుత్వంపై ఆయన లండన్‌లో విరుచుకుపడ్డారు. ఏడాదిన్నర నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేయడం లేదని, హైడ్రా వల్ల నగరంతోపాటు శివారు ప్రాంతాల్లో రియల్‌ఎస్టేట్ కుప్ప కూలిందని అన్నారు. తెలంగాణకు ఎన్నారైలు పెట్టుబడి పెట్టేందుకు వెనుకాడు తున్నారని ఆయన ఆవేదన చెందారు. తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బిఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని రాసిపెట్టుకోండని కామెంట్ చేశారు. రేవంత్‌రెడ్డి పాలన చూశాక ప్రజలకు కెసిఆర్ విలువ ఏంటో తెలిసిందని అన్నారు. రాష్ట్రంలో అవినీతి విచ్చలవిడిగా రాజ్యమేలుతోందని తెలంగాణలో కాంగ్రెస్ వెనుకబడ పోతున్నదని ఆయన వ్యాఖ్యానించారు.

# గణేశ నిమజ్జనోత్సవాలకు భారీగా ట్రాఫిక్ ఏర్పాట్లు

## శనివారం ఉదయం ఆరు గంటల నుంచి ఆదివారం ఉదయం పది గంటల వరకు

## ప్రధాన ఊరేగింపు మార్గాల్లో సాధారణ వాహనాలపై నిషేధం

## ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్, ఎన్టీఆర్‌మార్గ్ ప్రాంతాల్లో ఆంక్షలు

## హెల్ప్‌లైన్ కోసం 040-27852482, 8712660600, 9010203626 నంబర్ల ఏర్పాటు



**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** జంట నగరాలలో శనివారం జరగనున్న గణేష్ నిమజ్జనోత్సవాలకు ట్రాఫిక్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. నిమజ్జనం రోజున నగరంలోని అనేక ప్రాంతాలలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నందున ప్రజలు పోలీసులకు సహకరించాలని సిటీ కొత్వాల్ ఆనంద్ కోరారు. ప్రతీయేటా జరిగే విధంగా ఈసారి కూడా బాలాపూర్ నుంచి ట్యాంక్‌బండ్ వరకు 19 కిలోమీటర్ల దూరం ప్రధాన ఊరేగింపు వుండగా, ఈ ఊరేగింపు మార్గంలో వున్న చాంద్రాయ ణగుట్ట, అలియాబాద్, నాగుల్‌చింత, చార్మినార్, మదినా, అఫ్జల్‌గంజ్, మోజం జాహీ మార్కెట్, అబిడ్స్, బషీర్‌బాగ్, లిబర్టి, అంబేద్కర్ విగ్రహం చౌరస్తాల వద్ద ట్రాఫిక్ ఆంక్షలు నిమజ్జనం సమయంలో అమలు చేయనున్నారు. ఇదే సమయ ంలో సికింద్రాబాద్ నుంచి వచ్చే మరో ఊరేగింపు కర్బలా మైదాన్, కవాడిగూడ, ముషీరాబాద్, ఆర్టీసీ చౌరస్తా, నారాయణ గూడ చౌరస్తా, హిమాయ త్ నగర్ చౌరస్తా, లిబర్టి మీదుగా ట్యాంక్‌బండ్ వరకు వుండనుంది. దీంతో పాటు తూర్పు మండలం నుంచి వచ్చే ఊరేగింపు రామాంత పూర్, శివం రోడ్, ఓయు మార్గం, శంకర్‌మఠ్, ఫీవర్ ఆసుపత్రి, బర్కత్‌పురా, నారాయణగూడ, లిబర్టి మీదుగా ట్యాంక్‌బండ్‌కు వరకు రానుంది. సైదాబాద్, దిల్‌సుక్ నగర్‌ల నుంచి వచ్చే మరో ఊరేగింపు నల్లగొండ చౌరస్తా, అంబర్‌పేట్, మూసారంబాగ్, అంబర్‌పేట్‌ల మీదుగా నారాయణగూడ వద్ద ప్రధాన ఊరేగింపులో కలవనుంది. పశ్చిమ మండల పరిధిలోని టోలిచౌకి నుంచి వచ్చే ఇంకో ఊరేగింపు రేతిబౌలి, మొహదీపట్నం, మాసాబ్‌ట్యాంక్, లక్డి కాపూల్ మీదుగా సచివాలయం, ఎన్టీఆర్ మార్గ్ వద్ద ప్రధాన ఊరేగింపులో చేరనుంది. ఎర్రగడ్డ నుంచి వచ్చే మరో ఊరేగింపు పంజాగుట్ట, ఖైరతా బాద్, లక్డికాపూల్, సచివాలయం మీదుగా ఎన్టీఆర్ మార్గ్ వద్ద ప్రధాన ఊరేగింపులో చేరనుంది. పశ్చిమ మండల పరిధిలోనే గల మంగల్‌హాట్, సీ తారాంబాగ్, గోషామహల్ నుంచి వచ్చే ఇంకో ఊరేగింపు మోజంజాహీ మార్కెట్ వద్ద పధాన ఊరేగింపులో కలవనుంది. కాగా నిమజ్జనం తిలకించేందుకు వచ్చే వారు అత్యవసర సమయాల్లో హెల్ప్‌లైన్ కోసం ఏర్పాటు చేసిన 040-27852482, 8712660600, 9010203626 నంబర్లకు ఫోన్ చేయాలని కొత్వాల్ ఆనంద్ కోరారు. నిమజ్జనం రోజున సందర్శకులు సొంత వాహనాల్లో కాకుండా మెట్రో రైలులో ప్రయాణించడం మంచిద ని ఆయన తెలిపారు. నిమజ్జనం కోసం పెద్ద సంఖ్యలో ట్రాఫిక్ పోలీసులను నియమించారు. వీరంతా 24 గంటల పాటు విధుల్లో వుండేలా ఏర్పా ట్లు చేశారు. ఇక నిర్వాహకులు నిమజ్జన కార్యక్రమాన్ని తొందరగా పూర్తి చేయాలని కొత్వాల్ కోరారు. ఇక నిమజ్జనం రోజున ఊరేగింపు జరిగే మా ర్గాలలో శనివారం ఉదయం ఆరు గంటల నుంచి ఆదివారం ఉదయం పది గంటల వరకు సాధారణ వాహనాలకు అనుమతి వుండదు. ఇదే సమయ ంలో ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్, ఎన్టీఆర్ మార్గ్ ప్రాంతాలలో శనివారం ఉదయం ఆరు గంటల నుంచి ఆదివారం సాయంత్రం వరకు ఆంక్షలు అమ లు చేయనున్నారు. పరిస్థితులను బట్టి ఈ ఆంక్షలను ముందుగానే తొలగించడం లేదా పొడిగించడం చేస్తారు. ఇక శంషాబాద్ విమానాశ్రయానికి వె ళ్లేవారు, అక్కడి నుంచి వచ్చే వారు ట్యాంక్‌బండ్ పరిసరాలలోని మార్గాలకు బదులు వేరే మార్గాలను ఎంచుకోవాలని కొత్వాల్ కోరారు. దీంతో పా టు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లేవారు అక్కడి నుంచి వచ్చే వారు నిమజ్జన ఊరేగింపు మార్గాలు కాకుండా వేరే మార్గాలలో వెళ్లాలని కమిషనర్ కోరారు. కాగా ట్యాంక్‌బండ్‌లో నిమజ్జనం కోసం వచ్చే వాహనాలు నిమజ్జనం ముగిసిన తరువాత నెక్లెస్ రోడ్, ఖైరతాబాద్ ఫ్లై ఓవర్, ఖైరతాబాద్ చౌరస్తా, తెలుగుతల్లి విగ్రహం, గోషాల, బండ మైసమ్మ, ఇందిరా పార్క్ ప్రాంతాల మీదుగా వెళ్లాల్సి వుంటుంది.

### ట్రాఫిక్ మళ్లింపు వివరాలు

ఇక నిమజ్జనం సందర్భంగా దక్షిణ మండల పరిధిలో కేశవగిరి, ఓల్డ్ కర్నూల్‌రోడ్, ఇంజన్‌బౌలి, సిటీ కాలేజి వరకు వాహనాలు అనుమతిస్తారు. తూర్పు మండల పరిధిలో చంచల్‌గూడ చౌరస్తా, మూసారాంబాగ్ చౌరస్తా, తోప్‌ఖానా చౌరస్తా, ఏఆర్ పెట్రోల్ బంక్, సెంట్రల్ జోన్ పరిధిలో చాపె ల్ రోడ్, స్కైలైన్ రోడ్, కవాడిగూడ మార్గంలో గల పలు ప్రాంతాలలో ఆంక్షలు వుంటాయి. ఉత్తర మండల పరిధిలో నెక్లెస్ రోడ్‌లో వాహనాలను పూర్తిగా అనుమతించరు. అంతర్ రాష్ట్ర వాహనాలను నిమజ్జనం రోజున 30 గంటల పాటు జంట నగరాలలో అనుమతించరు. ఈ వాహనాలు అ వుటర్ రింగ్ రోడ్డు మీదుగా రాకపోకలు సాగించాల్సి వుంటుంది. అంత రాష్ట్ర, సిటీ ఆర్టీసీ బస్సులు తమకు కేటాయించిన ప్రాంతాల నుంచే రాకపోకలు సాగించాల్సి వుంటుంది. ప్రైవేటు బస్సులు కూడా ఈ నిబంధనలను పాటించాల్సి వుంటుంది.

### పార్కింగ్ కేంద్రాల వివరాలు..
### ఆర్టీసీ బస్సుల మార్గాలు

కాగా నిమజ్జనం కోసం వచ్చే సందర్శకులు తమ వాహ నాలను ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్, ఎంఎంటిఎస్ స్టేషన్, ఎన్టీఆర్ స్టేడియం, లో యర్ ట్యాంక్ బండ్‌రోడ్, పబ్లిక్ గార్డెన్స్, రంగారెడ్డి జిల్లా జెడ్‌పి కార్యాలయం, నిజాం కాలేజి, బుద్ధ భవన్, గోసేవా సదన్ వద్ద నిలిపేందుకు అను మతిస్తారు. కాగా ట్యాంక్‌బండ్ వద్ద నిమజ్జనం కోసం వచ్చే వాహనాలు తిరుగు ప్రయాణంలో డిబిఆర్ మిల్స్, కవాడిగూడ, ముషీరాబాద్, విద్యా నగర్‌ల మీదుగా వెళ్లాల్సి వుంటుంది.

### ఆయా ప్రాంతాల్లో నిమజ్జనానికి ఏర్పాటు చేసిన కృత్రిమ కొలనుల వివరాలు

సంజీవయ్య పార్క్, జలవిహార్, పివి నరసింహారావు మార్గ్, రాజన్న బావిల వద్ద బేబీ పాండ్స్ ఏర్పాటు చేశారు. దీంతోపాటు ఎన్టీఆర్ స్టేడియం, ఐ మాక్స్ థియేటర్, మారేడ్‌పల్లి, చిలకలగూడల వద్ద గలబల్దియా గ్రౌండ్స్, అంబర్‌పేట్ ప్లేగ్రౌండ్స్, ఆజాద్‌నగర్, మూసారాంబాగ్ కృష్ణ తులసినగర్ పార్క్, కుల్సుంపురా, నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లలో పోర్టబుల్ రబ్బర్ ట్యాంకులు ఏర్పాటు చేశారు. దీంతో పాటు సైదాబాద్‌లోని ఏకలవ్య నగర్, గౌలిపురాలోని బతుకమ్మబావి, పివి నరసింహారావు ఎక్స్‌ప్రెస్ హైవే కిందిభాగంలో పిల్లర్ నంబర్ 54 వద్ద, చింతల్‌బస్తీ, గుడి మల్కా పూర్‌లోని అన్నపూర్ణ దేవాలయం, ధోబీఘాట్. ఎన్టీఆర్ స్టేడియం, అంబర్‌పేట్ డంపింగ్ యార్డ్, చిలకలగూడ మున్సిపల్ స్టేడియంలలో ఎగ్జావేషన్ వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేశారు. వీటిని కూడా ఆయా ప్రాంతాల ప్రజలు నిమజ్జనం కోసం వాడుకోవాలని కమిషనర్ ఆనంద్ కోరారు.

# బాలీవుడ్ నటి శిల్పాశెట్టి దంపతులపై లుకౌట్ నోటీసులు



**ముంబయి, సెప్టెంబరు 5:** బాలీవుడ్ నటి శిల్పా శెట్టి, ఆమె భర్త, వ్యాపారవేత్త రాజ్ కుంద్రాల చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. కోట్ల రూపాయల మోసం ఆరోపణలకు సంబం ధించిన కేసులో ముంబై పోలీసులు వారిద్దరిపై లుక్‌అవుట్ సర్క్యులర్ జారీ చేశారు. వ్యాపారం కోసం తీసుకున్న డబ్బును పక్కదారి పట్టించారన్న ఆరోపణలపై ఆర్థిక నేరాల విభాగం (ఈఓడబ్ల్యూ) దర్యాప్తును వేగవంతం చేసింది. 'బెస్ట్ డీల్ టీవీ ప్రైవేట్ లిమిటెడ్' అనే తమ సంస్థ విస్తరణ పేరుతో శిల్పా దంపతులు తన వద్ద నుంచి సుమారు రూ.60 కోట్లు తీసుకున్నారని దీపక్ కొఠారి అనే వ్యాపారవేత్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2015 నుంచి 2023 మధ్య కాలంలో ఈ డబ్బును తీసుకున్నారని, దానిని వ్యాపారానికి కాకుండా వ్యక్తిగత ఖర్చులకు వాడుకున్నారని ఆయన ఆరోపించారు. తీసుకున్న డబ్బును అప్పు గా చూపి, పన్ను ఆదా కోసం దానిని పెట్టుబడిగా మార్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను పెట్టిన పెట్టుబడికి ఏటా 12% వడ్డీతో పాటు అసలు తిరిగి ఇస్తామని హామీ ఇచ్చారని కొఠారి తెలిపారు. దీనికి సంబంధించి 2016 ఏప్రిల్‌లో శిల్పా శెట్టి స్వయంగా తనకు లిఖితపూర్వకంగా వ్యక్తిగత హామీ ఇచ్చారని ఆయన వివరించారు. అయితే, ఆ హామీ ఇచ్చిన కొద్ది నెలలకే శిల్పా శెట్టి కంపెనీ డైరెక్టర్ పదవికి రాజీనామా చేశారని తెలిపారు. అంతేకాకుండా, ఆ సంస్థపై అప్పటికే రూ.1.28 కోట్ల దివాలా కేసు నడుస్తోందన్న విషయాన్ని కూడా తన వద్ద దాచిపెట్టారని ఆయన ఆరోపించారు. కొఠారి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన ఈఓడబ్ల్యూ అధికారులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా శిల్పా శెట్టి, రాజ్ కుంద్రాల ప్రయాణ వివరాలను పరిశీలిస్తున్నారు. సంస్థ ఆడిటర్‌ను కూడా విచారణకు పిలిచినట్లు తెలుస్తోంది. అయితే ఈ ఆరోపణలను శిల్పా, రాజ్ కుంద్రా దంపతులు ఖండించారు. తమ ప్రతిష్ఠకు భంగం కలిగించేందుకే ఈ నిరాధారమైన, దురుద్దేశపూర్వక కేసు పెట్టారని వారు పేర్కొన్నారు.

# పాలకుల మెప్పు కోసం ఇబ్బందిపెడితే తగిన మూల్యం తప్పదు

## ఎక్స్ వేదికపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

**హైదరాబాద్, సెప్టెంబరు 5,ప్రభాతవార్త:** పాలకుల మెప్పుకోసం పోలీసులు ప్రజలను ఇబ్బంది పెడితే మూల్యం చెల్లించుకోతప్పదనే విషయం గుర్తుంచుకోవాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. యూరియా కొరతపై ప్రశ్నించిన రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన రైతు లక్ష్మణ్ యాదవ్ ఇంటికి పోలీసులు వెళ్లడంపై ఎక్స్ వేదికగా ఇవాళ కవిత స్పందించారు. యూరియా కొరతపై ప్రశ్నిం చడమే నేరమా? ఇందిరమ్మ రాజ్యమంటే వేధింపులు, బెదిరింపులా అని నిలదీశారు. ఇందుకు సంబంధించిన వీడియోను షేర్ చేసిన ఎమ్మెల్సీ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గమిది అని మండిపడ్డారు. యూరియా కొరతపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రైతు లక్ష్మణ్‌యాదవ్ నిలదీశాడని పోలీసులు ఇంటికి వెళ్లి వేధింపులకు గురిచేశారు. కాంగ్రెస్ నాయకుడు ఫిర్యాదు చేయడమే ఆలస్యం అన్నట్టుగా పోలీసులు చట్టవ్యతిరేక చర్యలకు దిగుతున్నారు. ఇలాంటి దారుణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు.

# యుఎస్‌లో ఇక 'యుద్ధ మంత్రిత్వ శాఖ'

## ట్రంప్ కీలక నిర్ణయం



**వాషింగ్టన్, సెప్టెంబరు 5:** అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పరిపాలన, ఇతర దేశాలతో సంబంధాలు, పన్నుల విషయంలో ట్రంప్ దూకుడుగా వ్యవహరిస్తున్నారు. దేశంలోని పలు విభాగాలు, పాలనాపరమైన అంశాల్లో అనేక మార్పులు చేశారు. తాజాగా అమెరిరా డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిఫెన్స్‌ను 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్'గా మారుస్తూ ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గతంలోనే ఈ పేరుతో మంత్రిత్వ శాఖ ఉండగా.. 1947 కేబినెట్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్' పేరును అగ్రరాజ్యం తొలగించింది. మళ్లీ దానిని పునరుద్ధరిస్తూ.. పెంటగాన్ పేరు మార్చేందుకు అమెరికా అధ్యక్షుడు సిద్ధమయ్యారు. 'పీట్ హెగ్సెత్ తరచూ అమరికా రక్షణ శాఖ అంటూ సంబోధిస్తుంటారు. అది నాకు ఏమాత్రం నచ్చలేదు. రక్షణ అనే పదం ఎందుకు? గతంలో పిలిచినట్లుగానే ఇకపై 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్' అని పిలుద్దాం. అది ఎంతో శక్తిమంతమైన పదం. అదే శక్తితో గతంలో అమెరికా మొదటి, రెండో ప్రపంచయుద్ధాలలో విజయం సాధించింది. ప్రతి విషయంలోనూ ముందంజలో నిలిచింది. ఇప్పుడూ కూడా అదే పేరుతో మరింత ముందుకు వెళ్దాం' అని ట్రంప్ అధ్యక్ష కార్యాలయంలో మాట్లాడారు. దీనికి ట్రంప్ పాలపకవర్గ సభ్యులు కూడా మద్దతునిచ్చారు. దీంతో ఈ పేరు మార్పుపై త్వరలోనే ప్రకటన వెలువడనుంది.

### అమెరికా రక్షణ శాఖ

1789 అమెరికా యుద్ధ విభాగాన్ని ఏర్పాటు చేశారు. యుఎస్ సైనిక, నావికా దళాలకు నాయకత్వం వహించేందుకు ఓ యుద్ధ కార్యదర్శి ఉండేవారు. ఆ తర్వాత 1798లో ప్రత్యేక నేవీ విభాగాన్ని నెలకొల్పారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత.. 1947 జాతీయ భద్రత చట్టం ప్రకారం.. కేబినెట్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా అప్పటి అమెరికా అధ్యక్షుడు హ్యారీ ట్రూమన్ 'జాతీయ సైనిక సంస్థ' ఏర్పాటు చేయడానికి ప్రత్యేక సైన్యం, వైమానిక దళ విభాగాలను రూపొందించారు. 1949లో సైన్యంలోని త్రివిధ దళాలను ఒకే గొడుకు కిందకు తీసుకొస్తూ.. జాతీయ సైనిక సంస్థ పేరును రక్షణ శాఖగా మార్చారు. ప్రస్తుతం అమెరికా రక్షణ శాఖ మంత్రిగా పీట్ హెగ్సెత్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# ఎమ్మెల్యేలు కోరుకుంటే మళ్లీ రేవంత్‌రెడ్డి సిఎం

## రాజ్‌గోపాల్‌రెడ్డి విషయంలో కొంత గందరగోళం ఉంది

## పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీలో బ్రేకులే కాదు సడెన్ బ్రేకులు కూడా ఉంటాయని అందుకే బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తున్నట్లు తెలంగాణ పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. కాళేశ్వరం సిబిఐ విచా రణ, కాంగ్రెస్ అంతర్గత వ్యవహారాలపై ఆయన శుక్రవారం హైదరాబాద్ మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కార్యకర్తలను కూడా పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. కామారెడ్డిలో బహిరంగ సభ ఏర్పాటుకు సిఎం ఆదేశాలతో సన్నా హాలు చేస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోనే ముందుకు వెళ్తాం. ఎమ్మెల్యేలు కోరుకుంటే రేవంత్‌రెడ్డి మళ్లీ సిఎం అవుతారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కలుపుకొని వెళ్తున్నాం. క్రమశిక్షణ విషయంలోనూ ఎక్కడా రాజీపడటం లేదు. కాళేశ్వరంపై సిబిఐ విచారణ నిష్పక్షపాతంగా నిర్వహించాలి. సిబిఐతో కాకుండా రాష్ట్ర దర్యాప్తు సంస్థలతో విచారణ చేయిస్తే బద్నాం చేసేవారు. సిబిఐ కంటే మరో మార్గం కనిపించడం లేదు. ఆ దర్యా ప్తు సంస్థలోనూ అనేది లొసు గులు ఉన్నాయి. కానీ కాళేశ్వరం విషయంలో నిష్పక్ష పాతంగా వ్యవహరిస్తుందని ఆశిస్తున్నామని అన్నారు. రాజ్‌గోపాల్ రెడ్డి అసంతృప్తి వ్యవహారంపైనా స్పందించారు. రాజగోపాల్‌రెడ్డి వ్యవహారం పరిశీలిస్తోందని చెప్పారు. మంత్రి పదవుల విషయంలో జిల్లాను యూనిట్‌గా చూడలేమని, రాష్ట్రాన్ని యూనిట్‌గా చూస్తారని టిపిసిసి చీఫ్ స్పష్టతనిచ్చారు ఉన్నది ఉన్నట్టు మాట్లాడడం కోమటిరెడ్డి బ్రదర్స్‌కు అలవాటు. కానీ, రాజ్‌గోపాల్‌రెడ్డిలో కొంత గందరగోళం ఉందన్నారు. నాగేందర్ రిజైన్‌చేసి పోటీ చేస్తానని చెప్తున్నారు. నాగేందర్ సభ్యత్వం పోతుందని అనుకోవడం లేదు. మంత్రి పదవి ఇస్తామంటే వద్దని చెప్పాను. నాకు కులమంటే అభిమానమే కానీ కులపిచ్చి లేదు. బిసిలు కొన్ని రోజులు కులాన్ని పక్కన పెట్టాలి. వచ్చే ఎన్నికల్లోనూ రేవంత్ నాయకత్వంలోనే ఎన్నికలకు వెళ్తాం. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని మహేశ్‌గౌడ్ అన్నారు.

# పెన్షన్‌లు పెరిగే దాకా పోరాటం ఆగదు..

## ఉన్న పెన్షన్లు పెంచాలి, కొత్తవి మంజూరు చేయాలి

## ఎమ్మార్పీఎస్ పోరాట ఫలితమే 108, ఉచిత గుండె ఆపరేషన్లు, రేషన్ బియ్యం పెంపు..: మందకృష్ణ మాదిగ




సమావేశంలో మాట్లాడుతూన్న మంద కృష్ణమాదిగ

**దుబ్బాక,(అక్బర్‌పేట భూంపల్లి) సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** ఎమ్మార్పీఎస్ పోరాట ఫలితంగా 108, చిన్నపిల్లలకు ఉచిత గుండెజబ్బు ఆపరేషన్లు, రేషన్ బియ్యం పెంపు వంటి పథకాలను సాధించాం.. నేడు వృద్ధులకు, వితంతువులు, దివ్యాంగులకు, ఒంటరి మహిళలకు పెన్షన్లు పెరిగేంత వరకు పోరాటం ఆపేది లేదని మంద కృష్ణ మాదిగ అన్నారు. దివ్యాంగులకు, వృద్దులు, వితంతువులు, ఒంటరి మహిళలతో పాటు చేయూత పెన్షన్లన్నీ పెంచాలని, కొత్త పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ దుబ్బాకలో చేయూత పెన్షన్‌దార్ల సన్నాహక సభను శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా మంద కృష్ణమాదిగ హాజరై మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పెన్షన్ లను పెంచాలని డిమాండ్‌తోపాటు కొత్త పెన్షన్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 21 నెలలు అవుతుందని, ఇప్పటివరకు 50 లక్షల కుటుంబాలకు పెన్షన్ ఇవ్వకుండా మోసం చేస్తున్నానన్నారు. ఎన్ని కల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పెన్షలను పెంచుతామని హామీ ఇచ్చారు కాని నేటికి పెన్షన్లను పెంచడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.

ప్రతిపక్ష పార్టీలు కూడా పెన్షన్లపై నోరు మెదపడం లేదన్నారు. మాజీసిఎం కెసిఆర్, ప్రస్తుత సిఎం రేవంత్‌రెడ్డి.. ఇద్దరు సిఎంలు ఎపి సిఎం చంద్రబాబు అనుచరులేనని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో సిఎం చంద్రబాబు ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుండి పెన్షన్‌లను పెంచి ప్రజలకు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో విహెచ్‌పిఎస్ మెదక్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ దండు శంకర్, ఎమ్మార్పీఎస్ సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి మంద కుమార్, సిద్దిపేట కోఇన్‌చార్జి మల్లిగారి యాదగిరి జాతీయ, ఎమ్మార్పీఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ముక్కపల్లి రాజు, ఎమ్మెస్పి సిద్దిపేట జిల్లా అధ్యక్షులు పెర్క పరశురామ్, ఎంఎస్‌పి రాష్ట్ర నాయకులు మైసా రాములు, ఎమ్మెఎస్‌ఎఫ్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు స్వామాట్ ప్రకాష్ తదితరులతోపాటు అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిమజ్జనం వేళ కాలువలో తండ్రీకొడుకుల గల్లంతు



**మాడుగులపల్లి, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** ఆగామోత్కూర్ గ్రామం ఒకే కుటుంబానికి చెందిన తండ్రి కొడుకులు, వినాయక నిమజ్జనం లో భాగంగా, గ్రామం లో ఊరేగింపులతో, ఆనందాల నడుమ వేములపల్లి సాగర్ ఎడమ కాలువలో నిమజ్జనం చేసి తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో కాలువలో, కాళ్లు, చేతులు కడుక్కునేందుకు కాలువ లోకి దిగి, పున్నా సాంబయ్య,(50) ప్రమాదవాశాత్తు కాలువలో కొట్టుకు పోతుండగా, అది గమనించిన కొడుకు పున్నా శివమణి(20) తండ్రిని రక్షి ంచ బోయి అతడు కూడా కాలువలో కొట్టుకు పోయినట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి నట్లు స్థానికులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వార్త

మన భవిష్యత్తు మనం పుట్టిన ఘడియలు బట్టిగాని, మరింకా దేనిమీదనో గాని ఆధారపడి లేదు. అది కేవలం మన స్వశక్తిపై ఆధారపడి ఉంది.

-రాజాజి

# ఆశావహ సంస్కరణలు!

నిత్యావసర వస్తువుల కొనుగోలుదారుల్లో, వాణిజ్య వ్యాపార రంగాల వారికి తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జిఎస్టీ2.0 సంస్కరణలు కొత్త ఆశలు మొలకెత్తింప చేశాయి.ఆశయాల మాటెలా ఉన్నా ప్రతిపాదనలు బేషుగ్గా ఉన్నాయి. నాలుగు శ్లాబుల పన్ను రేటు నుంచి కేవలం రెండే శ్లాబులను, అదీ మునుపటి కన్నా తక్కువగా నిర్ణయించడమంటే ఇది భారతీయుల విజయం కిందనే లెక్క. అదీగాక దీపావళి నుంచి అమల్లోకి వస్తాయనుకున్న పన్ను రేట్లు ఈ నెల 22 నుంచే తగ్గుతాయంటే జనంలో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. ఈ తగ్గింపుల కారణంగా సామాన్య మధ్య తరగతి ప్రజానీకానికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రయోజనాలను అందించేవే. ఇప్పటివరకు వేధించిన 12 శాతం, 28శాతం పన్నులు ఇక ఉండబోవని కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడంతో సామాన్యులకు ఎన్నో సడలింపులు కలుగుతాయి. తద్వారా వారు కొనుగోలు చేసే ప్రతి వస్తువుపైనా ధరల సర్దుబాట్లు జరిగి వినిమయ వస్తువులధరల్లో తగ్గింపు కనపడుతుంది. 56వ జిఎస్‌టి మండలి నిర్ణయాలకు అశేష భారతీయ జనావళి స్వాగతిస్తూ జేజేలు పలికారు. కాని వస్తుసేవల పన్ను విషయంలో కేంద్ర ప్రభుత్వం సంస్కరణల కోసం ఎనిమిదేళ్లు అవసరమా అంటూ విపక్షాలు దుయ్యబట్టడమొక్కటే మిగిలింది. 2017 తర్వాత ఇన్నాళ్లకు జిఎస్టీ వలన సాధారణ వర్తకులు కార్పొరేట్ వాణిజ్యవేత్తలు ముక్తకంఠంతో సంతోషం వ్యక్తంచేశారు. కారణమేదైనా జిఎస్టీ శ్లాబుల సవరింపు బేషుగ్గా ఉంది. మందగమనంలో ఆర్థిక వృద్ధి, పొదుపు సంస్కరణలు, కుటుంబ రుణాల విస్తృతి,సామాన్యుడి నెత్తిన పడుతున్న ఆర్థిక భారాలు, జిఎస్టీ పన్ను, సంస్కరణలకు దారితీసి ఉంటాయని అంచనా. విపక్షాలు తమ వంతు విమర్శగా బీహారు ఎన్నికలు, అమెరికా టారిఫ్‌ల ఒత్తిడి కారణంగానే జిఎస్టీ పన్నుల విషయంలో ముందస్తు ప్రకటన చేసి ఉంటారంటున్నారు. తమ పార్టీ ఎన్నో ఏళ్లుగా జిఎస్టీ సంస్కరణ కోసం పట్టుబడుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని, ఇంతవరకు జిఎస్టీలో 64శాతం పేద, మధ్యతరతగతి నుంచే వస్తుండగా కుబేరుల వంతు మూడు శాతమేనని, కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. సంక్లిష్టంగా ఉన్న జిఎస్టీ నిబంధనలను సరళతరం చేయడంతోపాటు ఎంఎస్‌ఎంఇ రంగానికి ప్రయోజనం కలిగించే నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఆరోగ్య బీమాకు పన్నులు ఉపసంహారించడాన్ని విశ్లేషకులు ఎంతో ఉత్తమమైన సంస్కరణగా భావిస్తున్నారు. నిన్నమొన్నటి స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రధాని నరేంద్రమోడీ ఎర్రకోట నుంచి తన ప్రసంగంలో ప్రస్తావించిన జిఎస్టీ 2.0 సంస్కరణల కోసం ఎదురు చూసిన సామాన్యునికి ఈ రోజున మనసు కాస్తంత తేలికపడింది. వాటి ఫలాలు అంది ధరల భారం నుంచి గట్టెక్కిన నాడు నిజంగా స్వాతంత్ర్య దినోత్సవ ఫలితాలను అందుకున్నట్లే సంబరపడతాడు. జేబులు కత్తిరించే జిఎస్టీ విధానమని హుంకరించిన ప్రతిపక్షాలు సైతం జేబులు నింపే సంస్కరణలు చూడగలుతున్న ఏకైక సంస్కరణ విధానం భారతదేశంలో తొలిసారిగా ఆవిష్కరింపబడిందంటే నమ్మాలి మరి! వస్తుసేవల పన్ను అనగానే ఎంతోఆందోళన చెందిన ప్రజలకు, దేశాభివృద్ధికి 'డబుల్ డోస్' మద్దతుగా ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారంటేనే ఈ సంస్కరణల ప్రయోజనాలు అర్థమౌతాయి. పన్నుల వ్యవస్థను సంస్కరించటానికి చాన్నాళ్లు పట్టిందన్న విమర్శ తప్పితే అన్నివర్గాలు తృప్తి చెందాయి. సాధారణ ప్రజలకు డబ్బు ఆదా కావడంతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవడం జిఎస్టీ సంస్కరణలను కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ప్రధానంగా మానవ జీవితానికి అవసరమైన ఆరోగ్యబీమా 18 శాతం జిఎస్టీ రేటు నుంచి మినహాయింపునివ్వటమే నేటి జిఎస్టీలో చారిత్రక నిర్ణయమని బీమాదారులు నమ్ముతున్నారు. వైద్యసంబంధిత ద్రవ్యోల్బణం పెరుగుతున్న తరుణంలో సామాన్య కుటుంబాలకు కూడా వైద్యబీమా కల్పించగల శక్తి ఏర్పడ్తుంది. అందుకే ఈనాటి పన్ను సంస్కరణలు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరిగిన అందరికీ నచ్చే సంస్కరణలుగా పారిశ్రామిక వర్గాలు సైతం భావిస్తున్నాయి. రైతులనుంచి ఎంఎస్‌ఎంఈల వరకు ఫార్మా రంగమే కాకుండా దాని అనుబంధ రంగాలకు, తద్వారా వినియోగదారులకు గణనీయ లబ్ది చేకూరగలదు. వ్యవసాయ సంబంధిత సాగు పరికరాలు,వస్తువులపై 12 శాతం నుంచి జిఎస్టీ 5 శాతానికి తగ్గింది. సిమెంటుపై 28 శాతం నుంచి 18 శాతానికి మార్చడం గృహ నిర్మాణానికి సాను కూల సంకేతం, టీవీలు, ఎసిలు, ఎలక్ట్రానిక్ వస్తువులు 28 శాతం నుంచి 18 శాతానికి మారనుండగా, హానికర వస్తువులపై పన్ను స్థాయి 40 శాతానికి పెరుగుతుంది. అంటే వ్యవసాయానికి నిర్మాణరంగానికి పన్ను సడలింపులు వస్తుండగా, పొగాకు ఉత్పత్తులపై భారం ఎక్కువ పడుతోంది. వీటిపై పన్నులు పెంచడం ద్వారా వినియోగ దారులను నిరుత్సాహపరచడం మంచి ఆలోచన. అయితే ధరాభారంతో దుర్వ్యసనాలను దూరం చేయాలనుకోవడం ఆహ్వానించదగిన పరిణామం. జిఎస్టీ రేట్లను తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయాలతో ఆయా రాష్ట్రాల వస్తుసేవల పన్ను వసూళ్లలో వచ్చే నష్టాన్ని భర్తీ చేసేందుకు కేంద్రం అంగీకరించింది. అయితే ఐదేళ్లపాటు రాష్ట్రాలను ఆదుకుంటే తప్ప అవి నిలదొక్కుకోలేవు.ఈ విధంగా వెసులుబాటు కల్పించగలిగితే జిఎస్టీ సంస్కరణలు అఖిల పక్షాలకు ఆశాభావమే!



పగతీర్చుకుంటే ఆ రోజు మాత్రమే ఆనందం కలుగుతుంది. ఒక రోజు ఆనందం కోసం చిరకాలం కలిగే ఆనందాన్ని బలిపెట్టకూడదు.

తిరువళ్లువర్



మనిషికి మనసును మించిన మహాశత్రువు వేరొకరు లేరు. అందుకే మనస్సును జయిస్తే ప్రపంచాన్ని జయించవచ్చు.

గురునానక్

# ప్రజాస్వామ్య లీల.. ప్రహసన హేల!

**చంద్రశేఖర్ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు ఎన్నికల కమిషనర్‌గా శేషన్ నియామకం జరిగిన తర్వాత కమిషన్‌కు ఎక్కడలేని గుర్తింపు ప్రాముఖ్యత వచ్చాయి. ఒక్కమాటల్లో చెప్పాలంటే ఎన్నికల కమిషన్ అంటూ ఒకటి ఉందని, దానికి నియమావళి ఉందనే విషయం సాధారణ పౌరులకు అప్పుడే తెలిసింది.రాజకీయ ఒత్తిడిలకు లొంగకుండా నీతీ,నిజాయితీతో వ్యవహరిస్తే ఉన్నచట్టాలతో ఎంత వరకు చేయవచ్చునో ఆయన చేతల్లోచేసి చూపించారు.కొమ్ములు తిరిగిన నాయకులకు కూడా చెమటలుపట్టించారు. కరెంటు స్తంభాలకు జెండాలు కట్టాలన్నా, గోడల మీద రాయాలన్నా వెనుకా ముందు ఆలోచించాల్సిన పరిస్థితులు కల్పించారు. ఏ తప్పు చేస్తే ఏ మూల నుంచి కనిపెట్టి చర్యలకు ఒడిగడతారోననే భయం అభ్యర్థుల్లోనే కాదు వారిని బలపరుస్తున్న అనుచరుల్లోకూడా తెప్పించారు. కానీ ఆయన తర్వాత ఎన్నికల కమిషన్ అంతటి సమర్థత చూపలేకపోతున్నది.**

దామెర్ల సాయిబాబ

ఎలాంటి అవకతవకలకు, అవినీతికి, అన్యాయాలకు పాల్పడకుండా సంఘంలో నీతి,నిజాయితిలతో ఆదర్శనీయంగా, అనుకరణీయంగా జీవనం సాగించి మంచివారుగా బతకాలని కొందరు త్రికరణశుద్ధిగా భావిస్తున్నా, పరిస్థితుల, వూహించని సంఘటనలు పరిస్థితిలు ప్రభావంతో మారి చెడ్డవారిగా ముద్ర వేయించుకొంటుంటారు. మరికొందరు ఎప్పుడెప్పుడు పరులను మోసం చేద్దామా? అమాయకులను దగా చేసి, రాత్రికి రాత్రే లక్ష్మీపుత్రులు కావాలనే ఆరాటంలో చేయరాని, చేయకూడని పనులు చేయాలనీ తహతహలాడుతున్నా అవకాశాలు రాక మంచివారుగా మిగిలిపోతున్నారు.. గతంలో ఎన్నికల సంగ్రామం ప్రారంభమైనపుడు మాత్రమే గెలుపే ధ్యేయంగా అక్రమాలకు పాల్పడేందుకు సిద్ధపడేవారు. తాము చేసే అక్రమాలు వెలుగుచూస్తే సమాజం ముందు తలవంచుకొనే పరిస్థితులు దాపురిస్తాయనే భయభక్తులుండేవి. ఇప్పుడా పరిస్థితులులేవు. ఎన్నికలు ముగిసిన మరుసటి రోజు నుండే పత్యర్థులను రాజకీయంగా సమాధి చేయాలనే వ్యూహాలు పన్నుతున్నారు. ప్రత్యర్థుల,వారి సానుభూతిపరులు ఓట్లు తొలగించడం, తమకు అనుకూలమైన వారి ఓట్లతో జాబితా నింపడం పరిపాటిగా మారిపోతున్నది. బీహార్ ఎన్నికలు మరో రెండు నెలల్లో జరగనున్నాయి. ఇప్పటి నుంచే హోరాహోరీగా పోరాటం మొదలైంది. లక్షల సంఖ్యలో బోగస్ ఓట్లు చేర్చారని ఆరోపణలు వస్తున్నాయి. అధికారంలో ఏ పార్టీ ఉన్నా అవకతవకలకు ఒక్క అడుగు ముందే ఉంటున్నట్లు గతంలో జరిగిన ఎన్నికలు చెప్పకనే చెబుతున్నాయి.అధికారంలో ఉన్న పెద్దల సేవలో తరించి పోవాలనే తపన ఉన్న అధికారలు పెరిగిపోతుండంతో ఈ ఎన్నికల నిర్వహణలో ఈ దురదృష్ట పరిస్థితులు దాపురిస్తున్నాయి. ఇక వరాల వర్షం గూర్చి చెప్పాల్సిన పనిలేదు. ప్రజలు అడిగిన పనులే కాదు అడగని వరాలు కూడా గుప్పిస్తుంటారు. ఎన్నికల సమయంలో తప్ప తాము అడిగినపనులు నేతలు చేయరనే భావన గట్టిగా పట్టుబట్టి తమ కోరికలను తీర్చిన వారికే తమ ఓట్లని చెబుతున్నారు. గతంలో కూడా ఇదే ధోరణి ఉన్నా, గుడిగోపురాలు, కమ్యూనిటీ హాలు గురించి అడిగేవారు. ఇప్పుడీ పరిస్థితులు కూడా మారిపోయాయి. ఓటు వేస్తే తమకు ఏపాటి లాభమనే ఆలోచనవైపు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా ఎన్నికల వ్యయం పెరిగిపోతున్నది. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఖర్చు చేయాల్సినదాని కన్నా ఇరవై,ముప్ఫైరెట్లు అధికంగాఖర్చు పెట్టాల్సి వస్తున్నది.అంతటి ఆర్థిక, అంగబలం ఉన్నవారే ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. పార్టీలు కూడా టిక్కెట్ కేటాయించే ముందు ఈ అర్హతలనే పరిగణనలోకి తీసుకుంటున్నాయి. ఫలితంగా ప్రజా సేవచేయాలనే తపన ఉన్నవారు అంతో ఇంతో నిజాయితీగా వ్యవహరించేవారు ఈ వ్యయాన్ని భరించలేక ఎన్నికలకు దూరమవుతున్నారు. కోట్లాది రూపాయలు ఖర్చుపెడుతున్న వారికి తమపెట్టుబడిని తిరిగి రాబట్టుకోవాలని ఉండటం సహజం. అందుకే రాజకీయాల్లో అవినీతి ఒక భాగమైపోయింది. అవినీతి పెరగడానికి పరోక్షంగా నేర చరితులు, అవినీతిపరులు అందలం ఎక్కడంతో ప్రజల పాత్ర కీలకమని వాదించేవారు ఉన్నారు. ఇకపోతే గతంలో నాయకులు ఎంతో నీతినియమబద్ధంగా తమ ప్రవర్తన వ్యవహారశైలి, నడక, నడవడిక, క్రమశిక్షణే కాదు వేష భాషల పట్ల కూడా ఎంతో జాగ్రత్తలు తీసుకునేవారు. తమను ప్రతినిత్యం వెయ్యికళ్లు గమనిస్తుంటాయనే జంకు, భయం వారిలో ఉండేది. అందుకే రాజకీయాల్లో ప్రవేశించి మరింత ఎత్తుకు ఎదగాలనుకునేవారు ప్రతి అడుగు అంతో

ఒక్క మాట

ఇంతో ఆచితూచి వేసేవారు. అవినీతి, ఆశ్రితపక్షపాతం వీటన్నింటినిమించిన ప్రవర్తన పట్ల ఎన్నో జాగ్రత్తలు తీసుకునేవారు. గ్రామసర్పం చులుగా రాజకీయ ప్రవేశం చేసిన వారు అంచెలంచెలుగా ఆనాటి సమితి అధ్యక్షులుగా,శాసనసభ్యులుగా, పార్లమెంటు సభ్యులుగా,రాష్ట్ర మంత్రులుగా, ముఖ్యమంత్రులుగా, కేంద్ర మంత్రులుగా పెరిగిన వారెందరో ఉన్నారు. నేరచరితులు పెరిగిపోతున్నారు. దీన్ని అడ్డుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు అంతగా ఫలించడం లేదు. గత ఇరవైయేళ్లుగా ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు విజయం సాధించిన వారిలో లెక్కలు పరిశీలిస్తే ఎన్నికల ఎన్నికలకు నేరచరితుల సంఖ్య పెరిగి పోతున్న విషయంస్పష్టమవుతున్నది.రానురాను ఈ సంస్కృ తి పెరిగిపోతుందనడానికి ఆ అంకెలే అద్దం పడుతున్నాయి. ఈ పార్టీ, ఆపార్టీ అనికాదు. ఏదోకొద్ది మంది కొన్ని పార్టీలు తప్ప అన్నిపార్టీలు అదేబాటలో పయనిస్తున్నాయి. ఏమిచేసి అయినా అధికారాన్ని కైవసం చేసు కోవాలనే ఆరాటంలో నైతిక విలువలకు లోదకాలిస్తున్నాయి.ఈ ఆరాటపోరాటంలో చేయకూడని, చేయరాని పనులు కూడా చేస్తున్నారు. ఎన్ని చట్టాలు చేసినా,మరెంత పకడ్బం దీగా ఏర్పాటు చేసినా పోలింగ్‌లో కొన్నిప్రాంతాల్లో రిగ్గింగ్‌ను, దౌర్జన్యాన్ని నిరోధించలేకపోతున్నారు. రాజకీయ పార్టీలు విరాళాల పేరుతో నల్లధనస్వాముల నుంచి నిధులు పోగేసు కుంటున్నాయి. ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బును వెదజల్లు తున్నారు. చట్టంలో లొసుగులను అడ్డం పెట్టుకొని కొన్ని పార్టీలు ధనసేకరణకు పెద్దఎత్తున పాల్పడుతున్నాయి. ఇది ఇప్పటికిప్పుడు కొత్తగా పుట్టింది కాకపోయినా రాను రాను పెరిగిపోతున్నది.కొన్ని రాజకీయ పార్టీలు విరాళాల రూపేణ నల్లధనాన్ని మార్చుకు నేందుకు ఉద్భవించాయనే ఆరోపణల ను తోసిపుచ్చలేం. గ్రామస్థాయి నుండి సాధారణ శాసనసభ, లోక్‌సభ, ఒక్కటే మిటి ఏ ఎన్నికలు జరిగినా కోట్లాదిధనం నీరులా ప్రవహిం పచేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే వీటిని నియంత్రించేందుకు ఏనాటి నుంచో చట్టాలు న్నాయి. మరెన్నో నిబంధనలున్నాయి. వాటిని అమలు చేయాల్సిన అధికారుల్లో చిత్తశుద్ధి లేదేమోననిపిస్తున్నది. భారతదేశంలో లోక్‌సభ నియోజకవర్గాలకు కానీ,శాసనసభ లకు పోటీపడుతున్న అభ్యర్థులు గరిష్టంగా ఎంతఖర్చుచేయ వచ్చో పటిష్టమైన చట్టం, నిబంధలు ఏర్పా టుచేశారు. ఇవి ఎంతవరకు అమలు అవుతున్నాయో అందరికి తెలుసు. ఓటర్లను ప్రభావితం చేసేందుకు చేస్తున్న ఖర్చు గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కొన్నిరాష్ట్రాల్లో డబ్బులు, చీరలు, ముక్కు పుడకలు, కమ్మలు ఒక్క టేమిటి ఏమి ఇస్తే తమకు ఓట్లు వేస్తారోననే తర్జనభర్జనలు చేసి ఎంతో ముందుగానే నిలవచేసుకుంటున్నారు. ప్రతిఎన్నికల్లో పోలీసులకు పట్టుబడుతూనే ఉన్నాయి. ఆ ఎన్నికలకు ఎన్నికల కమిషనే ఊపిరి.అందుకే భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని రాజకీయ ఒత్తిడిలకు లొంగకుండా రాగద్వేషాలకు అతీతంగా వ్యవహరించగలిగే స్వతంత్ర ప్రతిపత్తి హోదాతో దేశంలోని చట్టసభలకు ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్‌ను ఏర్పాటు చేశారు. 1952నుంచి లోక్‌సభ, రాజ్యసభ, శాసనసభ ఎన్నికలు ఈ ఎన్నికల కమిషన్ పర్యవేక్షణలోనే జరుగుతున్నాయి.రాష్ట్ర పతి,ఉపరాష్ట్రపతి ఎన్నికలుకూడా కమిషన్ పరిధిలోకే వస్తాయి. మొదట్లో ఏకసభ్య కమిషన్ ఏర్పడిన తర్వాత త్రిసభ్య కమిషన్‌గా రూపాంతరం చెందింది. ఎన్నికల్లో ఎంత ఖర్చు పెట్టాలి?సభలు, సమావేశాలు ఏ సమయం వరకు నిర్వహించుకోవచ్చు?ఎన్ని వాహనాలు వాడాలి? తదితర విషయాల్లో స్పష్టమైన నిబంధనలతో ఎన్నికల నియమావళిని రూపొందించారు. ఈ నియమని బంధనలన్నింటినీ చాలాకాలం ఫైళ్లల్లోనే నిద్రపుచ్చారు. చంద్రశేఖర్ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు ఎన్నికల కమిషనర్‌గా శేషన్ నియామకం జరిగిన తర్వాత కమిషన్‌కు ఎక్కడలేని గుర్తింపు ప్రాముఖ్యత వచ్చాయి.ఒక్క మాటల్లో చెప్పాలంటే ఎన్నికల కమిషన్ అంటూ ఒకటి ఉందని, దానికి నియమావళి ఉందనే విషయం సాధారణ పౌరులకు అప్పుడే తెలిసింది. రాజకీయ ఒత్తిడిలకు లొంగకుండా నీతీ,నిజాయితీతో వ్యవహరిస్తే ఉన్నచట్టాలతోఎంత వరకు చేయవచ్చునో ఆయన చేతల్లోచేసి చూపించారు.కొమ్ములు తిరిగిన నాయకులకు కూడా చెమటలుపట్టించారు.కరెంటు స్తంభాలకు జెండాలు కట్టాలన్నా, గోడల మీద రాయాలన్నా వెనుకా ముందు ఆలోచించాల్సిన పరిస్థితులు కల్పించారు. ఏ తప్పు చేస్తే ఏ మూల నుంచి కనిపెట్టి చర్యలకు ఒడిగడతారోననే భయం అభ్యర్థుల్లోనే కాదు వారిని బలపరుస్తున్న అనుచరుల్లోనూ తెప్పించారు. కానీ ఆయన తర్వాత ఎన్నికల కమిషన్ అంతటి సమర్థత చూపలేకపోతున్నది. ఇదేపరిస్థితి కొనసాగితే ప్రజాసేవకే అర్థం మారిపోవడంఖాయం.ఎన్నికల కమిషన్ రాజ కీయాలకు, రాగద్వేషాలకు అతీతంగా నిష్పాక్షికత, విశ్వసనీయతే ఊపిరిగా పనిచేయాలి.సవరణలు కొత్త చట్టాలు మాటఅటుంచి ఉన్నచట్టాలను త్రికరణశుద్ధిగా అమలు చేసేందుకు కమిషన్ కృషిచేయాలి. పరిస్థితులు ఇలాగే కొనసాగితే ప్రజాస్వామ్యం ప్రహసనంగా మారక తప్పదు. •

# వర్ష వైపరీత్యాలకు ముందస్తు జాగ్రత్తలు అవసరమే


దాడిశెట్టి శ్యామ్ కుమార్

వర్షాకాలంలో తరచుగా సంభవిస్తున్న వాతావరణ మార్పులు అల్పపీడన ద్రోని ప్రభావం ప్రకృతి వైపరీత్యాల కారణంగా కురుస్తున్న మోతాదుకు మించిన వర్షాలు ఈదురుగాలులతో కూడి వాన బీభత్సం సృష్టిస్తుంటే పట్టణాలు గ్రామీణ ప్రాంతాలలో ప్రజల జీవన విధానం అస్తవ్యస్తమవుతుంది. పట్టణాలు గ్రామాలు జలదిగ్బంధానికి అడపాదడప గురవుతూ జలదారలుగా ప్రవహిస్తున్న వర్షపు నీటితో జనజీవనం స్తంభించిపోతుంది. పట్టణాల్లో ఎక్కడపడితే అక్కడ ప్రణాళిక బద్ధంగా లేని కట్టడాలు ఎక్కువ అవుతుండడం, జల ప్రవాహం సాఫీగా పోయే ప్రాంతాల్లో అడ్డుకట్టాలుగా నిర్మించిన కట్టడాలు, ప్రకృతి వైపరీత్యాలలో సంభవించే వరద తాకిడికి పరిసర ప్రాంతాలలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతుండటం సర్వసాధారణం అయిపోతుంది. పట్టణ ప్రాంతాల్లో కొంత మేరకు చెరువుల సమీపంలో బఫర్ జోన్లు ఫుల్ ట్యాంక్‌జోన్లు పరిధిలో నాలాలుపై క్రమబద్ధీకరించబడని అక్రమ కట్టడాలతో పట్టణ పరిసర ప్రాంతాల్లో అకాల వర్షాలతో వర్ష బీభత్సంతోపట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతుండటమే కాకుండా అధికారులకు కూడా ఇలాంటి కట్టడాలతో వరద నీరును మళ్లించే ప్రయత్నంలో తీవ్రమైన ఇబ్బందులు పడవలసి వస్తున్నది. నీటి ప్రవాహం వెళ్లే దారులు మూసుకోవడంతో ప్రతికూల ప్రభావంతో వర్షాకాలంలో పట్టణం జలదిగ్బంధంగా మారిపోతూ దినచర్యలో అంతరాయం కలుగుతుంది. పట్టణాల్లో నిర్దిష్టమైన ప్రణాళికలతో సంబంధిత అధికారులుముమ్మందు రాబోయే ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలను తట్టుకోవడానికి వరద నీరు అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి వాటికి అనుగుణమైనటువంటి మార్గాలను అనుసరించవలసిన విధానాలను చట్టపరమైన రీతిలో అవలంబించవలసిన ఆవశ్యకత మరింత ఉందేమో. నిపుణులు అధికారులు ముందు చూపుతో సమాజంలో ఉన్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రజల సహకారంతో పట్టణాలను సురక్షిత జోన్లుగా ఉండే విధంగా పట్టణాలను, గ్రామాలను సైతం ప్రగతి పథంలోకి తీసుకుపోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరోవైపు అధిక వర్షపాతంతో గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు మత్తడి పోస్తూ చెరువు కట్టలు తెగిపోతుండడంతో పంటలు నీట మునిగిపోతూ రైతులు తలడిల్లి పోతున్నారు. అకస్మాత్తుగా వస్తున్న వాతావరణ మార్పులతో అన్నదాత రైతన్న పంటలను కోల్పోయి పెట్టిన పెట్టుబడి చేతికందకుండా దిగుబడి పూర్తిగా కోల్పోయి నష్టాల ఒడిలో కూరుకుపోయి నేలకొరిగిన పంటలను చూస్తూ కన్నీటి పర్వంతం అవుతున్న రైతన్నల ఆవేదన వర్ణాతీతమే.వ్యవసాయాన్ని కష్టాన్ని నమ్ముకుని కుటుంబాన్ని పోషించుకునే రైతాంగం తరచుగా వర్షాకాలంలో మోతాదుకు మించి పడుతున్న వర్షాలతో వ్యవసాయరంగంలోని భిన్న పరిస్థితులతో అనేక సమస్యలతో సతమతం అవుతుండడం మరో ఎత్తు అవుతుంది. దేశానికి వెన్నెముక అన్నంపెట్టే రైతన్న పొలాన్ని దుక్కిదున్ని పంట పండించిస్తే అల్పపీడన ద్రోణి ప్రభావంతో అధిక వర్షాలతో చేతికి వస్తుందని అనుకున్న పంట కనుల ముందే చూస్తుండగానే మొత్తం భూమిపాలై నష్టపోవడంతో పంటలు కోల్పోయిన రైతన్న కళ్లల్లో కన్నీళ్లు తిరూగుతుండటం సహజమే. భూమిని నమ్ముకుని బతుకుతున్న రైతన్నలు చాలా ఎకరాలలో సాగుచేసిన మొక్కజొన్న పత్తి,వరి,పసుపులాంటి పంటలు ఎదుగుతున్న తరుణంలో అధిక వర్షాల ప్రభావంతో పంట మొత్తం నేలకు ఒరిగిపోతే అన్నదాత దిగులుగా నష్టపోయిన పంటను చూస్తూ ఎవరోవస్తారని ఏదైన సహాయం చేస్తారేమోనని ఆశతో అల్లాడిపోతున్న రైతులకు ప్రభుత్వాలు మరింతగా భరోసా కల్పించేలా నష్టపోయిన పంటకు పరిహారంచెల్లించేలా సహాయ సహకారాలు అందించాలి. •

# నయా వలసవాదం అంటే ట్రంప్ విధానాలే కదా!

డాక్టర్ ఎనుగొండ నాగరాజ నాయుడు

అంతర్జాతీయ వాణిజ్యవిధానాలను అమెరికా తన గుప్పెట్లోకి తీసుకొని ప్రపంచంలోనే అత్యధికంగా మన దేశంపై 50 శాతం పైగా దిగుమతి సుంకాలను విధించింది.పెట్టుబడిదారీ దేశాలకు లాభోద్దేశం తప్పవేరే ఆలోచన ఉండదు. ప్రపంచంలో భారత్, అమెరికా పెద్దప్రజాస్వామ్య దేశాలు. వీరి మధ్య నడుస్తున్న వాణిజ్యయుద్ధాలు ప్రజలను తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయి. భారత్లో ఆనాటి బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీనే మించిపోయింది ఈనాటి అమెరికా సామ్రాజ్యవాదం. మన దేశాభివృద్ధికి మన పాలకులు అనుసరించే ఆర్థిక అభివృద్ధి,వివిధ రంగాల సంరక్షణ విధానాలను ప్రశ్నించేందుకు, ఎదిరించేందుకు అమెరికా ప్రెసిడెంట్ ఎవరు? వ్యవసాయం,పాడిపరిశ్రమ, మత్స్య పరిశ్రమ మొదలైన ప్రాథమిక రంగాల నుంచి పారిశ్రామిక రక్షణరంగాల వరకు మనం చేపట్టే విధానాలను ఎప్పుడు వ్యతిరేకించడమేనా అమెరికా పని. ఏమైతేనేం తాజా సుంకాల భారం మన దేశంనుంచి పోయే 66ఎగుమతులపై తీవ్ర ప్రభావమే చూపగలదని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇందువల్ల ఈ ఏడాది వచ్చే ఏడాది మన వృద్ధిపై 0.8కోత పడవచ్చును అంటున్నారు. రత్నాభరణములు, దుస్తులు,వాహనాల విడిభాగాలు,స్టీలు,రొయ్యలు,తోలు ఉత్పత్తులు మొదలైన ఎగుమతులపై ప్రతికూల ప్రభావం ఉంటుందని ఈ రంగాలలో అనిశ్చితి ఏర్పడుతుందని అంచనా. ఈ రంగాలలో పనిచేసే లక్షలాది కార్మికులు ఉద్యోగాలు కోల్పోవలసి వస్తుంది. అమెరికా తమ డైరీ ఉత్పత్తులను జన్యు మార్పిడి ఆహార ఉత్పత్తులను మనకు ఎగుమతి చేయాలని ఒత్తిడినీ అంగీకరించపోవడం ట్రంపు కడుపు మంటకు కారణం. కానీ రష్యా నుంచి దిగుమతి చేసుకునే ముడిచమురు కారణంగా చెబుతున్నారు. భారత్లో 46శాతం మంది సాగు రంగంపై ఆధారపడుతున్నారు. అమెరికాలో ఇది ఒక్క శాతం మాత్రమే. మన దేశ జనాభాలో సగం మంది ఆధారపడే సాగు రంగాన్ని నిర్వీర్యం చేయాలట. అమెరికాలో ఆ ఒక్క శాతం జనాభా చేసే డైరీ ఉత్పత్తులను జన్యు మార్పిడి ఆహార ఉత్పత్తులను మనము దిగుమతి చేసుకోవాలట. భారతదేశ వివిధ కారణాల వల్ల గత పాతిక సంవత్సరాలుగా అమెరికన్ శిబిరానికి సన్నిహితంగాఉంటూ వచ్చింది. ఇటీవల కాలంలో బలహీనపడుతున్న అమెరికాకు మన దేశం పట్ల ప్రపంచం పట్ల దృష్టి మారి గతం కన్నా భిన్నమైన విధానాలను రూపొందించుకుంటున్నది.ఈ కొత్త పరిస్థితి భారతదేశానికి ఒక పరీక్షగా మారింది అన్నది గుర్తించవలసిన విషయం. అమెరికా విధానాలలోని మార్పులవల్ల వాణిజ్య ఒప్పందపు చర్చల రూపంలో ఇతరత్రా కూడా




ఎదురవుతున్న ఆర్థికరంగ సమస్యలు కనిపిస్తున్నావే. ప్రపంచంలో భారత్ మూడవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా ఎదుగుతున్న వేళ అమెరికా తన నయా వలస పాలన బహిర్గతమవుతున్నది. అమెరికాలో 50 లక్షల మంది ఇండియన్ అమెరికన్లు ఆ దేశ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతున్నారని తరచూ అభినందిస్తూ ఉంటారు. వీరు పెద్ద టెక్ సంస్థలైన గూగుల్ మైక్రోసాఫ్ట్, ఫైనాన్షియల్ సంస్థలను నడుపుతున్నారు. విద్యా విధాన నిర్ణయానక సంస్థల్లో కీలక పదవుల్లో ఉన్నారు. యుఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ రెండవసారి అధికారంలోకి రావడానికి భారతీయులు ఎంతోకృషిచేసినారు.యుఎస్ సెకండ్ లేడీ అయినా ఉష బాల చిలుకూరి సుప్రసిద్ధ అమెరికన్ లాయర్ కూడా భారతీయురాలే. ఇండియా పట్ల అమెరికా వ్యవహరిస్తున్న తీరు చూసి వారికి విచారం వేయడం నిజమేకదా. అమెరికా తాను ఆపాదించుకున్న ప్రపంచ పెద్దన్న పెద్దరికంతో తాను విశ్వసనీయ భాగస్వామిగాగుర్తించాలంటే అమెరికా కనుసన్నల్లో ఉండడమేనా? వ్యతిరేకిస్తే నియంతగా వ్యవహరిస్తారా? భారతదేశపు మార్కెట్ చాలా పెద్దదని అమెరికాకు తెలుసు.అమెరికాతో మనం శాస్త్రసాంకేతిక రంగాలలో పోటీ పడుతున్నామని కూడా తెలుసు.మన మానవ వనరులు అమెరికా దేశాభివృద్ధికి ఎలా తోడ్పడుతున్నాయో తెలుసు. మన ప్రతిభావంతులైన శాస్త్రవేత్తలు, విద్యావంతులు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్ డాక్టర్స్ ఇతర సేవారంగాలు అమెరికా శాస్త్రసాంకేతిక రంగాలలోతోడ్పడుతున్నారు. మార్కెట్ రీత్యా గాని మానవ వనరుల అభివృద్ధి పరంగా గాని భారతదేశం అతి పెద్ద ఆర్థికవ్యవస్థ. అయితే పటిష్టవంతమైన ఆర్థిక విధానాలు,ప్రభుత్వ నియంత్రణ లేనందున స్వయం పోషకత్వంలో చైనా లాగా మనం నిలదొక్కు లేక పోతున్నాం. సామ్యవాద తరహా సమాజ నుంచి పెట్టుబడిదారి సమాజం వైపు అడుగులు వేసాం.దీనివలన ప్రపంచ పెట్టుబడిదారీ దేశాల కనుసన్నల్లో ముఖ్యంగా అమెరికావిధానాలకు లోబడిపోయే పరిస్థితి ఏర్పడింది.79 సంవత్సరాలుగా అనేక సందర్భాలలో అమెరికన్ సామ్రాజ్యవాద ఇండియాను తన ఆదేశాలను పాటించాలని బెదిరిస్తుంది. బ్రిటిష్ రాజ్యం నుంచి బిలియనీర్ల రాజ్యం వైపుగా భారత్ ఇప్పటికే పునాదులు వేసుకున్నది. ఎందుకంటే మన పెట్టుబడిదారీ వర్గం ఇప్పటికే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడితో మమేకమైపోయింది.బడా బుర్జువావర్గ ప్రయోజనాలను నెరవేరుస్తున్న ప్రభుత్వం తన సొంత ప్రయోజనాలను దేశాభివృద్ధిని ఆర్థిక వ్యవస్థ స్వయం పోషకత్వాన్ని పెంపొందించుకోగలదా?అగ్రరాజ్యమని చెప్పుకునే అమెరికా తమ పెట్టుబడిదారులను ప్రోత్సహించి ప్రపంచ పెట్టుబడిదారులను నియంత్రించే పరిస్థితి ఉన్నది నేడు. ప్రభుత్వపాలన పెట్టుబడిదారీ కనుసన్నల్లో కాకుండా ప్రజలను శాస్త్ర సాంకేతిక రంగాలలోమమేకం చేసి వస్తు ఉత్పత్తి చేస్తే ఎవరికి ఏమీ మనము తీసిపోము. జరగాలి. స్వాలంబనకు భారత్ ఇప్పుడు తీవ్రమైనసవాలను ఎదుర్కొంటుంది.ఎందుకంటే మన పెట్టుబడిదారీ వర్గంఇప్పటికే అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడితో మమేకమైపోయింది. ప్రభుత్వాలు చేపట్టే మేక్ ఇన్ ఇండియా లాంటి పథకాలు విజయవంతం కావడంలేదు.ఆ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి సామ్రాజ్యవాద పెత్తనం నుండి దేశం బయటపడాలి. •

# ప్రజావాక్కు



## క్యాష్‌లెస్ స్కీమ్

మన దేశంలో రోడ్డు ప్రమాదాలు, కాలిన గాయాలు, విష ప్రయోగాలు,నేరదాడులురోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇలాంటి అత్యవసర సందర్భాల్లో బాధితుడికి వెంటనే వైద్యసహాయం అందకపోతే ప్రాణాలుకోల్పోవాల్సి వస్తుంది.అయితే ప్రైవేట్ ఆసుపత్రులలో చాలా చోట్ల ముందస్తు డబ్బులడగడం, లేకపోతే బెడ్‌లేదు అంటూ తిరస్కరించడం సాధారణమైపోయింది. బాధితులు అంబులెన్స్‌లలోనే ప్రాణాలు వదిలే ఘటనలు మన కళ్లముందే జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఆదేశం ప్రశంసనీయం.2007 ప్రైవేట్ మెడికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్, 2016 గుడ్ సమారిటన్ యాక్ట్ మోటార్ వెహికల్స్ యాక్ట్‌ప్రకారం, ప్రతి ఆసుపత్రి ముందస్తు చెల్లింపు లేకుండా దుర్ఘటన బాధితులను వెంటనే చికిత్స చేయాల్సిందేనని మళ్లీ గుర్తు చేసింది.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

## భక్తిశ్రద్ధలతో పూజిద్దాం..

ఐకమత్యానొదిలి పోటీతత్వం షురూ జేస్తున్నారు. ప్రకృతిని పరిరక్షి ంచే మట్టి ప్రతిమలనొదిలి రంగు రంగుల ప్రతిమలను కొనేందుకు ఎగబడుతున్నారు. వికృత చేష్టలతో చిందులేస్తూ వినాయకుడినే అపవిత్రం చేస్తున్నారు. భక్తిశ్రద్ధలతో పాడే కీర్తనలు మరిసి సౌండ్‌బాక్సులల్లా పెట్టుకొని పూజిస్తున్నారు.భజన నృత్యాలతో సాగేఊరేగింపు భక్తికి విరుద్ధమైన పాటలు పెట్టీ ఎగురుతున్నారు. భగవంతుని భక్తిశ్రద్ధలతో కొలవాలే గాని భారీ విగ్రహం పెట్టామనే పొగడ్తల కోసం కాదు. భారీ ప్రతిమలతో కాదు భక్తి శ్రద్ధలతో పూజిద్దాం.

- కాల్వ నిఖిత, సిద్దిపేట

## పరిశోధకుల టీంలను ఏర్పాటు చేయాలి

తెలంగాణరాష్ట్రంలోని పాఠశాలస్థాయిలో,జూనియర్ కళాశాలస్థాయిలో,డిగ్రీకళాశాలస్థాయిలో, పోస్ట్‌గ్రాడ్యుయే షన్ స్థాయిలో,గురుకులాలతో పాటుగావిద్యాసంస్థలలో నూతన సంస్కరణలు ప్రవేశపెట్టాలి. వివిధ యూనివర్సిటీల నుండి డాక్టరేట్ పట్టా పొందిన లెక్చరర్స్‌ను ఎంపిక చేసి ఇతర రాష్ట్రాలు,ఇతరదేశాలలో విద్యావ్యవస్థలో ఉన్న సంస్కరణ మన రాష్ట్రంలో ప్రవేశపెట్టడానికి గాను టీచింగ్ పరిశోధకుల టీంలను ఏర్పాటు చేయాలి. వీరి సలహాలు, సూచనలను ప్రభుత్వం విద్యాశాఖ అనుసరించాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

## బ్యాంకుల్లో సొమ్ము జాగ్రత్త

ఈ మధ్య క్రిమినల్స్ ఇతరుల బ్యాంక్ ఖాతాల్లోకి జొరబడి కొంత సొమ్మును జమ చేయడం ఇది సైబర్ క్రైమ్‌కు సంబంధించినదని బ్యాంకు వారికి సమాచారం ఇవ్వడంతో బ్యాంకు వారు వెంటనే స్పందించి ఖాతాలను స్తంభింపచేయటం జరుగుతున్నది.ఎ.టి.ఎమ్.లో డబ్బుతీసుకుందామని వెడితే మీ ఖాతా తిరస్కరించబడినది. అనే మెసేజ్ రాగా, సైబర్ క్రైమ్ నంబరు 1930 ను సంప్రదిస్తే సమస్యను పరిష్కరించడానికి బదులు వారు దగ్గరనున్న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయమని సలహాయిచ్చారు. ఈడబ్బును ఎవరు జమచేసారో వాళ్లను స్వయంగా సంప్రదించమన్నారు.ఆ డబ్బు ఇతరరాష్ట్రాల నుండి వచ్చిందని తెలిపారు.బ్యాంకుకు వెళ్ళిఅడుగగా వారు పరిష్కారం చేయడం జరిగింది. ఇది జరిగిన వారం తరువాత మరల ఎవరో కొంత సొమ్మును పంపి ఇది సైబర్‌క్రైమ్‌కు సంబంధించినదనిమెసేజ్. ఇలా ఎందుకు జరుగుతోంది?ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లేదా?ఇలాంటి ఉదంతం సికింద్రాబాద్‌లో నున్న యూనియన్ బ్యాంక్, అల్వాల్ బ్రాంచిలో ఓఖాతాదారునికి ఇలాగే జరిగింది.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## మహిళా న్యాయమూర్తులను నియమించాలి

కోర్టులలో మహిళ న్యాయమూర్తులను నియమించడం తగ్గిపోయింది.ముఖ్యంగా మైనారిటీల నియామకం ఏ మాత్రం లేదు. దేశం లోమహిళ సమానత్వం గురించి చర్చ జరుగుతున్నప్పుడు ఉన్నత స్థానాలలోవాటా దక్కాలికదా మరిఎందుకు అలా జరగడం లేదు అనేది పెద్ద ప్రశ్న. ఒక్క నాగరత్న తప్ప ఇప్పుడు సుప్రీం కోర్ట్‌లో ఒక్క మహిళ న్యాయమూర్తి లేరు అంటే అతిశయోక్తి లేదు.ఒక్క ఎన్‌వీ రమణ ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న సమయంలో ఎక్కువమహిళ న్యాయమూర్తులనీ నియమించగా అది మొత్తం న్యాయమూర్తులలో 10 శాతం దాటలేదు అనే నిష్ఠుర సత్యం జీర్ణం చేసుకోవాల్సి రావడమే విడ్డూరం.

-భారత అవినాష్, జనగామ

## ఉపాధి హామీ కల్పించాలి

తెలంగాణలో పెరిగిన నీటి వసతులు భూమి అభివృద్ధి కార్యక్రమాలను ఉపాధి హామీ కింద చేసేందుకు హామీ ఇస్తున్నాయి. ఒకప్పుడు మురికి తుమ్మలు మొలిచిన నేలలు నేడు సాగు యోగ్యంగా మారడానికి ఉపాధి హామీ హామీ పడుతుంది. చిన్నచిన్న గూడెంలలో కూడా ఎక్కువలో ఎక్కువగా 10 నుండి 15ఎకరాలలో మాత్రమే పాడుబడ్డ భూములున్నాయి.

-కె.రామారావు, నల్గొండ

మన వి | ఎడిట్ పేజీకి..


ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఎన్డీయే కూటమిలో తేలని 'సర్దుబాట్లు'

## ఎక్కువ సీట్లు పట్టుబడుతున్న మిత్రపక్షాలు

**పాట్నా, సెప్టెంబరు 5:** ఈ ఏడాది చివరిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న క్రమంలో బీహార్ ఎన్డీఏ కూటమిలో సీట్ల లొల్లి ప్రారంభమైంది. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధిక సీట్లు (80) గెలుచుకున్నప్పటికీ, జేడీ(యూ) అధ్యక్షుడు నితీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఆ గ్రూపులో ఎన్డీఏ కూటమిలో ఇంతవరకు చిన్న భాగస్వామిగా ఉన్న చిరాగ్ పాశ్వాన్‌కు చెందిన లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్), జితన్ రామ్ మాంఝి హిందుస్తానీ అవామ్ మోర్చా (సెక్యులర్) పార్టీలు ఇకపై కేవలం సహకారం అందించే పాత్రకే పరిమితం కారాదని భావిస్తున్నాయి. ప్రస్తుతం ఈ పార్టీలు ఎక్కువ సీట్లను కోరుతున్నాయి. దీంతో ఎన్డీఏలో ముసలం మొదలైంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఐదు సీట్లను గెల్చుకున్న చిరాగ్ పాశ్వాన్ అసెంబ్లీ ఎన్నికల్లో 40 సీట్లు కావాలని డిమాండ్ చేసే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఒక వేళ అన్ని సీట్లు తమకు ఇవ్వకపోతే మొత్తం 243 అసెంబ్లీ సీట్లలో తమ పార్టీ సొంతంగా పోటీ చేస్తుందని చిరాగ్ పాశ్వాన్ హెచ్చరిస్తున్నారు. పలు అంశాల్లో పార్టీ సొంత వైఖరిని వెల్లడించారు. నరేంద్ర మోదీ ప్రధానిగా కొనసాగినంత కాలం



తమ మద్దతు తప్పనిసరి అని ఆయన స్పష్టం చేస్తున్నారు. కాగా, స్థానికంగా తమకు ఎక్కువ మద్దతు ఉన్న గయా, ఔరంగాబాద్‌ల్లోని అన్ని సీట్లను తమకే కేటాయించాలని మరో సంకీర్ణ పార్టీ హెచ్ఏఎం చీఫ్ జితన్ రామ్ మాంఝి డిమాండ్ చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఆయన 20 సీట్లు అడుగుతున్నారు. తమ పార్టీ మద్దతు లేకుండా ఎన్డీఏ విజయం సాధించలేదని ఆయన ప్రకటించారు. ప్రస్తుతం తమ కూటమిలోని పార్టీలు విడిపోకుండా చూడాల్సిన బాధ్యత ఎన్డీఏకు నేతృత్వం వహిస్తున్న బీజేపీపై ఉంది. ఆ పార్టీల డిమాండ్లను సమన్వయంతో పరిష్కరించకపోతే అవి విడిగా పోటీచేసే ప్రమాదం ఉంది. దీంతో కూటమికి అసెంబ్లీ ఎన్నికల్లో గట్టి దెబ్బ తగిలి విజయావకాశాలు గణనీయంగా తగ్గిపోయే అవకాశం ఉంది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి అధికారాన్ని చేపట్టాలని మరోవైపు మహాఘట్ బంధన్ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ కూటమిలో కాంగ్రెస్, ఆర్జేడీతో పాటు సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ పార్టీలు భాగస్వాములుగా ఉన్నాయి. ఈ కూటమి ఎక్కువగా యువత, తమ సంప్రదాయ ముస్లింయాదవ్ ఓట్ల బ్యాంక్‌పై ఆధారపడింది. ఈ ఎన్నికల్లో తమ కూటమి పార్టీలను సమన్వయం చేయడంలో ఎన్డీఏ విఫలమైతే అది మహాఘట్ బంధన్ కూటమికి పూర్తి లాభం చేకూరుస్తుంది. ఇప్పటికే కాంగ్రెస్ అగ్రనేత రాహు ల్ గాంధీ, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్‌లు రాష్ట్రంలో 'ఓటర్ రైట్స్ మార్చ్' ద్వారా పాదయాత్ర జరిపి తమ కూటమికి అనుకూల వాతావరణం సృష్టించే ప్రయత్నం చేశారు. వచ్చే ఏడాది శాసనసభ ఎన్నికలు జరగనున్న తమిళనాడులో కీలక రాజకీయ పరిణామం చోటు చేసుకుంది. అమ్మ మక్కల్ మున్నేట్ర కజగం(ఎఎంఎంకే) నేత దినకరన్ ఎన్డీఏ కూటమి నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. మాజీ సీఎం పన్నీర్ సెల్వం కూటమిని వీడిన కొద్ది వారాలకే దినకరన్ తన నిర్ణయాన్ని ప్రకటించారు. కడలూర్‌లో దినకరన్ విలేకరులతో మాట్లాడుతూ ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామిపై పరోక్షంగా విరుచుకుపడ్డారు. ద్రోహాన్ని తన పార్టీ భరించలేదని తెలిపారు. కూటమిలో పెరుగుతున్న విభేదాలను పరిష్కరించడంలో బీజేపీ కేంద్ర నాయకత్వం విఫలమైందని చెప్పారు.



# ఏడు కాదు మూడు యుద్ధాలను ఆపా!

## యుద్ధ విరమణ వ్యాఖ్యలపై అమెరికా అధ్యక్షుడు యూటర్న్

**వాషింగ్టన్, సెప్టెంబరు 5:** తనను తాను గొప్ప శాంతి దూతగా అభివర్ణించుకునే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, తన పాత వ్యాఖ్యలను తానే సవరించుకున్నారు. తాను ఏడు దేశాల మధ్య యుద్ధాలను ఆపానని గతంలో పదేపదే చెప్పుకున్న ఆయన, తాజాగా ఆ సంఖ్యను మూడుకు తగ్గించారు. వైట్‌హౌస్‌లో టెక్నాలజీ సంస్థల అధినేతలకు ఇచ్చిన విందు సందర్భంగా ట్రంప్ ఈ కొత్త ప్రకటన చేశారు. వైట్‌హౌస్‌లో టెక్ కంపెనీల సీఈవోలతో సమావేశమైన అనంతరం ట్రంప్ విలేకరులతో మాట్లాడారు. ఈ క్రమంలో ఓ జర్నలిస్టు రష్యా ఉక్రెయిన్ యుద్ధాన్ని ఎలా ముగిస్తారని ప్రశ్నించారు. దీనికి బదులిస్తూ, మీకు తెలుసా? నేను ఇప్పటివరకు మూడు యుద్ధాలను ఆపానని ట్రంప్ పేర్కొన్నారు. మూడు దశాబ్దాలుగా ఘర్షణ పడుతున్న దేశాల మధ్య తాను శాంతిని నెలకొల్పానని, అది అసాధ్యమని చాలామంది చెప్పినా తాను చేసి చూపించానని అన్నారు. అయితే, ఆ మూడు యుద్ధాలు ఏవనే విషయాన్ని మాత్రం ఆయన స్పష్టం చేయలేదు. ప్రస్తుతం రష్యా ఉక్రెయిన్ యుద్ధం క్లిష్టంగా మారినప్పటికీ, దాన్ని కూడా తాను కచ్చితంగా ఆపుతానని ధీమా వ్యక్తం చేశారు. థాయ్‌లాండ్ కంబోడియా, ఇజ్రాయెల్ఇరాన్, ఇజ్రాయెల్ హమాస్, రువాండాడెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, సెర్బియాకొసావో, ఈజిప్ట్ఇథియోపియా, ఇండియాపాకిస్థాన్ మధ్య ట్రంప్ యుద్ధాలు ఆపినట్టు వైట్ హౌస్ గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. పాకిస్థాన్ లాంటి దేశాలు ఆయనను నోబెల్ శాంతి బహుమతికి కూడా నామినేట్ చేశారు. ఇక, భారత్‌పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలను కూడా తానే తగ్గించానని గతంలో ట్రంప్ పలుమార్లు వ్యాఖ్యానించారు. అయితే, భారత ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఈ వ్యాఖ్యలను ఖండిస్తూ వచ్చింది. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందంలో మూడో దేశం ప్రమేయం లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా స్పష్టం చేశారు. ఇప్పుడు ట్రంప్ తన పాత లెక్కను మార్చి, ఏడు నుంచి మూడుకు తగ్గించడం చర్చనీయాంశంగా మారింది.



# భర్తకంటే భార్యకు ఆదాయం ఎక్కువ ఉంటే భరణం అవసరంలేదు

## చెన్నై హైకోర్టు సంచలన తీర్పు

**చెన్నై, సెప్టెంబరు 5:** భార్యాభర్తల మధ్య భరణం చెల్లింపు కేసులకు సంబంధించి మద్రాస్ హైకోర్టు కీలక తీర్పును వెలువరించింది. భార్యకు భర్త కన్నా ఎక్కువ ఆదాయం, ఆస్తులు ఉన్నప్పుడు ఆమెకు భరణం చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. చెన్నైకి చెందిన వైద్య దంపతుల కేసు విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. దిగువ కోర్టు ఇచ్చిన ఆదేశాలను రద్దు చేస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. చెన్నైలో వైద్యులుగా పనిచేస్తున్న భార్యాభర్తలు విభేదాల కారణంగా విడిపోయారు. విడాకుల కోసం చెన్నై ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన ఫ్యామిలీ కోర్టు భార్యకు నెలకు రూ.30,000 చొప్పున భరణంగా చెల్లించాలని భర్తను ఆదేశించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ సదరు వైద్యుడు మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బాలాజీ ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణలో భాగంగా తన భార్యకు ఇప్పటికే గణనీయమైన ఆస్తులు ఉన్నాయని, ఆమె సొంతంగా ఒక స్కానింగ్ సెంటర్ నడుపుతూ అధిక ఆదాయం సంపాదిస్తోందని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీనికి సంబంధించిన ఆధారాలను, పత్రాలను కూడా సమర్పించారు. వాదనలు విన్న న్యాయస్థానం, భార్య ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్నప్పుడు భర్త నుంచి భరణం ఆశించడం సరికాదని అభిప్రాయపడింది. అదే సమయంలో, వారి కుమారుడు నీట్ పరీక్షకు సిద్ధమవుతున్నాడని, అతని చదువుకు అయ్యే ఖర్చు రూ.2.77 లక్షలను తాను భరించేందుకు సిద్ధంగా ఉన్నానని పిటిషనర్ కోర్టుకు తెలిపారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, కుమారుడి చదువు ఖర్చుల విషయంలో జోక్యం చేసుకోబోమని పేర్కొంది. భార్యకు భరణం చెల్లించాలంటూ ఫ్యామిలీ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను పూర్తిగా రద్దు చేస్తూ తీర్పు వెలువరించింది.

# మౌంట్ రష్మోర్‌పై ట్రంప్ శిలా ముఖచిత్రం

## అమెరికా అధ్యక్షుడి మదిలో మెదిలిన మరో కోరిక



**వాషింగ్టన్, సెప్టెంబరు 5:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన చిరకాల కోరికను మరోసారి బలంగా బయటపెట్టారు. అమెరికా చరిత్రలో నిలిచిపోయిన నలుగురు గొప్ప అధ్యక్షుల ముఖచిత్రాలతో ఉన్న మోంట్ రష్మోర్‌పై తన ముఖాన్ని కూడా చూడాలని ఆయన ఆకాంక్షిస్తున్నారు. ఈ మేరకు, ఆ అధ్యక్షుల ముఖాల పక్కనే తన ముఖం ఉన్నట్లుగా రూపొందించిన ఒక ఏఐ వీడియోను ఆయన తాజాగాట్రూత్ ఖాతాలో పంచుకున్నారు. ఇది ప్రస్తుతం అమెరికాలో కొత్త చర్చకు దారితీసింది. దక్షిణ డకోటాలోని బ్లాక్ హిల్స్‌లో ఉన్న మోంట్ రష్మోర్ ఒక జాతీయ స్మారక చిహ్నం. ఇక్కడి భారీ గ్రానైట్ పర్వతంపై అమెరికా జాతి నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన మాజీ అధ్యక్షులు జార్జ్ వాషింగ్టన్, థామస్ జెఫర్సన్, థియోడర్ రూజ్‌వెల్ట్, అబ్రహం లింకన్‌ల 60 అడుగుల ముఖ శిల్పాలు చెక్కారు. ఏటా లక్షలాది మంది పర్యాటకులు దీనిని సందర్శిస్తుంటారు. ఈ దిగ్గజాల సరసన తన శిల్పం కూడా ఉండాలనేది ట్రంప్ కోరిక. ఈ ఏడాది ఫిబ్రవరిలో కాంగ్రెస్ సభ్యురాలు అన్నా పౌలినా లూనా ట్రంప్ ముఖాన్ని అక్కడ చేర్చాలంటూ ప్రతిపాదన కూడా తీసుకువచ్చారు. అయితే, ట్రంప్ ఆశలకు అధికారులు, నిపుణులు బ్రేకులు వేస్తున్నారు. ఆ పర్వతంపై ఐదో ముఖాన్ని చెక్కడం ఆచరణ సాధ్యం కాదని స్పష్టం చేస్తున్నారు. మోంట్ రష్మోర్ నిర్వహణ చూసే నేషనల్ పార్క్ సర్వీస్ కూడా ఇదే విషయాన్ని తేల్చి చెప్పింది. ఆ పర్వతంపై కొత్తగా శిల్పాన్ని చెక్కేందుకు సురక్షితమైన, స్థిరమైన ప్రదేశం లేదని అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే ఉన్న శిల్పాల కారణంగా పర్వతంపై మరిన్ని చెక్కడాలు ప్రమాదకరమని వారు విశ్లేషిస్తున్నారు. గతంలో జాన్ ఎఫ్. కెన్నడీ, రోనాల్డ్ రీగన్, బరాక్ ఒబామా వంటి అధ్యక్షుల ముఖాలు కూడా మోంట్ రష్మోర్‌పై చేర్చేందుకు ప్రస్తావనకు వచ్చినా, అవేవీ కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు ట్రంప్ విషయంలో కూడా సాంకేతిక కారణాల వల్ల ఆయన కోరిక నెరవేరడం కష్టమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ఆ ఫోటోచూస్తే ప్రతి అమెరికన్‌కు వణుకే...

## పుతిన్, జిన్‌పింగ్, మోడీ ఒకే ఫొటోపై ఎనలిస్టు వ్యాఖ్యలు



**న్యూయార్క్, సెప్టెంబరు 5:** చైనాలో ఇటీవల జరిగిన షాంఘై కో ఆపరేషన్ సదస్సుకు సంబంధించిన ఓ ఫొటో ప్రతీ అమెరికన్ వెన్నులో వణుకుపుట్టించేలా ఉందని అమెరికా రాజకీయ విశ్లేషకుడు వాన్ జోన్స్ పేర్కొన్నారు. ప్రపంచంపై ఆసియా ఆధిపత్యం చెలాయించనుందని చెప్పేందుకు ఇది సంకేతంలా కనిపిస్తోందన్నారు. షాంఘై సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా ప్రెసిడెంట్ జిన్ పింగ్ నవ్వుతూ మాట్లాడుకోవడం మీడియా కెమెరాలు బంధించాయి. ఈ ముగ్గురు నేతలూ నవ్వుతూ చేతిలో చేయి వేసుకుని మాట్లాడుకోవడం అమెరికన్లను వణికించేలా ఉందని వాన్ జోన్స్ వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల బాధిత దేశాధినేతలు ఒకే వేదికపై నవ్వులు పంచుకుని, పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్న ఫోటోలు పాశ్చాత్య మీడియా దృష్టిని ఆకర్షించాయి. దీనిపై వాన్ జోన్స్ మాట్లాడుతూ "ఈ రోజును చరిత్రాత్మకంగా, అతిపెద్ద మలుపుగా గుర్తుంచుకుంటాం" ఎందుకంటే, అమెరికా సుంకాల బాధిత దేశాల్లో మూడు కీలక దేశాల అధినేతలు నవ్వుతూ మాట్లాడుకోవడం వారి మధ్య మైత్రి బలపడుతోందనేందుకు సంకేతం. ఇది అమెరికాకు మంచిది కాదు. ఈ సమావేశం 'నూతన ప్రపంచవ్యవస్థ' కు సంకేతం. ఒకప్పుడు ఇలా అమెరికా, చైనా, రష్యా మాత్రమే ఉండేవి. ఇప్పుడు మనం అందులో లేము అందరూ మనకు వ్యతిరేకంగా ఉన్నారు" అని ఆయన అన్నారు. పాశ్చాత్య మీడియాలో ఈ ఫొటో సంచలనంగా మారింది. అమెరికా వ్యతిరేక వర్గంగా ముద్రపడిన నాలుగు దేశాలు ఇరాన్, ఉత్తర కొరియా, చైనా, రష్యాల మొదటి సమావేశంగా విశ్లేషకులు అభిప్రాయపడినట్టు వాషింగ్టన్ పోస్ట్ పేర్కొంది. 'ఈ ఫొటో జిన్‌పింగ్, పుతిన్ మధ్య ఉన్న స్నేహం అమెరికాను సవాలు చేసేలా ఉంది. సుంకాలతో ట్రంప్ భారత్‌ను దూరం చేసుకోగా భారత దేశం చైనాకు దగ్గరవుతోందని అమెరికా పత్రికలు విశ్లేషించాయి.

# ఇసుకతవ్వకాలపై డిప్యూటీ సిఎం, ఐపిఎస్ మధ్య వాగ్వాదం


## వైరల్ అయిన విడియోతో పవార్‌పై నెటిజన్ల విమర్శలు



**ముంబయి, సెప్టెంబరు 5:** ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకోవడానికి వెళ్లిన ఓ ఐపీఎస్ అధికారిణికి ఏకంగా ఉపముఖ్యమంత్రి ఫోన్ చేయడం మహారాష్ట్రలో సంచలనంగా మారింది. అక్రమార్కులపై చర్యలు వద్దని ఫోన్‌లో ఉప ముఖ్యమంత్రి ఆదేశించడంతో ఇదే విషయాన్ని వీడియో కాల్‌లో చెప్పాలని సదరు ఐపీఎస్ అధికారిణి కోరారు. దీంతో ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సోలాపూర్ జిల్లాలోని కర్మలా తాలూకాలోని కుద్దు గ్రామంలో అక్రమ ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని సబ్‌డివిజనల్ పోలీసు అధికారిణి, ఐపీఎస్ అంజనా కృష్ణకు ఫిర్యాదులు అందాయి. దీంతో సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లిన అంజనా కృష్ణ ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకున్నారు. ఈ క్రమంలో కొందరు గ్రామస్థులు, స్థానిక ఎన్సీపీ కార్యకర్తలు అధికారులతో ఘర్షణకు దిగారు. వారిలో ఒకరు తమ పార్టీ అధినేత, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌కు ఫోన్ చేసి ఐపీఎస్ అంజనాకృష్ణకు ఇచ్చారు. ఫోన్‌లో ఇసుక తవ్వకాలకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవడం ఆపాలని పవార్ ఆమెను ఆదేశించారు. అయితే, తాను ఫోన్‌లో మాట్లాడుతున్నది ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ తోనేనని రుజువు చేసుకోవాలని, తనకు వీడియోకాల్ చేయాలని అంజనీకృష్ణ కోరారు. దీంతో ఆగ్రహంచెందిన అజిత్ పవార్ 'నన్నే వీడియో కాల్ చేయమంటావా నీకు ఎంత ధైర్యం?. మీపై చర్యలు తీసుకుంటా. నన్ను చూడాలనుకుంటున్నారుగా నాకు వీడియో కాల్ చేయండి' అంటూ నెంబర్ చెప్పి ఫోన్ పెట్టేశారు. దీంతో పవార్‌కు ఐపీఎస్ అధికారిణి అంజనా కృష్ణ వీడియో కాల్ చేశారు. ఈ సందర్భంగా తక్షణమే చర్యలు ఆపేయాలంటూ పవార్ ఆదేశించారు. కాగా, ఈ వీడియో వైరల్‌గా మారడంతో అజిత్ పవార్‌పై నెటిజన్లు మండిపడుతున్నారు. ఐపీఎస్ అధికారిణి విధులకు అడ్డుపడ్డారని, అక్రమార్కులపై చర్యలు తీసుకోకుండా అడ్డుకున్నారని విమర్శిస్తున్నారు. ఈ విమర్శలపై ఎన్సీపీ నేత సునీల్ తట్కరే స్పందిస్తూ పవార్ వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని వివరణ ఇచ్చారు. కార్యకర్తలను శాంతింపజేసేందుకు ఐపీఎస్ అధికారిణిని అజిత్ మందలించి ఉండవచ్చని అన్నారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు అజిత్ పవార్ మద్దతివ్వరని స్పష్టం చేశారు. ఈ వీడియోపై మాట్లాడేందుకు ఐపీఎస్ అధికారిణి అంజనా కృష్ణ నిరాకరించారు.

# సంక్షిప్తంగా..

## యుఎస్ మాజీ అధ్యక్షుడు జోబైడెన్‌కు తలపై గాయం!



**వాషింగ్టన్, సెప్టెంబరు5:** అమెరికా మాజీ అధ్య క్షుడు జో బైడెన్ ఆరోగ్య పరిస్థితిపై మరోసారి తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవల ఆయన తలపై ఒక గాయంతో, మునుపటి కంటే నీరసంగా, బడలికతో కనిపిస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో కలకలం రేపుతున్నాయి. ఈ వీడియోలు చూసిన నెటిజన్లు, రాజకీయ విశ్లే షకులు ఆయన ఆరోగ్యస్థితి గురించి రకరకాల ఊహాగానాలు చేస్తున్నారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, బైడెన్‌కు ఇటీవలే చర్మ క్యాన్సర్‌కు సంబంధించిన శస్త్రచికిత్స జరిగింది. ఈ ఆపరేషన్ కారణంగానే ఆయన తలపై గాయం ఏర్పడిందని తెలుస్తోంది. తాజాగా బయటకు వచ్చిన వీడియోలలో బైడెన్ చాలా అలసి పోయినట్లు, బలహీనంగా కనిపించడం తో ఆయన ఆరోగ్యం చుట్టూ జరుగు తున్న చర్చ మరింత ఊపందుకుంది. 82 యేళ్ల జో బైడెన్ ఆరోగ్యంపై చర్చ జరగడం ఇది మొదటిసారేమీ కాదు. గతంలో కూడా ఆయనకు చర్మ క్యాన్సర్‌కు సంబంధించి చిన్నపాటి చికిత్సలు జరిగినట్లు వైద్య నివేదికలు వెల్లడించాయి. అయితే, తాజా శస్త్రచికిత్స తీవ్రత, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు.

## ట్రంప్ వైట్‌హౌస్ విందుకు హాజరుకాని మస్క్..



**వాషింగ్టన్, సెప్టెంబరు 5:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం టెక్ దిగ్గజాలతో సమావేశమైన విషయం విదితమే. ఈ సమావేశానికి ట్రంప్ మాజీ సహచరుడు, స్పేస్ ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ హాజరు కాలేదు. అయితే తాను హాజరు కాకపోవడంపై మస్క్ తాజాగా స్పందించారు. ఆ సమావేశానికి ప్రెసిడెంట్ ట్రంప్ యంత్రాంగం నుంచి తనకు ఆహ్వానం అందిందని, అనివార్య కారణాల వల్ల తాను వెళ్ల లేకపోయానని వివరణ ఇచ్చారు. తనకు బదు లుగా తన కంపెనీ నుంచి ఓ ప్రతినిధిని పంపిం చానని మస్క్ తెలిపారు. ట్రంప్ సమావేశంపై ఆంగ్లమీడియా సంస్థ ఓ కథనం ప్రసారం చేస్తూ ఈ మీటింగ్‌కు ట్రంప్ యంత్రాంగం ఎలాన్ మస్క్‌కు ఆహ్వానం పంపలేదని పేర్కొంది. ఆహ్వానితుల జాబితాలో మస్క్ పేరు లేదని తెలిపింది. మస్క్ తాజా వివరణ నేపథ్యంలో టెస్లా, స్పేస్ ఎక్స్ కంపెనీల తరఫున ఎవరైనా హాజరై ఉండొచ్చని పేర్కొంది. అయితే, మస్క్ ప్రతినిధి హాజరుపై అటు ట్రంప్ యంత్రాంగం కానీ, ఇటు మీడియా సంస్థలు కానీ ఎలాంటి నిర్ధారణ ప్రకటన చేయకపోవడం గమనార్హం.

# ముంబయి మహానగరానికి మానవబాంబుల ముప్పు

## 14మంది ఉగ్రవాదులున్నారంటూ ఇమెయిల్ హెచ్చరికలు



**ముంబై, సెప్టెంబరు 5:** ముంబైకి బాంబు బెదిరింపులు రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ట్రాఫిక్ పోలీస్ వాట్సాప్ నెంబర్‌కు ఈ బెదిరింపులు వచ్చాయి. 34 వాహనాల్లో 400 కిలోల ఆర్డీఎక్స్‌తో మానవబాంబులు నగరంలోకి ప్రవేశించాయని, నగరం మొత్తాన్ని పేలుళ్లతో కుదిపేయనున్నామని పేర్కొంటూ బెదిరింపు సందేశాలు వచ్చినట్టు పోలీసులు తెలిపారు. లష్కర్ ఏ జిహాదీ అనే ఖాతా నుంచి ఈ బెదిరింపు వచ్చిందని, 14 మంది పాక్ ఉగ్రవాదులు ఇప్పటికే భారత్‌లోకి చొరబడినట్టు కూడా అందులో పేర్కొన్నారని వివరించారు. కాగా, బెదిరింపు సమాచారంతో ముంబై పోలీసులు హైఅలర్ట్ ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా పోలీసు బలగాలను అప్రమత్తం చేశారు. అన్ని కోణాల నుంచి విచారణ జరుపుతున్నారు. నగరంలోని కీలక ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. బాంబు నిర్వీర్య బృందాలు, డాగ్ స్క్వాడ్‌లను మోహరించారు. అనుమానాస్పద వాహనాలను గుర్తిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేశారు. మరో ఘటనలో, మహారాష్ట్రలోని థానే జిల్లాలో బాంబు బెదిరింపు చేసిన 43 ఏళ్ల వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసారు. నిందితుడిని రూపేల్ మధుకర్‌గా గుర్తించినట్టు గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపారు. కల్వ రైల్వే స్టేషన్‌లో బాంబు పెట్టినట్టు ఆదివారం మధ్యాహ్నాం 4 గంటలకు ఇతని నుంచి పోలీస్ హెల్ప్‌లైన్‌కు సమాచారం వచ్చింది. అయితే ఈ బెదిరింపు ఉత్తదే అని తేలింది. గత నెలలో గిర్‌గావ్‌లోని ఇస్కాన్ ఆలయానికి కూడా ఇలాంటి బాంబు బెదిరింపే వచ్చింది. ఆలయం ఆవరణలో బాంబులు పెట్టినట్టు టెంపుల్ ఆఫీస్ ఈమెయిల్ ఐడీకి మెసేజ్ వచ్చింది. ఆలయ నిర్వాహకులు పోలీసులను అప్రమత్తం చేయడంతో బాంబు డిటెక్షన్ అండ్ డిస్పోజల్ స్క్వాడ్ అర్ధరాత్రి సోదాలు జరిపింది. అయితే పేలుడు పదార్థాలు ఏవీ ఆవరణలో కనబడకపోవడంతో ఉత్తుత్తి బెదిరింపుగా తేలింది. గత మేలో కూడా మహారాష్ట్ర సెక్రటేరియట్‌కు బాంబు బెదిరింపు వచ్చింది. 48 గంటల్లో పేలుతుందంటూ హెచ్చరికలు రావడంతో గాలింపు చర్యలు చేపట్టగా ఎలాంటి అనుమానాస్పద వస్తువు కనిపించలేదు. ఇటీవల కాలంలో నకిలీ బెదిరింపు కాల్స్ ఎక్కువవుతున్నాయని పోలీసులు చెబుతున్నారు. స్కూళ్లు, విమానాశ్రయాలు, బహిరంగ ప్రదేశాల్లో బాంబులు పెట్టినట్టు మెయిల్స్ వస్తున్నాయి. అయితే ఈ బెదిరింపులు ఉత్తవే అని తేలుతున్నాయి. గత మేలో ముంబై ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయం, తాజ్ మహల్ ప్యాలెస్ హోటల్‌కు సైతం బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి.




# సైనిక దళాలకు హైపర్ సోనిక్ క్షిపణులు, అణుశక్తి యుద్ధ నౌకలు


**న్యూఢిల్లీ, సెప్టెంబరు 5:** పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత సైనిక దళాలకు అత్యాధునిక ఆయుధాలను అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ప్రణాళికను మోడీ సర్కార్ ఆవిష్కరించింది. దాదాపు 15 ఏళ్ల వ్యవధిలో ఈ లక్ష్యాలను పూర్తి చేసేలా రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసింది. ఇందుకోసం భారీ మొత్తంలో వెచ్చించేందుకు సిద్ధమైంది. కనీసం 500కు తగ్గకుండా హైపర్‌సోనిక్ క్షిపణులను దళాలకు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ విజన్ డాక్యుమెంట్ ప్రకారం పాత టి-72 యుద్ధట్యాంక్‌లను 1800 అత్యాధునిక ఫ్యూచర్ ట్యాంక్‌లతో భర్తీ చేయనున్నారు. మరో 400 తేలికపాటి ట్యాంక్‌లను దళాలకు అందించనున్నారు. ట్యాంక్‌పై నుంచి ప్రయోగించే 50,000 యాంటీ గైడెడ్ మిస్సైల్స్, 6,00,000 శతఘ్ని గుండ్లు, మానవ రహిత విమానాలను సమకూర్చుకోనుంది. వీటితో పాటు 700 రోబోటిక్ కౌంటర్ ఐఇడి సిస్టమ్‌లను రంగంలోకి దించాలని నిర్ణయించింది. ఇక నౌకాదళంకోసం సరికొత్త ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్, 10అత్యాధునిక ఫ్రిగేట్‌లు, 7 అడ్వాన్స్‌డ్ కార్వెట్టీలు, 4 ల్యాండ్ డాక్ ప్లాట్‌ఫారమ్స్, హెలికాప్టర్‌లకు ప్లాన్ చేస్తోంది. వీటితోపాటు అణుశక్తితో నడిచే యుద్ధనౌకలు, ఎలక్ట్రోమాగ్నెటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ లాంచ్ సిస్టమ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

# షిర్డీ సాయినాథునికి కోటిన్నర విలువైన కానుక

**ముంబయి, సెప్టెంబరు 5:** మహారాష్ట్రలోని షిర్డీ సాయిబాబా ఆలయానికి దుబాయ్‌కి చెందిన భక్తుడు రూ.1.58 కోట్ల విలువైన కానుకలను సమర్పించాడు. 1 కిలో 623 గ్రాముల బంగారంతో రూపొందించిన 'ఓం సాయి రామ్' అనే అక్షరాలను శిర్డీ ఆలయానికి విరాళంగా ఇచ్చాడు. అయితే తన వివరాలు బహిర్గతం చేయవద్దని సాయి బాబా సంస్థాను కోరినట్లు తెలుస్తోంది. దుబాయ్‌కి చెందిన భక్తుడి కుటుంబం ప్రతినెల షిరిడీ సాయినాథుడి దర్శనంచేసుకుని రూ. లక్ష విరాళంగా ఇస్తారని దేవాలయ అధి కారులు పేర్కొన్నారు. గురువారం మరో సారి షిరిడీని సందర్శించిన భక్తుడు కోటి న్నరవిలువైన బంగారు అక్షరాలను బహూకరించి నట్లు తెలిపారు. ఆలయంలోని రెండు ప్రధానద్వారాలకు వీటిని అమర్చినట్లు తెలిపారు.





# థాయ్‌లాండ్ కొత్త ప్రధానిగా అనుతిన్ చార్న్‌విరకూల్



**బ్యాంకాక్, సెప్టెంబరు 5:** థాయ్‌లాండ్ తదుపరి ప్రధానిగా అనుతిన్ చార్న్ విరాకుల్‌ను అక్కడి పార్లమెంట్ ఎన్నుకుంది. మాజీ ప్రధాని పేటోం గ్టార్న్ షినవత్రను అక్కడి రాజ్యాంగ న్యాయ స్థానం పదవి నుంచి తొలగించిన నేపథ్యంలో కొత్త ప్రధాని ఎన్నిక అనివార్యమైన విషయం తెలిసిందే. భూమ్‌జైతై పార్టీకి చెందిన అనుతిన్.. షినవత్ర నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వంలో పనిచేశారు. గత రెండేళ్లలోనే థాయ్ లాండ్‌కు మూడో ప్రధాని రావడం గమనార్హం. కంబోడియా సెనేట్ అధ్యక్షుడు హున్‌సేన్‌తో థాయ్‌లాండ్ ప్రధాని షినవత్ర ఫోనులో మాట్లాడడం సం చలనం రేపింది. ఇరు దేశాల మధ్య సరిహద్దు వివాదాలు తీవ్రంగా ఉన్న సమయంలో పొరుగుదేశం నేతతో కీలక విషయాలు పంచుకున్న తీరు వివాదాస్పదమైంది.

# ఉక్రెయిన్‌కు సహకరించే వారే లక్ష్యం: పుతిన్



**మాస్కో, సెప్టెంబరు 5:** ఉక్రెయిన్‌కు మద్దతుగా ఆ దేశంలో తమ దళాలను మోహరించే ఏ దేశాలనైనా తమ సైన్యం లక్ష్యంగా చేసుకుంటుందని రష్యా అధ్యక్షుడు పుతిన్ హెచ్చరించారు. ఉక్రెయిన్‌తో యుద్ధం జరుగుతున్న సమయంలో తమకు వ్యతిరేకంగా నిలిచే దేశాలను చట్టబద్ధమైన లక్ష్యాలుగా చేసుకునే అధికారం తమకు ఉంటుందన్నారు. ఇటువంటి బలగాల మోహరింపు దీర్ఘకాలిక శాంతికి అనుకూలంగా ఉండదని అభిప్రాయం వ్యక్తం చేశారు. పశ్చిమ దేశాలతో ఉక్రెయిన్‌కు ఉన్న సన్నిహిత సైనిక సంబంధాలు ఇరుదేశాల మధ్య సంఘర్షణకు మూలకారణమని వ్యాఖ్యానించారు. ఇరు దేశాల మధయయ శాంతి చర్చలు ఫలించి యుద్ధం ఆగిపోతే, ఉక్రెయిన్‌కు మద్దతుగా ఆ దేశంలో ఇతర దళాలను మోహరించాల్సిన అవసరం ఏముంటుందని పుతిన్ ప్రశ్నించారు. దీర్ఘకాలిక శాంతికి దారితీసే నిర్ణయాలు తీసుకుంటే.. అసలు ఉక్రెయిన్‌లో ఇతర దళాలు మోహరించాల్సిన అవసరమే ఉండదన్నారు. తాము చేసుకున్న ఒప్పందానికి రష్యా కట్టుబడి ఉంటుందని తెలిపారు. 26 ఐరోపా దేశాల నేతలు గురు వారం పారిస్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో సమావేశమైన నేపథ్యంలో పుతిన్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# కన్ఫర్మ్‌డ్ ఐఎఎస్‌లుగా సీనియర్ అధికారులు

### కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** వివిధ శాఖల్లో పనిచేస్తున్న పలువురు సీనియర్ అధికారులను కన్ఫర్మ్‌డ్ ఐఎఎస్‌లుగా పదోన్నతి కల్పించేందుకు తెలంగాణ సర్కార్ నిర్ణయించింది. ఈ మేరకు దీనికి సంబంధించిన ప్రతిపాదనలను కేంద్రానికి సమర్పించింది. రాష్ట్రంలో ఒకే సారి 21 మంది సీనియర్ అధికారులకు స్టేట్ సర్వీసు కేడర్, నాన్ స్టేట్ సర్వీసు కేడర్‌లకు కన్ఫర్డ్ ఐఎఎస్‌లుగా పదోన్నతి కల్పించేందుకు కసరత్తు పూర్తి చేసిన ప్రభుత్వం ఈ జాబితాను కేంద్రం అనుమతికి పంపించింది. రాష్ట్రంలో 2022 సంవత్సరానికి సంబంధించి 14 పోస్టులు, 2023 సంవత్సరానికి మూడు పోస్టులు, 2024 సంవత్సరానికి నాలుగు కన్ఫర్డ్ ఐఎఎస్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటి కోసం ఒక్కో పోస్టుకు ముగ్గురి పేర్ల చొప్పున కేంద్రంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీఓపీటీ)కి రాష్ట్ర ప్రభుత్వం పంపింది. గతంలో కన్ఫర్డ్ ఐఎఎస్ ఎంపికకు యూపీఎస్సీ అధికారులు డీఓపీటీ పంపించిన జాబితాతో ఇంటర్వ్యూలు చేసి ఎంపిక చేసే వారు. కానీ ఈ సంవత్సరం నుంచి ఇంటర్వ్యూల విధానాన్ని ఎత్తివేశారు. దీంతో డీఓపీటీకి పంపించిన మూడు పేర్లలో ఒక్కో పోస్టుకు ఒకరిని ఎంపిక చేస్తారు. సర్వీసు రిజిస్టర్, వారి ఉద్యోగ జీవితంలో సాధించిన విజయాలు, ఆరోపణలు, ఫిర్యాదులు తదితర వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని కన్ఫర్డ్ ఐఎఎస్‌లకు ఎంపిక చేయనున్నారు.

# యూరియా అదనపు సేల్‌కౌంటర్లు

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా యూరియా సరఫరా, వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో రైతు వేదికల వద్ద అదనపు యూరియా సేల్ కౌంటర్లను ఏర్పాటు చేయాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో మండలానికి ఒకటి లేదా రెండు సహకార సంఘాలు మాత్రమే ఉన్న ప్రాంతాల్లో రైతు వేదికలను వాడుకొని గ్రామాల వారీగా, పాస్ పుస్తకాల ఆధారంగా ఒక రోజు ముందుగానే టోకెన్లు జారీచేసి ఎరువులు అందించాలన్నారు. ఈ పంపిణీ ప్రక్రియలో ఎక్కడా అవకతవకలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పోలీస్, విజిలెన్స్‌తో కూడిన పర్యవేక్షణతో ఎక్కడా బ్లాక్ మార్కెటింగ్ జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వానాకాలం సాగు విస్తారంగా సాగుతున్న ప్రస్తుత సమయంలో రైతులు యూరియా ఎరువు కొరకు ఎదురుచూస్తున్నారని, వచ్చే 20 రోజుల్లో 2 లక్షల మెట్రిక్ టన్నుల సరఫరా చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. దీని పై కేంద్రం వెంటనే స్పందించి రాష్ట్రానికి అవసరమైన యూరియా కేటాయించేందుకు అంగీకరించిందని పేర్కొన్నారు. దేశీయ తయారీ యూనిట్ల నుండి కూడా అదనంగా 30 వేల టన్నుల యూరియాను రాష్ట్రానికి కేటాయించేందుకు కేంద్రం అంగీకరించినట్లు తెలిపారు. వచ్చే 3,4 రోజుల్లో రామగుండం యూనిట్ తిరిగి కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు చేపడతామని కేంద్రం హామీ ఇచ్చిందన్నారు. ఈ రోజు రాష్ట్రానికి 11,181 టన్నుల యూరియా చేరిందని, రేపు మరో 9,039 టన్నులు రానుందని చెప్పారు. ఈ నెలలో నాలుగు రోజుల్లోనే రాష్ట్రానికి 28 వేల టన్నుల యూరియా సరఫరా అయిందని ఆయన వివరించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 8,20,112 టన్నుల యూరియా విక్రయాలు జరిగాయని తెలిపారు.



# ఎపి, తెలంగాణలో మారుతి సుజుకి కొత్త ఎస్‌వియు విక్టోరియస్ ఆవిష్కరణ

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ (ఎంఎస్ఐఎల్) తన కొత్త ఎస్‌యువి విక్టోరియస్‌ను విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాల కోసం హైదరాబాద్‌లోని ఒకహోటల్‌లో గ్రాండ్ రీజినల్ అన్ వీలింగ్ చేసింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ కార్పొరేట్ సంస్థల నేతలు, ఫైనాన్షియర్లు, లీజింగ్ భాగస్వాములు, అలాగే డీలర్ ప్రతినిధులు హాజరయ్యారు. అందరి సమక్షంలో ఈ కార్యక్రమం గాట్ ఇట్ ఆల్ ఎస్‌యువిగా నిలిచే కొత్త విక్టోరియస్ ఆవిష్కరణ జరిగింది. కార్పొరేట్స్, ఫైనాన్షియర్లు, డీలర్ భాగస్వాములకు ప్రత్యేక ప్రదర్శన చేశారు. విక్టోరియస్ కోసం ఏపి, తెలంగాణ మార్కెట్లలో ఉన్న భారీ ఆసక్తి ఉత్సాహం ప్రతిబింబించిన సందర్భంగా నిలువనుంది.

భారతదేశంలో ఎస్‌యువి అనుభవాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్లడానికి విక్టోరియస్ ప్రత్యేకంగా రూపుదిద్దుకుంది. 8స్పీకర్ ప్రీమియం ఇన్ఫినిటీ బై హమాన్ సరౌండ్ సౌండ్ సిస్టమ్ తో డాల్బీ ఆల్టోమోనస్ 5.1 థియేటర్ ఆన్ వీల్స్ అనుభవం, 10.1 స్మార్ట్ ప్లే ప్రొ ఎక్స్ టచ్ స్క్రీన్, ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టం, జెశ్చర్ కంట్రోల్ పవర్డ్ టెయిల్‌గేట్, 64కలర్ అంబియెంట్ లైటింగ్ – అదనపు సౌకర్యంగా ఉంది. అధునాతన సేఫ్టీ ఫీచర్లు – లెవెల్ 2 ఏడిఏఎస్, 6 ఎయిర్‌బ్యాగ్‌లు, హెచ్‌డీ 360 వ్యూ కెమెరా బహుళ పవర్‌ట్రైన్ ఆప్షన్లు – స్ట్రాంగ్ హైబ్రిడ్ ఈవి నిజు మోడ్‌తో, పెట్రోల, ఎస్ సిఎన్‌జి టెక్నాలజీతో అందుబాటులో ఉండనుంది.

# ధన, ధాన్య కృషి యోజనపై ఆశలు

### రాష్ట్రంలోని 5 జిల్లాల్లో అమలుకు యత్నం

### ఇప్పటికే కేంద్రానికి సర్కార్ ప్రతిపాదన

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** కేంద్రం తాజాగా ప్రకటించిన ప్రధాన మంత్రి ధనధాన్య కృషి యోజన పథకాన్ని తెలంగాణలో అమలు చేయడంపై రాష్ట్ర సర్కార్ ఆశలు పెట్టుకుంది. రాష్ట్రంలోని ఐదు జిల్లాలను ఈ పథకంలో చేర్చేలా వ్యవసాయ శాఖ ప్రయత్నాలు చేస్తోంది. దీనికి సంబంధించి ఇప్పటికే రాష్ట్ర సర్కార్ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించింది. రాష్ట్రంలోని నారాయణపేట, ములుగు, ఆసిఫాబాద్, సంగారెడ్డి, కొత్తగూడెం జిల్లాలను చేర్పించేందుకు తీవ్ర యత్నాలు జరుగుతున్నాయి. కాగా దేశ వ్యాప్తంగా వ్యవసాయపరంగా వెనుకబడిన 100 జిల్లాల్లో రైతులకు చేయూతనిచ్చి దిగుబడులు పెంచడానికి కేంద్రం ప్రధానమంత్రి ధనధాన్య కృషి యోజన పథకాన్ని కేంద్రం తాజాగా ప్రకటించింది. కేంద్రంలోని 11 మంత్రిత్వ శాఖల్లో అమల్లో ఉన్న 36 పథకాలను సమ్మిళితం చేసి ఈ పథకాన్ని అమలు చేయనుంది. రూ.24వేల కోట్ల బడ్జెట్‌తో ఈ పథకాన్ని కేంద్రం ప్రారంభించింది. దీనికింద 1.7కోట్ల మంది రైతులకు ప్రయోజనం కల్పించేందుకు లక్ష్యంగా నిర్ణయించింది. పంటల మార్పిడి, సాగునీటి సౌకర్యాల కల్పన, నిల్వ సామర్థ్యం పెంపు, విలువ జోడింపు ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం దీని ప్రధాన లక్ష్యం. ఈ నేపథ్యంలో పూర్తిగా వర్షాలపై ఆధారపడిన తెలంగాణలోని ఐదు జిల్లాలను చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. ఈ జిల్లాల్లో పంటల ఉత్పాదకత చాలా తక్కువగా ఉంటోంది. వీటిని ధనధాన్య యోజనలో చేర్చితే ఆ జిల్లాల రైతులకు వ్యవసాయం గిట్టుబాటుగా మారుతుందని సర్కార్ చెబుతోంది.

# రైతుల కోసం వాట్సాప్ ఛానల్

### అందుబాటులోకి తెచ్చిన రాష్ట్ర వ్యవసాయ శాఖ

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** వ్యవసాయ సమాచారం నిమిత్తం రైతుల కోసం రాష్ట్ర వ్యవసాయ శాఖ కొత్తగా వాట్సప్ ఛానెల్‌ను అందుబాటు లోకి తీసుకొచ్చింది. దీని ద్వారా ఎప్పటికప్పుడు తెలంగాణ రైతాంగానికి కీలకమైన సమాచారం, సలహాలు, సూచనలను వ్యవసాయ శాఖ అందిస్తోంది. ప్రధానంగా వాతావరణ హెచ్చరికలు, పంటల వివరాలు, పురుగు మందులు, ఎరువుల వివరాలు సులువుగా రైతాంగానికి సమాచారం తెలియజేస్తున్నారు. ఈ వాట్సప్ఛానెల్ ఎలా వినియోగించుకోవాలి అనే విషయాన్ని తెలియజేడానికి అర్టిఫిషియలి ఇంటెలిజెన్స్ (ఎఐ)తో కూడిన వీడియోను కూడా సృష్టించింది. రైతులకు సాగు చేస్తున్న ఆయా పంటలకు తెగుళ్లు పడితే ఎలాంటి మందులు చల్లాలి, ఏం చేయాలి అనే విషయాలను ఆశాఖ సమాచారం ఇస్తుంది. రాష్ట్రంలో ప్రధాన పంటగా ఉన్న వరిలో పాముపొడ తెగులు, ఆకు ముడత నివారణ కోసం శాస్త్రవేత్తల సూచనల మేరకు చేపట్టాల్సిన చర్యలు వివరంగా ఇందులో పేర్కొంది. ఇక కంది, మొక్కజోన్నలో కాండం తొలుచు పురుగు కోసం వాడాల్సిన పురుగు మందులు, పత్తిలో జింక్ లోపం సవరణ, పచ్చదోమ నివారణ వంటి వాటికి ఎలాంటి చర్యలు చేపట్టాలి, ఉద్యాన వన పంటల విషయంలో సవాళ్లు, సమస్యలు ఎదురైతే రైతులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలను అందిస్తుంది. మధ్య మధ్యలో రైతులకు వ్యవసాయానికి సంబంధించి క్విప్ పోటీలను సైతం ఈ వాట్సప్ చానల్ లో నిర్వహిస్తున్నారు. రైతుల బీమా కు సంబందించిన సమాచారం, ప్రభుత్వ పథకాలు, సబ్సిడీ వివరాలు, పంటల సంరక్షణ సీజనల్ సూచనలు, ఆయా పంటలకు కీటక నియంత్రణ మార్గదర్శకాలు. మార్కెట్ ధరలు, శిక్షణా కార్యక్రమాల అప్ డేట్లు ఇలా అన్ని వివరాలు అరచేతిలో వున్న సెల్ ఫోన్ ద్వారా తెలుసుకోవచ్చని వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి.గోపి తెలిపారు.

# విద్యాసంస్థలను తీర్చిదిద్దడం ప్రభుత్వ ప్రాధాన్యత

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు



గురువారం టీచర్స్‌డే సందర్భంగా ట్యాంక్‌బండ్ వద్ద డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న రాంచందర్‌రావు తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** విద్యా సంస్థలను అభివృద్ధి దిశగా తీర్చిదిద్దడం ప్రభుత్వ ప్రాధాన్యత కల్పించాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు అన్నారు. గురువారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 138వ జయంతి (ఉపాధ్యాయ దినోత్సవం) వేడుకల సందర్భంగా, ట్యాంక్‌బండ్ వద్ద ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాం చందర్‌రావు మీడియాతో మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన మహనీయుడు, దేశ రెండో రాష్ట్రపతి, భారత రత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరిం చుకుని ఉపాధ్యాయ దినోత్స వాన్ని జరుపు కుంటున్నాం అన్నారు. భారతదేశ నిర్మాణంలో, అలాగే విద్యావ్యవస్థలో అనేక మార్పులకు కారణమైన సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం సందర్భంగా ఉపాధ్యాయులను గౌర వించుకోవాలన్నారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఉపాధ్యా యులకు, విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కనీసం వారి సమస్యలను, ఘోషను ప్రభుత్వం పట్టించుకోవాలని, ఇప్పటికీ ప్రభుత్వ ఉపాధ్యాయులు, టీచర్లకు సకాలంలో జీతాలు రావడం లేదని, రిటైర్డ్ టీచర్లు, ఉద్యోగులకు పెన్షన్ల విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. సమాజంలో భావితరాలను తీర్చిదిద్దే ఉపాధ్యాయులను గౌరవించడం ప్రతిఒక్కరి ధర్మం అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా విశ్వవిద్యాలయాల ప్రగతికి, విద్యా వ్యవస్థ బలోపేతానికి చర్యలు తీసుకోవాలన్నారు. విశ్వవిద్యాలయాలకు వెయ్యి కోట్లు ఇస్తామని కేవలం ప్రకటనలు గుప్పించడం కాదు, ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించాలన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల సమస్యలకు చెక్

### ఫొటోల కష్టాలకు తెర.. ఒక్క క్లిక్‌తో యాప్‌లో అప్‌లోడ్

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం కొత్త సౌకర్యం కల్పించింది. ఇకపై అధికారులు ఫొటోలు తీయకుండానే, లబ్ధిదారులే యాప్ ద్వారా ఇళ్ల చిత్రాలు అప్లోడ్ చేసే అవకాశాన్ని కల్పించారు. ఆ ఫొటోల ఆధారంగా బిల్లులు విడుదల చేస్తారు. ఈ విధానం వల్ల ఆలస్యం తగ్గి, లబ్ధిదారులకు సకాలంలో ఆర్థిక సహాయం అందుతుంది. ఈ పథకం ద్వారా లబ్ధిదారులకు దశలవారీగా నిధులు అందనున్న విషయం తెలిసిందే. ఈ కొత్త పద్ధతి పారదర్శకతను పెంచడమే కాకుండా, గ్రామీణ కుటుంబాల భాగస్వామ్యాన్ని కూడా పెంచుతుంది. తెలంగాణలో గృహ నిర్మాణ పథకాలలో ప్రధానమైనది ఇందిరమ్మ ఇళ్ల పథకం. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు గృహ భద్రత కల్పిం చాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టింది. గతంలో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించిన తర్వాత బిల్లులు రావడంలో ఆలస్యం ఎదుర్కొనడం సాధారణమైంది. దీనికి కారణం అధికారులు స్వయంగా స్థలానికి వెళ్లి ఇళ్ల ఫొటోలు తీసి నివేదిక పంపడంలో ఆలస్యం కావడంతో ఇప్పుడు ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ వీపీ గౌతం ప్రకటన ప్రకారం.. ఇకపై లబ్ధిదారులే తమ ఇందిరమ్మ ఇళ్ల ఫొటోలు నేరుగా ప్రత్యేక యాప్‌లో అప్లోడ్ చేసే సౌకర్యం పొందనున్నారు. ఆ ఫొటోలు ఆధారంగా వెంటనే బిల్లులు విడుదల చేయబడతాయి. దీంతో ఎవరూ అధికారులపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. సమయానికి సాయం అందు తుంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు జరిగాయి. ఈ పథకం దశలవారీగా అమలు అవుతోంది. మొదటి దశలో ముగ్గులు పోసి.. బేస్ మట్టం వరకు లేపిన తర్వాత డబ్బులు జమ చేస్తారు. ఆ తర్వాత గోడలు కట్టిన తర్వాత ఫొటోలు పంపితే మొదటి వాయిదా వస్తుంది. మూడో దశలో పైకప్పు పూర్తయిన తర్వాత మరో విడత విడుదల అవుతుంది. చివరగా ఇంటి పనులు ముగిసిన తర్వాత తుది బిల్లు వస్తుంది. ఈ విధానంతో లబ్ధిదారులకు పారదర్శకతతో పాటు వేగవంతమైన ఆర్థిక సహాయం లభిస్తుంది. ఈ నిర్ణయం సొంత ఇంటి కలను నిజం చేసుకోవాలనుకునే వేలాది కుటుంబాలకు ఉపశమనం కలిగిస్తుంది. అయితే అధికారులు ఫొటోలు తీసేందుకు వెళ్లకపోవడం.. దీంతో బిల్లులు ఆలస్యం వంటి సమస్యలు ఏర్పడుతున్నాయి.

ఇక వీటిని చెక్ పడనుంది. గ్రామీణ ప్రాంతాల్లో స్మార్ట్‌ఫోన్ ఉపయోగం పెరుగు తున్నందున, చాలామంది లబ్ధిదారులు ఈ కొత్త సదుపాయాన్ని సులభంగా వినియోగించగలరని అధికారులు అంచనా వేస్తున్నారు. పేద కుటుంబాల గౌరవాన్ని, భవిష్యత్తును కాపాడే ప్రయ త్నంలో భాగంగా దీనిని తీసుకొచ్చారు. తమ ఇంటిని తాము ఫొటో తీసి అప్లోడ్ చేయడం ద్వారా లబ్ధిదారులు ప్రభుత్వ పథకంలో భాగస్వామ్యులవుతారు. తద్వారా ఇందిరమ్మ ఇళ్ల పథకం మరింత పారదర్శకతతో ముందుకు సాగనుంది.

# కెసిఆర్ లేకుంటే బిఆర్ఎస్ ఉండదు: ఎంపి అసదుద్దీన్ ఒవైసి

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు లేకుంటే ఆ పార్టీ మనుగడలో ఉండదని మజ్లీస్ పార్టీ అధ్యక్షుడు, లోక్‌సభ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్య చేశారు. శుక్రవారం అసద్ తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ కెసిఆర్ అంటే తనకు గౌరవం ఉందన్నారు. కెసిఆర్ అంటేనే బిఆర్ఎస్, బిఆర్ఎస్ అంటేనే కెసిఆర్ అని ఆయన తెలిపారు. కెసిఆర్ లేకపోతే బిఆర్ఎస్ ఉండదని ఆయన చెప్పారు. అంతకుముందు అసద్ మహారాష్ట్ర కార్యవర్గంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముంబయి, పుణే, నాగ్‌పూర్, ఔరంగాబాద్,నాసిక్, ఔరంగాబాద్, పర్బనీ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు పార్టీని మరింత బలో పేతం చేసుకునే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ దళితులు, మైనారిటీల సమస్యలపై పోరాటం ఉధృతం చేయాలని కార్యవర్గానికి పిలుపునిచ్చారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థుల ఎంపిక విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, నిజాయితీపరులను ఎంపిక చేయాలని, ఎన్నికైన తర్వాత పార్టీ ఫిరాయించని వారిని గుర్తించాలని ఆయన సూచించారు.

# మంత్రి సీతక్కతో నీట్ క్వాలిఫైడ్ విద్యార్థులు, తల్లిదండ్రుల భేటీ

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** ప్రజాభవన్‌లో శుక్రవారం మంత్రి సీతక్కను నీట్ క్వాలిఫైడ్ విద్యార్థులు వారి తల్లిదండ్రులు కలిశారు. నీట్ పరీక్షలో మంచి ర్యాంకు సాధించినా సుప్రీంకోర్టు తీర్పు కారణంగా కౌన్సిలింగ్‌కు హాజరు కాలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ బిడ్డలమైనప్పటికీ కేవలం ఇంటర్మీడియట్ పొరుగు రాష్ట్రాల్లో చదవడం వల్ల తమ నష్ట పోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పుతో పొరుగు రాష్ట్రంలో చదవడంతో 45 మంది నీటి విద్యార్థులు నష్టపోతున్నట్లు వారు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. క్వాలిఫైడ్ అయిన నీట్ విద్యార్థుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని మంత్రి సీతక్క వారికి హామీ ఇచ్చారు. మంత్రి తమ సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు కృతజ్ఞతలు తెలిపారు.

### పోచారం శ్రీనివాస్‌రెడ్డి బాన్సువాడలో

# ఓడిపోవడం ఖాయం

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** తెలంగాణలో రాబోయే ఆరు నెలల్లో ఉప ఎన్నికలు వస్తాయని బాన్సువాడలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఓడిపోవడం ఖాయమని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల రామారావు జోస్యం చెప్పారు.ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసంలో బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతలు, వందలాది కార్యకర్తలు శుక్రవారం బిఆర్ఎస్ పార్టీలో చేరారు. స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే మరోసారి సుప్రీంకోర్టుకు వెళ్తామని, పోచారం ఎమ్మెల్యే పదవి పోయే వరకు న్యాయపోరాటం కొనసాగిస్తామని కేటీఆర్ తెలిపారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ భారతదేశంలోనే నంబర్ వన్ రాష్ట్రాన్ని బంగారు పళ్లెంలో పెట్టి కాంగ్రెస్ చేతిలో పెట్టామని కానీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలోనూ, గతంలో ఉన్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడంలోనూ ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. దీనికి బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి ప్రజలకు క్షమాపణ చెప్పాలని, తమకు పరిపాలన చేతకావడం లేదని, అన్ని కార్యక్రమాలను అమలు చేయలేమని నేరుగా చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కేవలం 21 నెలల్లోనే ప్రజల నుంచి సంపూర్ణ వ్యతిరేకతను మూటగట్టుకుందని విమర్శించారు. హామీల వైఫల్యం, నమ్మకద్రోహం ఒక కారణం అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటల తీరు, వ్యవహార శైలి మరో ప్రధాన కారణమని ఆయన పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పరిపాలనపై దృష్టి పెట్టకుండా ప్రతిక్షణం కెసిఆర్ పేరు తలుచుకుంటూ అడ్డగోలు మాటలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వాన్ని నడపడం చేతగాక, గత ప్రభుత్వం అప్పులు చేసిందని కాంగ్రెస్ అబద్ధాలు చెబుతోందని మండిపడ్డారు. గత ప్రభుత్వం కేవలం రూ. 2.80 లక్షల కోట్ల అప్పు మాత్రమే చేసిందని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిందని తెలిపారు. అయితే, ఈ 21 నెలల కాలంలోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ. 2.20 లక్షల కోట్ల పైగా అప్పులు చేసిందని, ఆ అప్పుతో ఏ ఒక్క సంక్షేమ పథకం లేదా అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదని విమర్శించారు. గత ప్రభుత్వం సంవత్సరానికి రూ. 20 వేల కోట్ల అప్పు చేస్తే, ఈ ప్రభుత్వం నెలకు రూ. 20 వేల కోట్ల అప్పు చేస్తోందని ఆరోపించారు.

యూరియా సంక్షోభంపై రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అనుమానాలకు దారితీస్తోందని కెటిఆర్ అన్నారు. పంటల కొనుగోళ్లకు, ఆ తర్వాత వాటికి ఇవ్వాల్సిన బోనస్‌ను ఎగగొట్టాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే యూరియా సరఫరా చేయడం లేదని ప్రజలు భావిస్తున్నారని ఆయన తెలిపారు. వ్యవసాయ రంగం, రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంత దుర్మార్గమైన ఆలోచన ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎర్రవెల్లిలోని కెసిఆర్ నివాసంలో జరిగిన చేరికల కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతలు, వందలాది కార్యకర్తలు భారత రాష్ట్ర సమితిలో చేరారు. వీరిలో ఎంపిటిసి ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యలమంచిలి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కోటగిరి వల్లేపల్లి శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ బాన్సువాడ నార్ల రత్న కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బొట్టె గజేందర్, మాజీ సర్పంచులు పద్మ మొగులయ్య, బంజా గంగారాం, కురలేపు నగేష్, మాజీ కోఆప్షన్ హాకీమ్ తదితరులు ఉన్నారు.

# ఖేలో ఇండియా గేమ్స్ తెలంగాణలో నిర్వహించండి

### కేంద్రమంత్రికి రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి విజ్ఞప్తి

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** ఖేలో ఇండియా గేమ్స్‌ను తెలంగాణలో నిర్వహించాలని కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండ వీయను కోరినట్లు రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకాటి శ్రీహరి శుక్రవారం ఢిల్లీలో తెలిపారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా తెలంగాణలో ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహించాలని కేంద్రాన్ని కోరినట్లు మంత్రి చెప్పారు. తెలంగాణలోని వివిధ జిల్లాల్లో ఉన్న స్పోర్ట్స్ స్కూల్స్‌కి ఆర్థికంగా సహాయం చేయాలని, క్రీడా ప్రాంగణాల అభివృద్ధి, మౌలిక సదుపాయాలతోపాటు ఆర్థిక సహాకారం కూడా అందించాలని కేంద్రమంత్రిని కోరినట్లు తెలిపారు. త్వరలోనే మూడు రోజుల పాటు తెలంగాణలో పర్యటిస్తామని కేంద్ర మంత్రి చెప్పినట్లు మంత్రి వాకాటి శ్రీహరి తెలిపారు.

# న్యాక్ ట్రైనర్ స్నేహాలతకు రాష్ట్రపతి నుంచి అవార్డు

### అభినందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్‌ను అత్యుత్తమ స్కిల్ డెవలప్‌మెంట్ వేదికగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర రోడ్ల భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి, న్యాక్ వైస్ చైర్మన్ కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి చేస్తున్న కృషికి ఫలితం దక్కుతోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు విద్యార్థుల్లో స్కిల్ డెవల్మపెంట్ పెంపొందించాలనే లక్ష్యంతో ఇప్పటికే ప్రజా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా స్కిల్ డెవలప్‌పెంట్ సెంటర్స్ ఏర్పాటు చేస్తున్నది. అందులో భాగంగా హైదరాబాద్ వేదికగా, జిల్లాల్లో న్యాక్ ద్వారా శిక్షణ ఇవ్వడమే కాకుండా100 శాతం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఎన్ ఎసి వైస్ ఛైర్మన్,మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు మంత్రి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు.ఈ నేపథ్యంలోనే టీచర్స్ డే పురస్కరించుకొని న్యాక్ ట్రైనర్ స్నేహాలతకు రాష్ట్ర పతి చేతుల మీదుగా జాతీయ అవార్డు రావడం పట్ల మంత్రి తన హర్షం వ్యక్తం చేశారు.

మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ ఎంటర్ ప్రెన్యూర్షిప్ విభాగంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గారి చేతుల మీదుగా శుక్రవారం ఢిల్లీలో జాతీయ ఉత్తమ టీచర్స్ అవార్డు అందుకున్న న్యాక్ ట్రైనర్ స్నేహాలతకు ఫోన్ చేసి మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఆమె న్యాక్ ద్వారా నిరుద్యోగ యువతలో నైపుణ్యం పెంపొందించేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లా, కరీంనగర్, జగిత్యాల పట్టణాల్లో నిరుద్యోగ యువతకు సర్టిఫికెట్ కోర్సులు, ఉద్యోగ అవకాశాలు కల్పించే వృత్తివిద్యా కోర్సులను అందిస్తూ, ఉత్తమ బోధన అందించేందుకు చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు దక్కిందని కొనియాడారు.

దేశవ్యాప్తంగా 13 మంది ఈ వార్డుకు ఎంపికైతే తెలంగాణ నుండి న్యాక్ ఇన్‌స్ట్రక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న హన్మకొండకు చెందిన నక్క స్నేహాలతకు అవార్డు రావడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం అన్నారు.నైపుణ్యాలకు ఉత్తమ వేదికగా నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ ను బలోపేతం చేస్తున్నామని పేర్కొన్న మంత్రి, ప్రతిష్టాత్మక జాతీయ అవార్డు దక్కడంతో న్యాక్ ఫ్యాకల్టీ,సిబ్బందిలో మరింత ఉత్సాహాన్ని నింపిందన్నారు. స్నేహాలతను ప్రోత్సహించిన న్యాక్ డైరెక్టర్ శాంతిశ్రీని మంత్రి ఈ సందర్భంగా అభినందించారు. రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న స్నేహాలతకు న్యాక్ డైరెక్టర్ జనరల్(డీజీ),ప్రభుత్వ స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్ అభినందనలు తెలిపారు.

# ప్రభుత్వ అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి కేంద్రంపై నెపం సరికాదు

### బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతలను కప్పిపుచ్చుకోడానికి కేంద్రాన్ని, బిజెపిని నిందించడం సరైనది కాదని, కేంద్ర ప్రభుత్వం రైతుల, వ్యవసాయ రంగానికి నిరంతరం మద్దతు ఇస్తుందని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో ప్రభుత్వం ఉందా? ఉందంటే, కాంగ్రెస్ ప్రభుత్వానికి సమన్వయం ఉందా అనే సందేహం ప్రజల్లో ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి మాట్లాడుతూ యూరియా కొరత లేదని, సమస్య కేవలం పంపిణీలోనే ఉందని చెబుతున్నారు.కానీ పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ యూరియా కొరత ఉందని, దానికి కేంద్రమే బాధ్యత అని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. మహేశ్ కుమార్ గౌడ్‌కి వాస్తవ పరిస్థితి తెలుసుకోవడానికి ప్రయత్నం చేయడంలేదా? లేక కేవలం కమ్యూనికేషన్‌లో లోపమేనా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో అక్టోబర్ 31 వరకు అవసరాల మేరకు 9.3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందించింది, 2.8 లక్షల మెట్రిక్ టన్నులు బఫర్ స్టాక్‌లో ఉన్నాయన్నారు. ఈ విషయం రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందన్నారు. మరి ఎరువుల కొరత ఇంకెక్కడిది?జులైలోనే 20శాతం మేర ఎక్కువ యూరియాను రాష్ట్రానికి కేంద్రం పంపించింది. టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కేంద్రాన్ని బదనాం చేసే ప్రయత్నం చేస్తూ, అసలు లోపాన్ని బయటపెట్టడం లేదన్నారు. ఆదిలాబాద్, మహబూబ్ నగర్, వికారాబాద్‌లో ఎరువుల లారీలు పట్టు బడినట్లు, ఎరువుల దుకాణాలు మూసివేసినట్లు వార్తలు వస్తున్నాయి.ఇక్కడ బ్లాక్ మార్కెటింగ్, పంపిణీ లోపాలు ఎక్కడ జరిగాయి అనే విషయం పరిశీలించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఓఆర్‌ఆర్‌పై సిట్ విచారణ చేపడతామని చెప్పింది. కానీ ఇప్పటివరకు ఏ విచారణ జరగడం లేదు. ఇందులో ఏమైంది, ఎక్కడ ఎంత డబ్బు ముట్టిందనే అనుమానాలు ప్రజల్లో కలుగుతున్నాయి. గత బిఆర్ఎస్ సర్కారు కమీషన్లు తీసుకొని కాంట్రాక్టర్లకు అమ్మేసింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం దానిపై విచారణ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం త్వరలో రివ్యూ జరపకపోతే ప్రజల ఆగ్రహానికి బాధ్యత వహించాల్సి వస్తుంది. అవినీతికి నిదర్శనంగా ఓఆర్ఆర్ మారింది. నరేంద్ర మోడీ ప్రభుత్వం వాహనదారులపై



భారం తగ్గిస్తుంటే.. కాంగ్రెస్ సర్కారు అసమర్థతతో భారం పెరుగుతోంది.కేంద్రం జాతీయ రహదారులపై టోల్ ఛార్జీలను తగ్గించడంలో కీలక నిర్ణయం తీసుకుంది. అదే విధానాన్ని ఓఆర్ఆర్‌పై కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# తెలంగాణ చరిత్రలో పోరాటాలన్నీ భూమి కోసమే

## ధరణి ముసుగులో దోపిడీకి దిగిన బిఆర్ఎస్ సర్కారు
## వీఆర్వో, వీఆర్ఏలు అడ్డుగా ఉన్నారని దోషులుగా నిలబెట్టే యత్నం
## దివంగత పివి నర్సింహారావు అగ్రికల్చర్ సీలింగ్ యాక్ట్ తీసుకొచ్చారు
## జిపిఒల నియామకపత్రాల అందజేత కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** తెలంగాణ చరిత్రలో పోరాటాలన్నీ భూమి కోసం జరిగినవేనని.. కొమురంభీమ్, చాకలి ఐలమ్మ, రావి నారాయణరెడ్డి లాంటి వాళ్లు భూమి కోసమే పోరాడారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. భూమి కోసం పోరాటాలే కాదు.. భూదాన్ ఉద్యమానికి పునాదులు పడింది కూడా తెలంగాణ ప్రాంతంలోనేనన్నారు. వెదిరె రామచంద్రా రెడ్డి వేలాది ఎకరాలను పేదలకు పంచి భూదానోద్యమం చేశారని గుర్తు చేశారు. ఆనాడు మాజీ ప్రధాని దివంగత పీవీ నర్సింహారావు అగ్రికల్చర్ సీలింగ్ యాక్ట్ తీసుకొచ్చి అసైన్డ్ భూములను పేదలకు పంచారని అన్నారు. భూమిని చెరబట్టిన వారిని తెలంగాణ ప్రజలు దిగంతాలకు తరిమారని అన్నారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో గురువారం గ్రామ పంచాయతీ ఆఫీసర్ (జీపీఓ)లుగా ఎంపికైన 5 వేల మందికి నియామకపు పత్రాలను అందించే కొలువుల పండుగ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, సీసీఎల్ లోకేశ్‌కుమార్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ సాధనలో రెవెన్యూ ఉద్యోగుల పాత్ర కీలకమైనదని, మారుమూల పల్లెల్లో తెలంగాణ భావ వ్యాప్తికి తోడ్పాటునందించి, క్రియాశీలక పాత్ర పోషించి రాష్ట్ర సాధనలో భాగమయ్యారని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం మొదటి సీఎం కేసీఆర్ ఉద్యమంలో పాల్గొన్న వారందరి ప్రతిష్టను పెంచుతారని అనుకున్నామని, ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తు చేశారు. రెవెన్యూ శాఖ సిబ్బందిని దొంగలుగా చిత్రీకరించారని, ప్రజల ముందు దోషులుగా నిలబెట్టే ప్రయత్నం చేశారని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. భూమికి, తెలంగాణకు విడదీయరాని సంబంధం ఉంది. తెలంగాణలో పోరాటాలన్నీ భూమి చుట్టూనే తిరిగాయి. సాయుధ రైతాంగ పోరాటం భూమి కోసం, భుక్తి కోసం చేశారని కథలు కథలుగా చెప్పుకుంటారు. సమైక్య రాష్ట్రంలో మన భూములను చెరబడుతున్నారన్న ఉద్దేశ్యంతోనే పోరాటం వచ్చిందన్నారు. వెదిరె రామచంద్రారెడ్డి వంటి భూస్వాములు భూమిని దానం చేసి భూదానోద్యమానికి నాంది పలికారు. నక్సల్బరీ ఉద్యమంలో దున్నే వాడిదే భూమి అంటే అప్పటి ప్రధాని పీవీ నర్సింహారావు అగ్రికల్చర్ సీలింగ్ చట్టాన్ని తీసుకొచ్చి, ఆ భూమిని తీసుకుని పేదలకు అసైన్ చేశారన్నారు. 25 లక్షల ఎకరాల భూమిని పంచారన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే ఆదివాసీలకు 10 లక్షల ఎకరాలు పంపిణీ చేసినట్టు గుర్తు చేశారు. తల్లికి, బిడ్డకు ఉన్న సంబంధమే భూమి, తెలంగాణకు ఉంది. ప్రత్యేక రాష్ట్ర తెలంగాణ సాధన తర్వాత ధరణి అనే భూతాన్ని తీసుకొచ్చారు వారి భూదాహం తీర్చుకునేందుకు అమలు చేశారు. వాళ్ల దోపిడీని తెలియకుండా చేసేందుకే వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేశారు. వాళ్ల దుర్మార్గాన్ని తెలంగాణ సమాజం నిలదీస్తుందన్న భయంతోనే వీఆర్వోలను తొలగించారన్నారు. ఆ దోపిడీకి అడ్డుగా ఉన్న ఈ వ్యవస్థలోని ఉద్యోగులను వీఆర్వో, వీఆర్‌లను రైతులు భూములను గుంజు కుంటున్నారని నిందలు వేశారన్నారు. చెట్టుకొకరిని, పుట్టకొకరిని పడేశారని సీఎం రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తాను పాదయాత్ర చేసేటప్పుడు ఎవరిని కదిలించినా ధరణి భూతంగా మారిందని చెప్పారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే రాహుల్ గాంధీతో చెప్పించాను, సీడబ్ల్యూసీలో చర్చించాం ధరణిని బంగాళాఖాతంలో విసిరేస్తామన్నాం. అందుకే ఈ సమస్యను పరిష్కరించేందుకు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి రెవెన్యూ శాఖను అప్పగించామన్నారు. నిపుణుల కమిటీని వేశాం, భూ భారతి- 2025 చట్టాన్ని తీసుకొచ్చామన్నారు.

ధరణితో పట్టుకున్న దరిద్రాన్ని తొలగించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఆనాటి పాలకులు నందించిన వైరస్ ధరణి అందుకే జీపీవోలు వచ్చిన తర్వాత దోపిడీ లెక్కలు తీయాలి పేద రైతులకు వారధిగా ఉండాలని గ్రామ పాలనాధికారులను తీసుకొస్తున్నామన్నారు. 1.56 కోట్ల ఎకరాల భూముల రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన చేస్తామన్నారు. తహశీల్దార్లు తప్పులు చేస్తే చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలి అంతే తప్ప సొంతింటిని తగులబెట్టుకోవడం సరైంది కాదు. భూ భారతి చట్టాన్ని అమలు చేయాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అలాగే సాదాబైనామా దరఖాస్తులను పరిశీలించి న్యాయం చేయాలన్నారు. ఈ భూమితో చెలగాటం ఆడినోళ్లు, ధరణితో చెలగాటమాడినోళ్లకు ఒకటే గతి పడుతుందన్నారు. ధరణి ముసుగులో దోపిడీ చేయడం వల్లే వారికి ప్రజలే శిక్ష అమలు చేశారన్నారు.

గత ప్రభుత్వం 2020 ఆర్వోఆర్ చట్టం, ధరణి పోర్టల్ వల్ల తెలంగాణ సమాజం తీవ్రంగా నష్టపోయిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అందువల్లే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ధరణిని బంగాళాఖాతంలో కలిపేసి, భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని, దీని రూపకల్పన సమయంలో సీఎం రేవంత్ రెడ్డిని సుమారు 3637 గంటలకు పైగా పలుమార్లు విసిగించి ఆయన సలహాలతో మరీ తీసుకువచ్చామన్నారు. భూ భారతిని తొలుత 4 మండలాల్లోని 4 గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్ట్ తీసుకువచ్చామని.. తర్వాత 32 మండలాల్లోనూ, జూన్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు అందించామని వివరించారు. 8.65 లక్షల దరఖాస్తులు తీసుకున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో సాదాబైనామాలపై సుమారు 9.26 లక్షల దరఖాస్తులకు మోక్షం కలగలేదని, పైగా కోర్టులలో కేసులు నమోదయ్యాయని తెలిపారు. తాజా నిర్వహించిన సదస్సులలో సుమారు 8.65 లక్షల దరఖాస్తులు వచ్చాయన్నారు. వారం రోజుల క్రితం కోర్టులో సాదాబైనామాలపై స్టేను తొలగించేలా ప్రయత్నించి సఫల మయ్యామని తెలిపారు. రాష్ట్రంలో 6860 క్లస్టర్లను ఏర్పాటు చేసి 10,954 రెవెన్యూ గ్రామాలలో గ్రామపరిపాలనాధికారుల నియామకం చేపడుతున్నామన్నారు. సర్వేయర్ల నియామకం ద్వారా భూ సమస్యలకు చెక్ పెడతామన్నారు. 318 మంది సర్వేయర్లకు అదనంగా 800 మందిని నియమించడమే గాక 7000 మంది లైసెన్స్ డ్ సర్వేయర్లను వచ్చే ఉగాదిలోగా భర్తీ చేస్తామని ప్రకటించారు. ఇకపై ప్రభుత్వానికి మాట, మచ్చ రాకుండా పనిచేయాల్సిన బాధ్యత రెవెన్యూ కుటుంబ సభ్యులదేనని చెబుతూ ఉన్నత సేవలు అందిస్తామంటూ మంత్రి పొంగులేటి ప్రత్యేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ధరణి స్థానంలో అద్భుతమైన భూభారతి చటాన్ని తీసుకువచ్చామని ఈ చట్టం రూపొందించే సమయంలో సీఎం రేవంత్ రెడ్డి నిద్రలేని రాత్రులు గడిపారని మంత్రి పొంగులేటి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

## తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు రూ.25 కోట్లు విడుదల

### పరిషత్ అడ్మినిస్ట్రేటర్ నరసింహామూర్తి

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ లో అకౌంట్‌లో ప్రభుత్వం రూ.25 కోట్లు జమ చేసిందని పరిషత్ అడ్మినిస్ట్రేటర్ కె. నరసింహామూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.రాష్ట్రంలో పేద బ్రాహ్మణ కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ ఆర్థిక సంవత్సరం 2025-26కు గాను రూ.100 కోట్ల బడ్జెట్‌ను బ్రాహ్మణ పరిషత్‌కు కేటాయించినట్లు ఆయన చెప్పారు. వాటిలో మొదటి విడత గురువారం రూ.25 కోట్లను ప్రభుత్వం జమ చేసిందన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి భట్టివిక్రమార్క,పరిషత్ చైర్పర్సన్, దేవాదాయశాఖ కార్యదర్శి శైలజారామయ్యర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



## భార్యకు వివాహేతర సంబంధం

### తమ్ముడిని చంపి గోతిలో పూడ్చిన అన్న

**జైపూర్, సెప్టెంబరు 5:** తన భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడన్న అను మానంతో సోదరుడిని చంపేశాడు. మృతదేహాన్ని ఓ క్వారీలో 10 అడుగుల గుంత తీసి పూడ్చిపెట్టాడు. గత నెల 27న రాజస్థాన్‌లోని నాగౌర్ జిల్లాలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నాగౌర్‌లోని భవండాకు చెందిన సోహన్‌రామ్ (29) తన భార్యపై అనుమానం పెంచుకున్నాడు. తనకు సోదరుడు వసురసయ్యే ముకేశ్ గల్వా అనే వ్యక్తితో ఆమె వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నదని అనుమానిస్తున్నాడు. ఈ క్రమంలో ఆగస్టు 27న ముకేశ్‌ను సమీపంలోని భట్‌నోక్హా గ్రామంలో జరుగుతున్న వినాయక చవితి ఉత్సవాలు చూసొద్దామని తీసుకెళ్లాడు. రాత్రి పొద్దుపోయే వరకు ఇద్దరు అక్కడే ఉన్నారు. పూజా కార్యక్రమాలు పూర్తయిన తర్వాత అక్కడి నుంచి బయల్దేరారు. నిర్మానుష్య ప్రదేశానికి అతడిని తీసుకెళ్లి ఇనుప రాడ్డుతో చచ్చేవరకు కొట్టాడు. అనంతరం తన క్వారీలో బుల్డోజర్‌తో 10 అడుగుల లోతు గుంత తీసి ముకేశ్‌ను పాతిపెట్టాడు. ఎవరూ గుర్తించకుండా బొందపై పెద్దపెద్ద బండరాళ్లు పెట్టేశాడు. అనంతరం ఏమీ తెలియనట్లుగా గ్రామానికి తిరిగి వచ్చాడు. అయితే ముకేశ్ ఇంటికి తిరిగి రాకపోవడంతో అతని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో పలువురిని విచారించగా సోహన్‌రామ్ పేరు చెప్పడంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో అడగడంతో అసలు విషయం చెప్పాడు. దీంతో సోహన్‌రామ్‌పై హత్య కేసు నమోదుచేసి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు చెప్పిన వివరాల ప్రకారం క్వారీలో నుంచి ముకేశ్ మృతదేహాన్ని బయటకు తీసి, పోస్టు మార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు.

## రాజ్యాంగాన్ని పట్టుకుని ఫోజులు కొట్టే రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలి

### ఎక్స్ వేదికపై టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



**హైదరాబాద్, సెప్టెంబరు 5,ప్రభాతవార్త:** యూరియా దొరకక కళ్లముందే పంట ఎండిపోవడంతో ఆక్రోశంలో మాట్లాడిన రైతుపై కక్షగట్టి అర్ధరాత్రి నుంచి పోలీసులను అతని ఇంటిపైకి పంపించి రైతు లక్ష్మణ్‌ను అతని కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురి చేస్తారా..? అన్నదాతలకు కనీసం నిరసన తెలిపే హక్కు కూడా లేదా రాజ్యాంగాన్ని పట్టుకుని ఫోజులు కొట్టే రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలె అని టిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ ఎక్సె వేదికపై డిమాండ్ చేశారు. పదేళ్లపాటు ఎన్నడూ లేని యూరియా సంక్షోభాన్ని తన చేతకానితనంతో సృష్టించిన రేవంత్‌పై కోపాగ్నితో రగిలిపోతున్న లక్షలాది రైతులపై కేసులు పెట్టే దమ్ము ఈ సర్కారుకు ఉందా? పల్లెపల్లెనా ఈ సర్కారుపై దుమ్మెత్తిపోస్తున్న రైతులందరిని అరెస్టు చేయడానికి ఈ పోలీసులు సరిపోరు అనిఅన్నారు. ఈ రాష్ట్రంలో ఉన్న జైళ్లు కూడా సరిపోవు. కడుపుకాలిన తెలంగాణ రైతులతో పెట్టుకుంటే ఏం జరుగుతుందో రేవంత్ రెడ్డి, తన పాత గురువును అడిగి తెలుసుకుంటే మంచిది. ఇకనైనా ఈ అక్రమ కేసులు బనాయించి అమాయక రైతు లక్ష్మణ్‌ను వేధించడం మానుకోకపోతే, అతనికి రక్షణ కవచంగా బిఆర్ఎస్ ఉంటది. రాష్ట్రంలోని అన్నదాతలను బిఆర్ఎస్ పార్టీ కంటికి రెప్పలా కాపాడుకుంటది అని కెటిఆర్ తేల్చిచెప్పారు. జై కిసాన్.. జై తెలంగాణ అనికెటిఆర్ నినదించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం రాజ్యాంగం కల్పించిన హక్కు అనే విషయం అదే రాజ్యాంగంపై ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన రేవంత్ రెడ్డికి తెలియదా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిలదీశారు. అబద్ధపు హామీలు, గారడీ గ్యారెంటీలను నమ్మి కాంగ్రెస్ పార్టీకి ఓటేసిన పాపానికి తమ చెప్పుతో తామే కొట్టుకునే దుస్థితి వచ్చిందని ఎల్లారెడ్డిపేట మండలకేంద్రానికి చెందిన రైతు లక్ష్మణ్ యాదవ్ తన గోసను వెల్లగక్కితే అక్రమ కేసుల పేరిట వేధిస్తారా? అని ప్రశ్నించారు.

## పారిశ్రామిక, వాణిజ్య అభివృద్ధికి తెలంగాణలో అనుకూల భౌగోళికస్థితి

### రాష్ట్రంలో పెట్టుబడులకు ఆహ్వానం

### మంత్రి ఉత్తమ్‌కుమార్‌తో డెన్మార్క్ రాయబారి రాస్మన్‌క్రిస్టేన్సన్ మర్యాదపూర్వక భేటీ



**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** పారిశ్రామిక, వాణిజ్య అభివృద్ధికి అనుకూల భౌగోళిక స్థితి తెలంగాణకలిగి ఉందని ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి ప్రపంచదేశాలు ఆసక్తి చూపుతున్నాయని నీటిపారుదల,పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో డెన్మార్క్ రాయబారి రాస్మస్ క్రిస్టేన్సన్ భేటీ అయ్యారు. రెండు దేశాల మధ్య వాణిజ్య,పారిశ్రామిక సంబంధాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి డెన్మార్క్ రాయబారితో జరిగిన భేటీలో వాణిజ్య,పారిశ్రామిక రంగంలో రెండు దేశాల మధ్య మరింత బలపడాలని ఆకాంక్షించారు. ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న నగరాలలో హైదరాబాద్ ఒకటి అని ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు అన్ని రకాలుగా అనుకూల వాతావరణం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. గ్లోబల్ సిటీగా రూపాంతరం చెందుతున్న హైదరాబాద్ నగరంతో పాటు తెలంగాణా రాష్ట్ర విశిష్టతను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆయనకు వివరించారు.ఐ. టి రంగంలో దూసుకుపోతున్న హైదరాబాద్ మహానగరంలో ఇక్కడి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఆధునిక వసతులు,ఫార్మా రంగంలో పురోగతిని ఆయన వివరించారు. ఇప్పటికే తెలంగాణా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచం నలుమూలల నుండి పారిశ్రామిక వేత్తలు తరలి వస్తున్నారని డెన్మార్క్ లాంటి దేశం కుడా ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని కోరారు.

## తురకపాలెం ఘటనపై ఎపి ప్రభుత్వం సీరియస్

### అధికారుల అలసత్వంపై ఎపి సిఎం చంద్రబాబు మండిపాటు

### వారం రోజులపాటు బాధితులకు ఆహారం, నీరు సరఫరా

### నేడు రక్త, నీటి నమూనాల సేకరణకు 50 బృందాల రాక

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, సెప్టెంబరు 5:** గుంటూరు జిల్లా తురకపాలెంలో 5 నెలలుగా చోటుచేసుకుంటున్న మహమ్మారితో మృతులపై రాష్ట్ర ప్రభుత్వం అధి కారులతో సీరియస్ అయ్యింది. అయిదు నెలలుగా మహమ్మారి వెంటాడుతున్నా ఎందుకు అలసత్వం వహించారంటూ జిల్లా వైద్యఅధికారులపై ప్రభుత్వం మండి పడినట్టు సమాచారం. పదుల సంఖ్యలో చనిపోయినా పట్టించుకోరా. అంటూ అధికారులను ప్రభుత్వం తీవ్రంగా హెచ్చరించినట్టు తెలిసింది. తురకపాలెం ఘటన నివేదికపై సమీక్షించిన సిఎం చంద్రబాబు ముమ్మర చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. బాధితులందరికీ తాము ఉన్నామంటూ ధైర్యం చెప్పాలంటూ వైద్యఆరోగ్యశాఖ మంత్రి ఆ గ్రామానికి వెళ్లాలని సిఎం ఆదేశించటంతో శుక్రవారం తురకపాలెంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ పర్యటించి ఘటనపై ఆరా తీశారు. ఊరులోని అన్నివీధుల్లో పర్యటించి బాధితుల అభిప్రాయాలను తెలుసుకున్నారు.మహమ్మారి కబళించిన బాధిత కుటుంబాలకు వెళ్లిన సత్యకుమార్ వారిని ఓదార్చి పరామర్శించారు. మహ మ్మారి ప్రబలటంపై కారణంపై నివేదికలకు ఆదేశించామని, త్వరలో రానున్న నమూనా ఫలితాల ఆదారంగా నివారణ చర్యలు చేపడతామని బాధితులకు భరోసా నిచ్చారు. అయితే సిఎం ఆదేశాలతో అధికార యంత్రాంగం ఆగ్రామంలో ముమ్మర చర్యలకు శ్రీకారం చుట్టింది. సిఎం చంద్రబాబునాయుడు తురకపాలెంలో పూర్తిగా మహమ్మారి అదుపులోకి వచ్చేంతవరకు నిత్యం వైద్యాధికారులు, ఇతర అధికారులు ఏరోజుకు ఆరోజు ఆగ్రామంలో పర్యటించి పరిస్థితిని సమీక్షిస్తూ బాధితులకు ధైర్యం చెప్పాలని కోరారు. బాధిత కుటుంబాలకు వారం రోజులపాటు రాష్ట్ర ప్రభుత్వమే ఆహారం మంచినీరు సరఫరా చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.

## రోడ్లపైనే వంటావార్పు

### పాస్‌పుస్తకాలను తగలబెట్టిన రైతులు

## యూరియా నిరసనలు.. ఉద్యోగుల నిర్బంధాలు

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో యూరియా కొరతపై నిరసనలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. యూరియా ఇవ్వడం లేదనే ఆగ్రహంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉద్యోగులు, అధికారులను రైతులు నిర్బంధిస్తున్నారు. మరోపక్క పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డులను తగుల పెట్టడం, రోడ్లపై వంటా వార్పు, ధర్నాలు, ఆందోళనలను తీవ్రతరం అవుతున్నాయి. తెలంగాణ వ్యాప్తంగా తీవ్ర యూరియా కొరతపై రైతులు వరుస నిరసనలు చేపట్టారు. యూరియా కోసం ఎదురు చూసినా తగినంత సరఫరా లేకపోవడంపై ఆందోళన చెందుతున్న రైతులు రాష్ట్రంలోని మహబూబాబాద్ జిల్లాలోని నర్సింహులపేటలో రైతులు పట్టాదార్ పాస్‌బుక్‌లు, ఆధార్ కార్డుల ఫోటో కాపీలను దహనం చేసి నిరసన తెలిపారు. గంటల తరబడి వేచి చూసినా యూరియా టోకెన్లు జారీ చేయడంలో విఫలమైన సొసైటీ అధికారుల తీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

సహనం కోల్పోయిన కొందరు రైతులు పట్టాదార్ పాస్‌బుక్‌లు, ఆధార్ కార్డుల ఫోటో కాపీలను తగలబెట్టారు. అంతేకాకుండా వ్యవసాయ సహకార పరపతి సంఘం సిబ్బందిని కార్యాలయాల్లో బంధించారు. ఇదే జిల్లాలోని మరిపెడ యూరియా స్టాక్ వచ్చిందనే సమాచారం అందడంతో రైతులు పీఏసీఎస్ గేటు దూకి లోపలికి పరిగెత్తారు. యూరియా కోసం పరకాలభూపాలపల్లి ప్రధాన రహదారిలోని మాందారిపేట వద్ద రైతులు నిరసన తెలిపారు.

అలాగే, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో యూరియా కొరత కారణంగా రైతులు సహకార సంఘం కార్యాలయాల వద్ద పొడవైన క్యూలలో వేచి ఉండాల్సి వస్తోందని, అయినా దొరకడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యూరియా తగినంతగా సరఫరా చేయడంలో వ్యవసాయ శాఖ విఫలమైందని రైతులు ఆరోపిస్తున్నారు. కొత్తగూడెం జిల్లాలోని చంద్రుగొండ మండలంలోని గానుగపాడు సొసైటీ కార్యాలయం వద్ద యూరియా కోసం రైతులు ధర్నా చేశారు. తగినంత పరిమాణంలో యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ కొత్తగూడెంలోని జూలూరుపాడులో, రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సిబ్బందిని కార్యాలయంలోనే బంధించారు.

ప్రతి రైతుకు కనీసం మూడు బస్తాల యూరియా అందించాల్సి ఉండగా, కేవలం ఒక బస్తా మాత్రమే ఇచ్చారని విమర్శించారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు కార్యాలయానికి వచ్చి షట్టర్ తెరిచారు. సహకార సంఘం అధికారులు 40 టన్నుల యూరియాకు ఆర్డర్ ఇచ్చామని, కానీ పది టన్నుల యూరియా మాత్రమే వచ్చిందని చెప్పారు. రైతులకు స్టాక్స్ వచ్చిన వెంటనే మిగిలినది ఇస్తామని చెప్పారు. అలాగే వరంగల్ జిల్లా ఖానాపురం వద్ద జాతీయ రహదారిపై పెద్ద సంఖ్యలో రైతులు వంట వార్పు నిర్వహించారు.

నిరసన కారణంగా వాహనాలు అనేక కిలోమీటర్ల మేర నిలిచి పోయాయి. క్యూలైన్‌లో రైతులు స్పృహ కోల్పోయిన సంఘటనలు అనేక చోట్ల జరిగాయి.

యూరియా తగినంతగా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ, ఇదే జిల్లాలోని నర్సంపేటలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. భూపాలపల్లి, డోర్నకల్ మరియు మరిపెడ వంటి అనేక చోట్ల ఇలాంటి నిరసనలు కనిపించాయి.

## అయోధ్య రామ్‌లల్లాను దర్శించుకున్న భూటాన్ ప్రధాని!

**అయోధ్య, సెప్టెంబరు 5:** భూటాన్ ప్రధానమంత్రి దాసో షెరింగ్ టోబ్గే శుక్రవారం అయోధ్య శ్రీరాముడి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ పవిత్ర క్షేత్రాన్ని సందర్శించిన తొలి విదేశీ దేశాధినేతగా ఆయన నిలిచారు. ప్రస్తుతం నాలుగు రోజుల భారత పర్యటనలో ఉన్న టోబ్గే, తన భార్య తాషి డోమాతో కలిసి అయోధ్యకు విచ్చేశారు.



దాదాపు గంటా 40 నిమిషాల పాటు టోబ్గే దంపతులు ఆలయ ప్రాంగణంలో గడిపారు. గర్భగుడిలో రామ్ లల్లాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రామ్ దర్బార్, హనుమాన్‌గఢీ ఆలయాలతో పాటు కుబేర తిల, జటాయు, సప్త మండపాలను కూడా సందర్శించారు. ఆలయ నిర్మాణ పనులను ఆసక్తిగా గమనించారు.

శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ వారికి స్వాగతం పలికి, ఆలయ విశేషాలను వివరించారు. రామ మందిర నిర్మాణ శైలి, గోడలపై ఉన్న అద్భుతమైన శిల్పకళా నైపుణ్యాన్ని చూసి భూటాన్ ప్రధాని దంపతులు ముగ్ధులయ్యారు. ఆలయంలోని చెక్కడాలను చూసి ఆయన ప్రశంసలు కురిపించారు. రామ్ లల్లా విగ్రహం ముందు మూడుసార్లు మోకరిల్లి నమస్కరించిన టోబ్గే, హారతి అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ మధుర క్షణాలను గుర్తుంచుకునేందుకు కొన్ని ఫొటోలు కూడా తీసుకున్నారు. అంతకుముందు, భారత వైమానిక దళానికి చెందిన ప్రత్యేక విమానంలో షెరింగ్ టోబ్గే అయోధ్య విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ ఉత్తరప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి సూర్య ప్రతాప్ షాహి, అయోధ్య మేయర్ గిరీష్ పతి త్రిపాఠి, ఎమ్మెల్యే వేద్ ప్రకాశ్ గుప్తాతో పాటు ఉన్నతాధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈనెల ఆరోతేదీవరకూ భూటాన్ ప్రధాని అధికారిక పర్యటనలో భాగంగా భారత్‌లో పర్యటిస్తున్నారు.

## పండుగ రద్దీ కోసం రైల్వే ఏర్పాట్లు

### సికిందరాబాద్ స్టేషన్‌లో ప్రయాణికుల నియంత్రణకు ప్రణాళిక




సికిందరాబాద్ స్టేషన్ (ఫైల్)

**హైదరాబాద్ (తార్నాక), సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** రాబోయే పండుగ సీజన్‌లో సికింద్రాబాద్ స్టేషన్‌లో ప్రయాణీకుల రద్దీని నిర్వహించడానికి దక్షిణమధ్య రైల్వే సమాయత్తం అవుతోంది. ప్రయాణీకుల కదలికలపై జోన్ శాస్త్రీయ అధ్యయనం నిర్వహించి,సమగ్ర జనసమూహ నిర్వహణ ప్రణాళికను రూపొందించింది. జంట నగర ప్రాంతంలోని వివిధ స్టేషన్ల నుండి ప్రసిద్ధ గమ్యస్థానాలకు అదనపు రైలు సర్వీసులు నడుపనున్నట్లు అధికారులు తెలిపారు. సికింద్రాబాద్‌లోని ప్రధాన పునరాభివృద్ధి పనుల దృష్ట్యా, టెర్మినల్ భవనాల ప్రధాన భాగాలు, ఒక ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనిచేయవు. సికింద్రాబాద్ స్టేషన్‌లో ప్రయాణీకుల రద్దీని తగ్గించడానికి రద్దీని నియంత్రించడానికి దక్షిణ మధ్య రైల్వే ఒక సమగ్ర ప్రణాళికను ప్రారంభించింది. సికింద్రాబాద్ స్టేషన్ లో సాధారణ రోజుల్లో రోజుకు 1.3 లక్షల మంది ప్రయాణికులు, పండుగ కాలంలో రోజుకు 2 లక్షలకు పైగా ప్రయాణికులు వస్తుంటారు. స్టేషన్ లోపల ప్రయాణీకుల ప్రవాహాన్ని అర్థం చేసుకోవడానికి, రెండు రోజులలో వివరణాత్మక అధ్యయనం నిర్వహించ బడింది. ఈ అధ్యయనం ప్రకారం ప్లాట్ఫారం1 వైపు ప్రయాణీకులకు ప్రవేశ,నిష్క్రమణ మార్గంగా ప్రసిద్ధి చెందింది: రిజర్వేషన్ లేని ప్రయాణీకులలో దాదాపు 8090 శాతం మంది సికింద్రాబాద్ స్టేషన్ లోని ప్లాట్ఫాం నంబర్ 1 వైపును ఉపయోగిస్తున్నారు. ఎందుకంటే ఇది ప్లాట్ ఫారం 10 వైపు స్టేషన్‌తో పోలిస్తే ఆర్టీసీ బస్సులు, మెట్రోలు, హోటళ్లతో బాగా అనుసంధానించబడి ఉంది. ఉదయం ఐదు గంటల నుంచి ఎనిమిది గంటలు, సాయంత్రం రద్దీ సమయాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిల ప్లాట్‌ఫామ్ మెట్ల ద్వారా గంటకు 10000 కంటే ఎక్కువ మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారు.

#### సికిందరాబాద్ స్టేషన్ లోపల రద్దీని తగ్గించడానికి వ్యూహాలు

సికిందరాబాద్ స్టేషన్ రాకుండా కొన్ని రైళ్ల మళ్లించనున్నారు. రద్దీ సమయాల్లో కొన్ని రైళ్లను సనత్‌నగర్, అమ్ముగూడ మౌలాలి,చర్లపల్లి మీదుగా మళ్లించడం, చర్లపల్లి వంటి శాటిలైట్ స్టేషన్లలో అదనపు హాల్ట్‌లను ఏర్పాటు చేయడం గురించి ఆలోచిస్తోంది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో టిక్కెట్లు తీసుకునే ప్రాంతం వెలుపల, ప్లాట్ ఫారమ్1మరియు ప్లాట్ ఫారం 10 వైపులా హోల్డింగ్ ప్రాంతాలను కేటాయించింది. ఇక్కడ ప్రయాణికులు రైలు వచ్చే సమయం వరకు వేచి ఉండవచ్చు. పిఎఫ్ 1 వైపు, రెండు హోల్డింగ్ ప్రాంతాలు, ఒకటి గేట్ నంబర్ 2 వద్ద మరియు మరొకటి గేట్ నంబర్ 5 దగ్గర 1500 మంది ప్రయాణికుల సామర్థంతో అందుబాటులో ఉంటుంది. ప్లాట్‌ఫారమ్ నంబర్ 10 వద్ద, 1125 మంది ప్రయాణికుల సామర్థంతో గేట్ నంబర్ 8 వద్ద ఒక హోల్డింగ్ ప్రాంతం అందుబాటులో ఉంటుంది. స్టేషన్‌లో నావిగేట్ చేయడానికి సంకేతాలను ఉపయోగించాలని, ప్రకటనలను అనుసరించాలని ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు. ప్లాట్ ఫారమ్ 1 నుండి సికింద్రాబాద్ (పశ్చిమ) మెట్రోకు కొత్త ప్రవేశం,నిష్క్రమణ: ప్రవేశించే మరియు నిష్క్రమించే ప్రయాణీకులను వేరు చేయడానికి, పి.ఎఫ్ 1 నుండి సికింద్రాబాద్ (పశ్చిమ) మెట్రో స్టేషన్‌కు కొత్త ప్రవేశం,నిష్క్రమణను నిర్మిస్తున్నారు.

#### ట్రాఫిక్ క్రమబద్ధీకరణ ప్రయాణీకుల రాకపోకలపై నిఘా

కార్లు,టాక్సీలు,క్యాబ్‌లలో ప్రయాణించే ప్రయాణీకులు ప్లాట్ ఫారం 1 వైపు కాకుండా టెర్మినల్ యొక్క ప్లాట్ ఫారం 10 వైపు ఉపయోగించమని ప్రోత్సహించబడినది.ప్లాట్ ఫారం 1 వైపు పికప్,డ్రాప్ ఆఫ్‌బేలు,పార్కింగ్ సౌకర్యం పరిమితంగా మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మెరుగైన టికెటింగ్, ప్రయాణీకుల సౌకర్యాలు: అదనపు హెల్ప్ డెస్క్‌లు/ఎంక్వైరీ కౌంటర్లు కూడా పనిచేస్తాయి. రైలు కదలికను పర్యవేక్షించేందుకు. స్టేషన్‌లో జనసమూహాన్ని పర్యవేక్షించేందుకు సీనియర్ రైల్వే అధికారులు 24 గంటలూ విధుల్లో ఉంటారు. సులభంగా, త్వరగా టికెట్ జారీ చేయడానికి అదనపు టికెట్ కౌంటర్లు, ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మెషీన్లు పనిచేస్తాయని అధికారులు వెల్లడించారు.

# 'వీర చంద్ర హాస' 19న గ్రాండ్ రిలీజ్

కంచి కామాక్షి కోల్‌కతా కాళీ క్రియేషన్స్ బ్యానర్‌పై ఎమ్‌వీ రాధాకృష్ణ తెలుగులో విడుదల చేస్తున్న కన్నడ చిత్రం "వీర చంద్రహాస". మంచి టేస్ట్ ఉన్న ప్రొడ్యూసర్‌గా రాధాకృష్ణకు గుర్తింపు ఉంది. గతంలో శివరాజ్ కుమార్ నటించిన వేద, ప్రజ్వల్ దేవరాజ్ నటించిన 'రాక్షస' చిత్రాలను తెలుగులో రిలీజ్ చేసిన ఆయన. తాజాగా "వీర చంద్రహాస" తెలుగు రైట్స్‌ను దక్కించుకున్నారు. సెప్టెంబర్ 19న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. ఇటీవల ఇండియన్ బాక్సాఫీస్ దగ్గర రికార్డులు సృష్టించి మూడు వందల కోట్లు కలెక్షన్స్ రాబట్టిన "మహావతార్ నరసింహా" తర్వాత హోంబలే ఫిల్మ్స్ సమర్పణలో విడుదల చేస్తున్న "వీర చంద్రహాస" చిత్రంపై అంచనాలు నెలకొన్నాయి. ఆ చిత్రం తరహాలోనే ఇది కూడా ప్రేక్షకుల ఆదరణ పొందుతుందని నిర్మాతలు అన్నారు. కేజీయఫ్, సలార్ లాంటి యాక్షన్ చిత్రాలకు సంగీతం అందించి మ్యూజిక్ డైరెక్టర్‌గా ఒక సంచలనం సృష్టించిన రవి బస్రూర్.



వీర చంద్రహాసచిత్రానికి దర్శకత్వం వహించారు. కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ కీలక పాత్ర పోషించిన ఈ చిత్రంలో శిథిల్ శెట్టి, నాగశ్రీ జిఎస్, ప్రసన్న శెట్టిగార్ మందార్తి, ఉదయ్ కడబాల్, రవీంద్ర దేవాడిగ, నాగరాజ్ సర్వేగర్, గుణశ్రీ ఎం నాయక్, శ్రీధర్ కాసర్కోడు, శ్వేత అరెహోల్, ప్రజ్వల్ కిన్నాల్ ప్రధాన పాత్రలు పోషించారు. కన్నడ అగ్ర నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ సమర్పణలో ఓంకార్ మూవీస్ బ్యానర్‌పై ఎన్ ఎస్ రాజ్‌కుమార్ నిర్మించారు. కన్నడలో విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. సందర్భంగా నిర్మాత ఎమ్‌వీ రాధాకృష్ణ మాట్లాడుతూ, కన్నడలో విడుదలైన' వీర చంద్రహాస" చిత్రం హిట్ టాక్‌తో పాటు మంచి వసూళ్లను రాబడుతోంది. ఈ మూవీ తెలుగు రైట్స్ దక్కించుకోవడం చాలా సంతోషంగా ఉంది. మంచి కంటెంట్ ఉన్న చిత్రాలను తెలుగు ప్రేక్షకులకు ఎప్పుడూ ఆదరిస్తారు. ఈ చిత్రానికి కూడా తెలుగు ఆడియెన్స్ బ్రహ్మరథం పడతారని ఆశిస్తున్నా. సినిమా సక్సెస్ గ్యారెంటీ అని నమ్ముతున్నా. తనదైన సంగీతంతో అందర్నీ మెప్పించిన రవి బస్రూర్ దర్శకుడిగానూ సత్తా చాటడం సంతోషంగా ఉంది. ఇటీవల విడుదలైన 'మహావతార్ నరసింహ' చిత్రం తరహాలోనే ఈ చిత్రం కూడా ఉండటంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని బలంగా నమ్ముతున్నాం అని అన్నారు. సంగీత దర్శకుడు, దర్శకుడు రవి బస్రూర్ మాట్లాడుతూ. డైరెక్టర్‌గా నేను రూపొందించిన ఈ సినిమాను కన్నడ ప్రేక్షకులు బాగా ఆదరించారు. తెలుగు ఆడియెన్స్‌కు కూడా కచ్చితంగా నచ్చుతుందని భావిస్తున్నా. శివరాజ్‌కుమార్‌తో పాటు ఇందులో నటించిన నటీనటులంతా చాలా బాగా సపోర్ట్ చేశారు.



జగదీష్

'అర్జున్ చక్రవర్తి' చిత్రంతో కెమెరా మెన్‌గా జగదీష్ చీకటి పేరు ఎక్కువగా విని పిస్తోంది. విజువల్ ట్రీట్‌గా మూవీని తెరకెక్కించిన జగదీష్ చీకటి పనితనం గురించి ప్రస్తుతం అందరూ మాట్లాడుకుంటున్నారు. 'అర్జున్ చక్రవర్తి' చిత్రానికి గానూ ఎన్నో అంతర్జాతీయ వేడుకల్లో బెస్ట్ సినిమాటో గ్రఫర్‌గా జగదీష్ చీకటి అవార్డుల్ని అందుకున్నారు.'అర్జున్ చక్రవర్తి' ప్రస్తుతం విజయవంతంగా దూసుకుపోతోండటంతో

## 'అర్జున్ చక్రవర్తి' బెస్ట్ సినిమాటో గ్రాఫర్

కెమెరామెన్ జగదీష్ చీకటి చెప్పిన సంగతులివే.

**మీ నేపథ్యం ఏంటి? మీ సినీ ప్రయాణం ఎలా మొదలైంది?** నాకు డ్రాయింగ్, ఫోటోగ్రఫీ అంటే చాలా ఇష్టం. ఫోటోగ్రఫీలోనూ మాస్టర్స్ చేశాను.దూరదర్శన్‌లోనూ పని చేశాను. స్టిల్ ఫోటోగ్రఫీలోనూ అవార్డులు వచ్చాయి. ఎన్నో కమర్షియల్ యాడ్స్,ఎన్నో ప్రాజెక్టులను చేశాను. అలా చేస్తున్న సమయంలోనే జత కలిసే మూవీకి అవకాశం వచ్చింది.

**మీఫ్యామిలీ నుంచి ఎలాంటి సపోర్ట్ ఉండేది?**మా నాన్న ఇరిగేషన్ డిపార్ట్మెంట్‌లో ఉద్యోగం చేస్తారు. నాకు ఎప్పుడూ కూడా ఫుల్ సపోర్ట్ ఇస్తుండేవారు. నచ్చిన పని ఏదైనా సరే చేయమని, అనేవారు. .అప్పుడు కూడా నాకు ఫుల్ సపోర్ట్ ఇచ్చారు.

**అర్జున్ చక్రవర్తి విషయంలో మీ వర్క్ ఎక్స్‌పీరియెన్స్ గురించి చెప్పండి.** హాలీవుడ్ స్థాయికి ధీటుగా మనం తీస్తున్నాం. మా అర్జున్ చక్రవర్తి కూడా అదే స్థాయిలో ఉంటుంది. ఆ స్థాయి లుక్ వచ్చేందుకు నేచురల్ లైటింగ్‌లోనే షూటింగ్ చేశాం.

**అర్జున్ చక్రవర్తి షూటింగ్ టైంలో ఎదురైన సవాళ్లు?** మంచు కురిసే ప్రాంతం కదా అని కాశ్మీర్‌కు వెళ్లాం. కానీ మేం వెళ్లినప్పుడు అక్కడ మంచు పడటం లేదు. దీంతో అక్కడే మంచు కురిసే వరకు ఎదురుచూశాం. అలా చివరకు మైనస్ 8 డిగ్రీల వరకు వెళ్లింది.అలా మంచు కురుస్తుంటే స్వర్గమంటే ఇదేనేమో అన్నట్టుగా కనిపించింది. దీంతో మేం అనుకున్న దానికంటే బాగా షూట్ చేశాం.



జాన్వీ కపూర్

## సెన్సార్ పనులు ముగిసిన 'కిష్కింధపురి'




**టాలీవుడ్ లో** తెరకెక్కుతున్న చిత్రాల్లో 'కిష్కింధపురి' కూడా ఒకటి. హారర్ జోనర్ లో వస్తున్న ఈ సినిమాలో బెల్లంకొండ శ్రీనివాస్ హీరోగా నటిస్తున్నాడు. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రమోషనల్ కంటెంట్ ఈ సినిమా పై సాలిడ్ అంచనాలు పెంచింది.

ఇక ఇప్పుడు ఈ సినిమా సెన్సార్ పనులు కూడా ముగించుకుంది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. ఈ సినిమాలోని కంటెంట్ కేవలం పెద్ద వారికే అని ఈ సర్టిఫికెట్ ఇష్యూ చేసింది. హారర్ ఎలిమెంట్స్ వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు చిత్ర యూనిట్ చెబుతోంది.

అయితే, ఈ సినిమా లో ఒక్క కట్ కూడా లేకుండా సెన్సార్ ఈ నిర్ణయం తీసుకోవడం తో చిత్ర యూనిట్ హర్షం వ్యక్తం చేస్తోంది. అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాని కౌశిక్ పెగళ్లపాటి డైరెక్ట్ చేస్తున్నాడు. సెప్టెంబర్ 12న ఈ సినిమా గ్రాండ్ రిలీజ్ కి రెడీ అయింది.

## ఓ.. చెలియా' చిత్రం నుండి.. నువ్వే చెప్పు చిరుగాలి పాట విడుదల

**ఎస్ఆర్ఎస్ మూవీ క్రియేషన్స్,** ఇందిరా దేవీ ప్రొడక్షన్స్ బ్యానర్‌ల మీద రూపాశ్రీ కొపురు నిర్మిస్తున్న చిత్రం ఓ.. చెలియా. ఈ మూవీకి కథ, కథనం, దర్శకత్వ బాధ్యతల్ని ఎం. నాగ రాజశేఖర్ రెడ్డి నిర్వర్తిస్తున్నారు. నాగ ప్రణవ్, కావేరి కర్ణిక, ఆద్య రెడ్డి ప్రధాన పాత్రలో నటించిన ఈ మూవీకి సంబంధించిన ప్రమోషన్స్‌ను ప్రారంభించారు. రాకింగ్ స్టార్ మంచు మనోజ్ చేతుల మీదఓ.. చెలియా నుంచి ఫస్ట్ సింగిల్‌ను రిలీజ్ చేయించారు.

నువ్వే చెప్పు చిరుగాలి అంటూ సాగే ఈ పాటను మంచు మనోజ్ విడుదల చేశారు. పాటను రిలీజ్ చేసిన అనంతరం చిత్ర యూనిట్‌కి మంచు మనోజ్ అభినందనలు తెలియజేశారు. ఈ పాటను సాయి చరణ్ ఆలపించగా.. ఎంఎం కుమార్ బాణీని అందించారు. ఇక సుధీర్ బగడి రాసిన సాహిత్యం ఆకట్టుకునేలా ఉంది. లిరికల్ వీడియోని చూస్తుంటే మంచి ప్రేమ కథా చిత్రాన్ని అందించబోతోన్నట్టుగా కనిపిస్తోంది. ఇక హీరో హీరోయిన్ల కెమిస్ట్రీ చాలా ఫ్రెష్‌గా, ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించేలా ఉంది. ఈ మూవీకి సురేష్ బాలా కెమెరామెన్‌గా, ఉపేంద్ర ఎడిటర్‌గా పని చేస్తున్నారు. త్వరలోనే ఈ మూవీకి సంబంధించిన రిలీజ్ డేట్‌ను ప్రకటించబోతోన్నారు.



## ' టన్నెల్' ట్రైలర్ విడుదల



అథర్వా మురళీ క్రైమ్, సస్పెన్స్, థ్రిల్లర్ జానర్‌ను ఎంచుకున్నాడంటే బ్లాక్ బస్టర్ పక్కా అన్నట్టే. ప్రస్తుతం అథర్వా యాక్షన్ ప్యాక్డ్ థ్రిల్లర్ జానర్‌లో' టన్నెల్' అనే మూవీని చేశారు. రవీంద్ర మాధవ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో లావణ్య త్రిపాఠి కథానాయికగా నటించారు. అశ్విన్ కాకుమాను విలన్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 12న థియేటర్లలోకి రానుంది. ఈ మూవీని తెలుగులోకి ఎ.రాజు నాయక్ లచ్చురామ్ ప్రొడక్షన్స్ ద్వారా విడుదల చేస్తున్నారు. తాజాగా ట్రైలర్ విడుదల చేసి అంచనాలు పెంచేశారు. 'యూనిఫామ్ వేసుకున్న తరువాత అందరూ ఫ్యామిలీనే' అని ట్రైలర్ లో హీరో చెప్పిన డైలాగ్ చూస్తే టన్నెల్ సినిమా ఎలా ఉంటుందో అర్థం అవుతుంది. ఇక ఇందులో సస్పెన్స్ థ్రిల్లర్ యాక్షన్‌కి ఎంత ఇంపార్టెన్స్ ఉందో లవ్ ట్రాక్ కి కూడా అంతే ప్రాధాన్యం ఉందని తెలుస్తోంది. లావణ్య త్రిపాఠి, అథర్వ కాంబో అందరినీ అలరించేలా ఉంది. గ్రిప్పింగ్, అదిరిపోయే యాక్షన్ సీక్వెన్స్‌లతో ట్రైలర్‌ను కట్ చేశారు. జస్టిన్ ప్రభాకరన్ ఈ మూవీకి సంగీతాన్ని అందించారు. శక్తి శరవణన్ సినిమాటోగ్రాఫర్‌గా పని చేశారు. కలైవానన్ ఈ సినిమాకు ఎడిటర్. తెలుగు వెర్షన్ ప్రమోషన్లు త్వరలో ప్రారంభం కానున్నాయి. అథర్వా మురళీ తెలుగు ప్రమోషన్స్‌లో సందడి చేసేందుకు సిద్ధంగా ఉన్నారు.

## 'రీ ర్యాంప్' నుంచి స్పెషల్ పోస్టర్

సక్సెస్ ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం " రీర్యాంప్ సినిమా నుంచి 'ఓనమ్' పండుగ శుభాకాంక్షలతో స్పెషల్ పోస్టర్ విడుదల, దీపావళి సందర్భంగా అక్టోబర్ 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తున్న మూవీ సక్సెస్ ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా " రీర్యాంప్". ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్‌ల మీద సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. యుక్తి తరేజా హీరోయిన్‌గా నటిస్తోంది. "రీర్యాంప్" సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ దీపావళి పండుగ సందర్భంగా అక్టోబర్ 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది.ఈ రోజు 'ఓనమ్' పండుగ సందర్భంగా " రీర్యాంప్" సినిమా నుంచి విశెస్ చెబుతూ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. కేరళ నేపథ్యంగా జరిగే కథను " రీర్యాంప్" మూవీలో సరికొత్తగా చూపించబోతున్నారు. ఓనమ్ పండుగ సెలబ్రేషన్స్‌తో సాగే పాటను కూడా ఈ మూవీలో ప్రత్యేకంగా చిత్రీకరించారు. ప్రస్తుతం ఈ సినిమా మ్యూజిక్ ప్రమోషన్స్ సక్సెస్‌ఫుల్ గా జరుగుతున్నాయి. ఈ నెల 9న "రీర్యాంప్" సినిమా నుంచి మ్యాజికల్ లవ్ మెలోడీ సాంగ్ 'కలలే కలలే' విడుదల చేయబోతున్నారు.నటీనటులు: కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా, నరేష్,సాయి కుమార్,వెన్నెలకిషోర్ తదితరులు.రచన, దర్శకత్వం: జైన్స్ నాని.



## 'ది గేమ్ :యు నెవర్ ప్లే ఎలోన్' అక్టోబర్ నెట్‌ఫ్లిక్స్‌లో రిలీజ్




శ్రద్ధా శ్రీనాథ్, రాజేష్ ఎం. సెల్వా గ్రిప్పింగ్ థ్రిల్లర్ 'ది గేమ్: యు నెవర్ ప్లే ఎలోన్ " అక్టోబర్ 2న నెట్‌ఫ్లిక్స్‌లో రిలీజ్ శ్రద్ధా శ్రీనాథ్ లీడ్ రోల్ లో నెట్‌ఫ్లిక్స్, అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ కలసి చేస్తున్న న్యూ థ్రిల్లర్ "ది గేమ్: యూ నెవర్ ప్లే ఎలోన్" అక్టోబర్ 2న నెట్‌ఫ్లిక్స్‌లో రిలీజ్ కానుంది. బ్లాక్ వారంట్ తర్వాత నెట్‌ఫ్లిక్స్, అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ కలయికలో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌ని రాజేష్ ఎం. సెల్వా డైరెక్ట్ చేస్తున్నారు.

లీడ్ రోల్‌లో శ్రద్ధా శ్రీనాథ్ నటిస్తుండగా, సంతోష్ ప్రతాప్, చందినీ, శ్యామహారిని, బాలహాసన్, సుబాష్ సెల్వం, వివియా సంతోష్, ధీరజ్, హెమా ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. స్ట్రాంగ్ స్టోరీటెల్లింగ్‌తో పాటు టైమ్‌లి థీమ్స్‌ని మిక్స్ చేస్తూ ఆడియన్స్‌కి డిఫరెంట్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వనుంది నెట్‌ఫ్లిక్స్ ఇండియా కంటెంట్ వైస్ ప్రెసిడెంట్ మోనికా షెర్గిల్ మాట్లాడుతూ.. 'ది గేమ్' మా ఈ ఏడాది ఫస్ట్ తమిళ సిరీస్. సరికొత్త స్టోరీని తీసుకొస్తున్నాం. ఒక ఫీమేల్ గేమ్ డెవలపర్‌పై జరిగే కోఆర్డినేటెడ్ అటాక్ వెనక వాళ్లను ట్రాక్ చేసే ఆమె జర్నీని ఈ థ్రిల్లర్ గా ప్రజెంట్ చేస్తునాం. అప్లాజ్ తో మా కలయికలో ఇప్పటికే బ్లాక్ వారంట్ వచ్చింది. ఇప్పుడు ఈ సిరీస్ కూడా చాలా రెలివెంట్‌గా ఉంటుంది. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎండీ సమీర్ నాయర్ మాట్లాడుతూ, ది గేమ్ అనేది డిజిటల్ యుగం రియాలిటీలను చూపించే టైమ్‌లి స్టోరీ. రాజేష్ సెల్వా స్టైల్‌తో స్ట్రాంగ్ స్టోరీటెల్లింగ్ తో ఆడియన్స్‌కి చాలా కనెక్ట్ అవుతుంది.డైరెక్టర్ రాజేష్ ఎం. సెల్వా మాట్లాడుతూ.. ది గేమ్ కేవలం థ్రిల్లర్ మాత్రమే కాదు, మనం ఉన్న రియల్ వరల్డ్‌కి అద్దం పడుతుంది. ఇది పీపుల్, వాళ్ల ఛాయిస్‌లు, బలహీనతలు, నిజం – అబద్ధం మధ్య సన్నని లైన్ గురించిన కథ. నెట్‌ఫ్లిక్స్, అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ కలయిక వలన మాకు క్రియేటివ్‌గా కొత్త ఎక్స్‌పెరిమెంట్స్ చేసే లిబర్టీ దొరికింది. థ్రిల్లర్ సస్పెన్స్‌తో పాటు, ఫ్యామిలీ కాంప్లిక్ట్ కి సంబంధించిన ఎమోషన్స్‌ని కూడా కలిపి చూపించే ఈ సిరీస్ ఆడియన్స్‌కి సరికొత్త అనుభూతిని అందించబోతోంది.

# ఆమె కొలువుదీర్చిన విగ్రహాలు



**చుట్టూ గణపతి నవరాత్రుల కోలాహలం! పోటాపోటీగా కొలువుదీర్చిన విగ్రహాలు... చూపరులకు కనుల పండగే. కానీ వాటిని తీర్చడం వెనక ఎంతోమంది శ్రమ దాగుంటుంది. వారిలో ప్రత్యేకంగా నిలుస్తూ కితాబులు అందుకుంటోంది దీపిక పాల్!**

విగ్రహాల తయారీలో మహిళలూ కనిపిస్తున్నా ఇదీ పురుషాధిక్య రంగమే. అలాంటిదానిలో తన ఉనికిని చాటుకుంటుంది దీపిక, గువాహటిలో విగ్రహాలు తయారుచేసే ఏకైక మహిళగా ఈమెకు పేరు. కనీసం ఆరునెలల ముందు ఆర్డర్ ఇచ్చి మరీ తయారు చేయించుకుంటారు. ఆమె తీర్చిదిద్దే విగ్రహాలకు అసోంలో అంతటి పేరు వచ్చింది. నాన్న నుంచి ఈ వారసత్వాన్ని అందుకుంది దీపిక ఆయన విగ్రహాలు తయారుచేస్తోంటే మట్టి తీసుకుని సరదాగా ప్రయత్నించడమే. ఆదే తనకు ఉపాధి అవుతుందని అప్పటికి ఆమె కూడా ఊహించి ఉండదు. పెళ్లయ్యేవరకూ దీపిక కూడా సాధారణ అమ్మాయే. తరవాతే కష్టాలు చుట్టుముట్టాయి. ఇద్దరు పిల్లలు పుట్టాక భర్త ఆమెను వదిలేశాడు. అందరూ 'ఎలా బతుకుతుందో' అంటే.. దీపిక తనకు ప్రావీణ్యమున్న విగ్రహాల తయారీనే ఎంచుకుంది. 'మగవాళ్లకే కష్టం. రెండు రోజుల్లో దుకాణం మూసేస్తావ్! పెట్టుబడి దండగే' అన్నారంతా. ఆమె మాత్రం అధైర్యపడలేదు. కాబట్టే 15 ఏళ్లుగా ఈ రంగంలో కొనసాగుతోంది. 'శివశంకర్ శిల్పాలయం' పేరుతో వర్క్‌షాప్ ద్వారా తాను ఉపాధి పొందడమే కాదు, మరికొందరికి జీవితాన్ని కలిగిస్తోంది. 'వినాయకుడు, దుర్గ మాత్రమే కాదు... మరెన్నో శిల్పాలను తీర్చిదిద్దుతాను. మట్టి, వెదురు వంటివాటితో వీటిని తయారుచేస్తాం. ఉదయం మొదలు పెడితే అర్ధరాత్రి వరకూ మా పని కొనసాగు తుంది. ఒక్కో విగ్రహం ఎత్తునుబట్టి రూ.30 వేల నుంచి రూ.70 వేల వరకూ తీసుకుంటాం. నేను మొదలు పెట్టిన తొలిరోజుల్లో అంతా నవ్వినవారే. చుట్టుముట్టిన ఆర్థిక కష్టాలు బోలెడే. నా మీద ఆధారపడ్డ కుటుంబాలకోసం ఎన్ని కష్టాలేదురైనా కొనసాగించా. నాకంటూ గుర్తింపు తెచ్చుకున్నా'నని దీపిక... పనికి చిన్నా పెద్దా ఉండదు. ఎవరిమీదా ఆధారపడకుండా చేస్తే కష్టమేదైనా గొప్పదే అంటుంది. కాబట్టే ఆమె విగ్రహాలకే కాదు... తన పట్టుదల, కష్టాలకు లొంగని తత్వం, తనపై తనకు నమ్మకం... వంటి లక్షణాలకూ సలామ్ కొడతారంతా. □

# జీవనోపాధి కోసం ట్రాక్టర్లను నడిపిస్తూ..

**ఒకప్పుడు అమ్మాయిలు సైకిల్ నేర్చుకుంటానంటేనే నీ వల్ల కాదనేవారు... తర్వాత బైక్ నడుపుతుంటే మగరాయుడంటూ హేళన చేసేవారు.అలాగని చాలామంది మహిళలు అక్కడితఆగిపోలేదు. కాలక్రమంలో కారు, ఆటో, బస్సు... వంటి వాటిమీద దూసుకుపోతున్నారు. అలాంటివారిలో తాళ్లూరు మండలం తురకపాలెం మగువల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. సుమారు 20 మంది మహిళలు జీవనోపాధికోసం ట్రాక్టర్లను అవలీలగా నడిపిస్తున్నారు. ..**

అది ప్రకాశం జిల్లాలోని తురకపాలెం, మహిళా సాధికారత అంటే వైట్ కాలర్ ఉద్యోగాల్లోనూ, బోర్డు స్థానాల్లో మాత్రమేకనిపించడం కాదనుకున్నారేమో! ఆ ఊళ్లోకి అడుగు పెట్టగానే ట్రాక్టర్లపై దూసుకెళ్లే మహిళలు చాలామందే కనిపిస్తారు. అలాగని ఒకరో ఇద్దరో అలా సరదాగానేర్చు కుంటున్నారేమో అనుకునేరు. అక్కడ ఇరవైమంది మహిళలు ట్రాక్టర్లు నడపుతున్నారు. అది వారి దినచర్యవాళ్లలో కొందరు వాటిపై పశువులకు మేత కోసుకొస్తుంటే, ఇంకొందరు దుక్కి దున్నడానికి, ఎరువులు తేవడానికి... వెళ్తారు. నిజానికి ఈ దృశ్యం మనకి కొత్తగా అనిపించినా... వాళ్లంతా దాన్ని చాలా సాధారణంగా తీసుకుంటారు. ఎందుకంటే ఈ గ్రామంలో ఎక్కువగా సన్న, చిన్నకారు కుటుంబాలు ఉన్నాయి. వీళ్లంతా వ్యవసాయం, అనుబంధంగా పాడిపరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నవారే. భార్యాభర్తలు ఇద్దరూకష్టపడితేనే కానీ, నిలదొక్కుకోలేం అన్న ఆలోచనతో ఒకరిని చూసి మరొకరు స్ఫూర్తిని పొంది ఈ పని చేస్తున్నారు. ఆ గ్రామానికి చెందిన కుమ్మిత నాగమల్లీశ్వరి తొలిసారిగా ట్రాక్టరు నడిపి ఇతరులకు మార్గదర్శకం అయ్యారు. దాదాపు పన్నెండు సంవత్సరాలకు పైగా ఆమె కుటుంబ అవసరాల కోసం ట్రాక్టరు నడుపు తున్నారట. అవసరం ఏ పనైనా నేర్పిస్తుంది. చిన్నప్పటి నుంచీ నాకు బాగా చదువుకోవాలన్న కోరిక. అమ్మానాన్నలు సోము వెంకటరెడ్డి, సుబ్బాయమ్మలు వ్యవసాయం చేసేవారు. వారికి మేం నలుగురం సంతానం, అందులోనూ ముగ్గురం ఆడపిల్లలమే కావడంతో మమ్మల్ని చదివించడంలో నాన్న స్థోమతకు మించిన పనైంది. దాంతో అక్కను, తమ్ముడిని బడిలో చేర్చారు. చెల్లి చిన్నది కావడం, పనులకు సాయంగా ఉంటానని భావించి నన్ను చదివేందుకు ఇష్టపడలేదు. అయినా, నేను పట్టు వదలక ఐదువరకూ చదువుకున్నా. తర్వాత కొనసాగించలేకపోయింది. పొలంలో నాన్నతోపాటు పనికి వెళ్లేదాన్ని. చేదోడు వాదోడుగా. ఉంటున్నానని భావించి ట్రాక్టర్ నడపడం నేర్పించారు. దాంతో అప్పటి నుంచి దాన్ని కొనసాగిస్తున్నా. పెళ్లయ్యాక మావారు వెంకటరెడ్డి అభ్యంతరం పెట్టలేదు. పైగా తను అక్కడ లేకపోయినా నేను పనులు చక్కబెట్టుకునేలా ప్రోత్సహించారు. సాగు లాభసాటి ప్రత్యక్ష పాడిపైనే ఎక్కువగా ఆధారపడుతుంటాం. దాంతో రోజూ దానికి పచ్చగడ్డి కోసుకురావడం, వ్యవసాయపనులు మొదలయ్యాక దమ్ము చేయడం, దుక్కి దున్నడం వంటివన్నీ చేస్తుంటారు. మొదట్లో కొందరు మగ రాయుడిలా ఏర్పాటు చేస్తున్నారు అంటూ వెనక గుసగు సలాడు. తర్వాత్తర్వాత అవసరాన్ని గుర్తించి మరి కొందరు ఆడవాళ్లు నన్ను స్ఫూర్తిగా తీసుకుని నేర్చుకోవడానికి ముందుకొచ్చారు అంటారామె. అరుణ, కళావతి, అశ్విని, రమణమ్మ, రమాదేవి, పెదనాగమ్మ, మల్లీశ్వరి, రాజేశ్వరి, మనీషారెడ్డి, పూజిత, రమాదేవి.. ఇలా సుమారు ఇరవైమందికిపైగా స్త్రీలు ట్రాక్టర్లు నడిపేస్తున్నారు. దీనివల్ల వ్యవసాయ పనులు సీజన్‌లో డ్రైవర్లు దొరక్కపోవడం, పశువులకు గడ్డి తీసుకురావాల్సిన సమయంలో ఇంటి యజమాని అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలను చూసి తామంతా స్వయంగా ట్రాక్టర్లు నడపడం నేర్చుకున్నామంటారు వీరంతా. మంచి ఆలోచనే కదూ! □






# ఈ ఫ్యాషన్లదే హవా

అమ్మాయిలు కోరుకునేదే కొత్తదనం. అందుకే ఆ ముచ్చట తీర్చేస్తూ అటు అమ్మాయిల్నీ ఇటు అబ్బాయిల్నీ ఆకట్టుకోవడానికి ఈ ఏడాది బోలెడన్ని ఫ్యాషన్లు రంగంలోకి దిగాయి. వాటిల్లో కొన్ని..



**స్టైలిష్ కఫ్తాన్... న**డెస్సు ఫంకీగా ఉంటూనే సౌకర్యంగా ఉండాలనుకునేవారి మనసును దోచుకున్న కఫ్తాన్ ఫ్యాన్.



**పలాజో..** అమ్మాయిల మనస్సు పలాజో పైకెళ్లింది. కాస్త పాదాలపైకి ఉండే ఈ పలాజోలు అన్ని రకాల కుర్తాలకూ సరిపోయేలా వచ్చాయి.



**మెరిసిన లంగా ఓణీ :** ఆడపిల్లల్ని ఆకుట్టుకునే లంగా ఓణీల్లో బోలెడన్ని ఫ్యాషన్లు. అయితే ఒకప్పుడు పట్టుతోనే అలరించిన లంగా ఓణీ. ఈ ఏడు మెరుపుల దోలా సిల్క్ క్లాత్‌తో మార్కెట్లోకి వచ్చింది. రంగురంగుల్లో పిచ్‌వాయీ నుంచి కలంకారి వరకూ ఎన్నెన్నో ప్రింట్ల డిజైన్లతో సరికొత్తగా కనువిందు చేస్తుంది.



**చిల్లుల జాకెట్ :** బ్లౌజుల్లో ఎన్ని రకాలొచ్చినా.. ఆడవాళ్లు అస్సలు సంతృప్తి చెందరు. అందుకే మరి ఎప్పటికప్పుడు జాకెట్లలో కొత్తకొత్త ట్రెండ్స్ పుట్టుకొస్తూనే ఉంటాయి. అలా ఈ ఏడాది అతివల కోసం చాలానే వచ్చాయి వాటిల్లో ఒకటి ఈ చిల్లుల బ్లౌజు.

# పులిహోర పౌడర్ ఇంట్లోనే ..

పూజ,వ్రతం, పెళ్లి, పేరంటం.. ఇలా ఎన్నో సందర్భాల్లో పులిహోర తప్పనిసరిగా ఉంటుంది. దీన్ని ఇష్టపడనివాళ్లు దాదాపుగా ఉండరు. చింతపండు పులుసు ఉడికించటానికి ఎక్కువ టైం పడుతుంది. పులిహోర మిక్స్ గనుక ఉందంటే క్షణాల్లో పనైపోతుంది. అది కొనకుండా మనమే చేసుకోవచ్చు.



**కావలసినవి :** యాపిల్ పండంత చింతపండు, అందులో ఎండు బెల్లం, అర కప్పు కొబ్బరి తురుము, 6 చెంచాల ఉప్పు (మీకు తగ్గట్టు కాస్త ఎక్కువ లేదా తక్కువ వేసుకోవచ్చు), 5 చెంచాల నువ్వులు, 15 ఎండుమిరప కాయలు, 4 చెంచాల చొప్పున శనగ, మినప్పప్పులు, జీలకర్ర, ధనియాలు, అరచెంచా, మిరియాలు, ఆవలు తాలింపు.. 5 చెంచాల పల్లీలు,నువ్వులు, 2 చెంచాల చొప్పున శనగ, మినప్పప్పులు, చెంచ ఆవాలు, చారెడు జీడిపప్పు, పావు కప్పు నూనె, ఆరేడు కరివేపాకు రెబ్బలు తీసుకోవాలి.

**తయారీ:** నువ్వులు, ఎండుమిర్చి, శనగ మినప్పప్పులను విడివిడిగా వేయించాలి. వాటిని తీసి.. ఆవాలు, మెంతులు, మిరియాలు, ధనియాలు, జీలకర్రలను మంచి వాసన వచ్చేదాకా వేయించాలి. అన్నీ చల్లారాక కొబ్బరి తురుము, పసుపు, ఇంగువ, జత చేసి గ్రైండ్ చేయాలి. చింతపండు పొడిపొడిలాడేలా దాన్ని కూడా కొంచెం వేయించి.. బెల్లం పొడి, ఉప్పు కలిపి నూరి... పప్పుల మిశ్రమంలో కలపాలి. ప్యాన్‌లో నూనె వేడయ్యాక.. పల్లీలు, ఆవాలు, శనగపప్పు, మినప్పప్పు, జీడిపప్పు, నువ్వులు, కరివేపాకు ఒక్కొక్కటిగా వేయాలి. ఈ తాలింపు చల్లారనిచ్చి. పౌడర్‌లో కలపాలి. దీన్ని తడిలేని గాలిచొరబడని సీసాలో భద్రం చేసుకుంటే వేడి అన్నంలో కలిపి ఎంచక్కా తినొచ్చు. □

# కొత్తిమీర ప్రయోజనం-2..

ఆరోగ్య భాగ్యం



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

విటమిన్ 'కె' వల్ల గాయాలైనప్పుడు రక్తస్రావాలు అయినప్పుడు రక్తం త్వరగా గడ్డకట్టడానికి ఉపయోగపడుతుంది. కొత్తిమీరలోని అధిక కాల్షియం, మెగ్నీషియం, ఫాస్ఫరస్ జింక్ కాపర్ వల్ల దంతాలు, ఎముకలు ఆరోగ్యంగా ఉండి ఎముకల వ్యాధులు, కీళ్ళనొప్పులు, ఆస్టియోపోరోసిస్ వ్యాధులు రావు. కొత్తిమీరలోని అధిక ఆంటి ఆక్సిడెంట్స్ వల్ల శరీరంలో ఫ్రీరాడికల్స్ ని తొలగించి కేన్సర్, గుండెజబ్బులు, దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా, వృద్ధాప్య చిహ్నాల్ని తగ్గిస్తుంది. బరువు తగ్గుతారు. రక్తనాళాల్ని శుభ్రపరిచి, అడ్డంకుల్ని తొలగించి చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజ్‌రైడ్స్ ని తగ్గిస్తుంది. ఇది నిద్రలేమి, టెన్షన్, ఆందోళన అలసట, తలనొప్పి, చిరాకును తగ్గించి, ఆంటి డిప్రెసెంట్‌గా పనిచేస్తుంది. వివిధ రకాల కాలుష్యాల వల్ల శరీరంలో కలిగే వివిధ భారీ లోహాల్ని (సీసం, ఆర్సెనిక్, పారసం, కాడ్మియం) స్థాయిల్ని తగ్గిస్తుంది. అలాగే కీమోథిరపీ పొగ త్రాగడం వల్ల కలిగే నష్టాల్ని తగ్గిస్తుంది. విషపురుగులు కుట్టిన చోట వాటి విషాన్ని హరిస్తుంది. స్త్రీలలో బహిష్టులోని హెచ్చు తగ్గుల్ని అధిక రక్తస్రావాన్ని, బహిష్టునొప్పి, నడుంనొప్పి, పిఎమ్ఎస్, మూర్ఛల్ని మెన్స్ట్రువల్ క్రాంప్స్ ని, హార్మోన్ల ఇంబాలెన్స్ ని తగ్గిస్తుంది. శరీరంలోని ఎంజైమ్‌ల్ని, హార్మోన్లని, స్రావాల్ని ప్రేరేపించడం ద్వారా, బి.పి. షుగర్ సాయిల్ని తగ్గిస్తుంది.

**జాగ్రత్తలు:** కొత్తిమీరను రోజూవారీ ఆహారంలో అధికంగా తింటే కొన్ని దుష్ఫలితాలు ఏర్పడతాయి. కడుపునొప్పి, అతిసారం, ఎలర్జీ, లో బిపి. స్పృహతప్పడం శ్వాస తక్కువగా తీసుకోవడం, ఛాతీనొప్పి, ఎండవేడిమికి, యువి కిరణాలకి సునితత్వం కల్గుతుంది. ఆపరేషన్స్ కి ముందు, తర్వాత, నిద్రమత్తు కల్గిస్తుంది. పురుషుల్లో ప్రోస్టేట్ గ్రంధి పనులకి, గర్భిణీ స్త్రీలలో ఎక్కువగా తినకుండా ఉంటేనే మేలు. హోమియోలో కొత్తిమీరతో తయారు చేసిన కొరియాంనరడమ్ సాటైవమ్ మదర్‌టించర్ వల్ల ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. దీన్ని పిల్లలు, గర్భిణీలు నిరభంతర్యంగా వాడవచ్చు. ఆకలి లేకపోయినను, వికారం, విరేచనాలు, మొలలు, నేకిమిరోగాలు, పంటినొప్పి, కీళ్ళ నొప్పులు, హెర్నియా, మీజిల్స్, బాక్టీరియా ఫంగల్ ఇన్ఫెక్షన్స్ కి వ్యాధి లక్షణాల్ని బట్టి 3–5 చుక్కలు రోజుకి 2–3 సార్లు చొప్పున వారానికి, నెలకొకసారి వైద్య పర్యవేక్షణలో వాడుకోవచ్చు. కొత్తిమీర ఎక్కువగా తీసుకోవాడం వల్ల కలిగే దుష్ఫలితాలకి విరుగుళ్ళుగా దాల్చినచెక్క, వేయించిన కోడిగ్రుడ్డు తేనె, లవంగాలు తీసుకుంటే సరిపోతుంది. □



# అన్నంతో మేలి ఛాయ

చర్మానికి మేలిమి ఛాయను అందించడంలో బియ్యం కడుగు బాగా పని చేస్తుందనేది తెలిసిన విషయమే. కానీ అన్నంతోనూ ఇది లభిస్తుందని తెలుసా. ఇంట్లో లభించే కొన్ని పదార్థాలను కలిపి ఫేస్‌ప్యాక్ వేసి బ్యూటీ పార్లర్‌లో పొందే గ్లాస్ స్కిన్‌ని పొందవచ్చు. అదెలానో తెలుసుకుందామా..

**పచ్చిపాలతో..** రెండు టేబుల్ స్పూన్ల అన్నాన్ని తీసుకోవాలి. దానికి తగినన్ని పచ్చిపాలు లేదా పెరుగు కలిపి పేస్టులా చేసుకోవాలి. దీన్ని ముఖానికి ప్యాక్‌లా చేసి పావుగంటాగి చల్లని నీటితో శుభ్రం చేస్తే సరి. రైస్‌లో ఉండే అమైనో ఆమ్లాలు, యాంటీ ఆక్సిడెంట్లు ముఖచర్మాన్ని తేమగా చేస్తూ వృద్ధాప్య ఛాయలను దరిచేరనివ్వవు.



**తేనెతో...** రెండు చెంచాల చొప్పున అన్నం, పులియబెట్టిన బియ్యం కడుగు, అరచెంచా చొప్పున తేనె, ఆరెంజ్ తొక్కలపొడి తీసుకుని మిశ్రమం చేసుకోవాలి. దీనినన ముకానికి పట్టించాలి. ఆరిన తర్వాత కడిగితే సరి. పులిసిన బియ్యం నీళ్ల జిడ్డుని తగ్గించి మొటిమలు, వాటి వల్ల ఏర్పడే మచ్చలను దూరం చేస్తాయి. వారానికి కనీసం రెండుసార్లు చేస్తే నిగారింపు మీ సొంతం అవుతుంది.

**కీరాతో..** రెండు చెంచాల మెత్తగా చేసిన అన్నానికి, అదే పరిమాణంలో కీరదోస గుజ్జు కలపాలి. దీన్ని ముఖం, మెడ భాగాలకు పట్టించి పావుగంటాగి కడగాలి. కీరా చర్మ రంధ్రాలను బిగుతుగా చేస్తుంది. విటమిన్– ఐసి, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు అలర్జీలను తగ్గస్తాయి. అలసిన కళ్లకు ఉపశమనం కలిగించడమే కాకుండా కంటి చుట్టూ నల్లటి వలయాలను తగ్గిస్తుంది. అదనపు నూనెలను నివారించి చర్మాన్నిహైడ్రేట్ చేసి కాంతిమంతంగా కనిపిస్తుంది.

**క్యారెట్, అన్నం..** చెంచా చొప్పున క్యారెట్ ముక్కలు, అన్నం తీసుకుని మెత్తగా చేసుకోవాలి. దీన్ని ముఖానికి పట్టించి ఆరాక చల్లటి నీటితో శుభ్రం చేయాలి. క్యారెట్‌లో ఉండే బీటా కెరోటిన్,విటమిన్ సి ఫెనొలిక్ ఆమ్లాలు చర్మ ఛాయను మెరుగుపరుస్తాయి. ఎండవల్ల ఏర్పడే డార్క్‌స్పాట్స్ ను తగ్గిస్తుంది. ఫ్రీరాడికల్‌తో పోరాడి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. □

# గణాధిపత్యం !

ఆధ్యాత్మికం

వినాయక చవితిని పిల్లలచేత తప్పనిసరిగా ఎందుకు చేయించుకోవాలి అనే సందేహం కొందరికి వస్తుంటుంది. అందుకో స్పష్టమైన ఉదాహరణ.. గణాధిపత్యం ఎవరికి ఇవ్వాలనే విషయంలో పరమేశ్వరుడు పెట్టిన పరీక్షలో వినాయకుడే గెలిచాడు. కుమారస్వామి, విఘ్నేశ్వరుల్లో భూమండలాన్ని ముందుగా ఎవరు చుట్టి వస్తే వారికే గణాధిపత్యమన్నది శివయ్య మాట. కుమారస్వామి వద్ద వేగంగా ప్రయాణించే నెమలి వాహనం ఉంది. కానీ గణపయ్యకు కదిలేందుకు ఇబ్బందిగా ఉండే పెద్ద బొజ్జ.. దానికి తోడు చిట్టెలుక వాహనం. ఈ క్లిష్ట పరీక్షకు కుంగి పోలేదు ఉండ్రాళ్లయ్య. ఎంతో ధైర్యంగా, స్థైర్యంగా ఉన్నాడు. ధర్మమే అన్నీ సమకూర్చి పెడుతుందని ముందడుగు వేశాడు. తనయుడిగా తన లక్ష్యం ఒక్కటే. అమ్మానాన్నలను పూజించాలి, గౌరవించాలి. ఆ కర్తవ్యనిర్వహణతో కూడిన ధర్మాన్నే ఆయన ఆచరించాడు. తల్లిదండ్రులకు ప్రదక్షిణలు చేశాడు.. భూమండలాన్ని చుట్టిన ఫలితాన్ని వెనువెంటనే పొందాడు. ప్రతి తీర్థాన్నీ, క్షేత్రాన్నీ షణ్ముఖుడి కంటే ముందు చేరాడు. గణాధిపత్యానికి అర్హత సాధించాడు. తల్లిదండ్రులను గౌరవిస్తే జీవితానికి కావలసిన అన్నీ సులభ సాధ్యాలవుతాయన్న ధర్మ సూక్ష్మాన్ని వినాయకుడు ఇక్కడ అందించాడు. అంతే కాదు గజాననుడిగా మారేందుకు ముందు అమ్మ మాటను పాటించటం ధర్మమని నిర్ణయించుకుని వాకిట్లోనే శివయ్యను ఆపాడు. నలుగుపిండితో బొమ్మను చేసే ప్రాణం పోసింది. పార్వతి స్నానానికి వెళ్తూ. ఎవరినీ లోపలికి రానివ్వొద్దని గడపలో కాపలాగా ఉంచింది. పరమేశ్వరుడొచ్చి లోపలికి వెళ్లే ప్రయత్నం చేశాడు. అమ్మ ఇచ్చిన ఆజ్ఞను పాటించటం తన ధర్మమని శివయ్యను లోపలికి పంపలేదు. గణపయ్యకు శిరచ్ఛేదమయ్యింది. కానీ ధర్మాన్ని పాటించిన కారణంగా గజానత్వం సిద్ధించింది. □

# ప్రత్యేకమైన స్థలం అవసరం

**బాగా చదువుకొమ్మని పిల్లలకు చెబుతాం కానీ.. ఇంట్లో అందుకు తగ్గ వాతావరణం ఉందా అని ఎప్పుడైనా గమనించారా? ప్రత్యేకించి వాళ్లకంటూ ఓ స్థలం లేకపోతే చదువుపై ఏకాగ్రత ఎలా పెంచుకుంటారు**

✦ పిల్లల చదువుకొనే చోటే కదా ఎక్కడో అక్కడ కాస్త జాగా ఉంటే చాలు అనుకోవద్దు. పిల్లలు చదువుకొనే స్థలం. వంటగది పక్కన, బాత్‌రూమ్, బెడ్ రూమ్‌లకు దూరంగా ఉండేట్టు చూడండి. అలాగే మెట్ల పక్కన కూడా వద్దు. ఎందుకంటే ఆ శబ్దాలకి చదువుపై మనసు పెట్టలేరు. అలాగే స్టడీ రూమ్‌ని గాలి, వెలుతురు ధారాళంగా వచ్చేచోట ఏర్పాటు చేసుకోవాలి. ✦ స్టడీ టేబుల్ దీర్ఘ చతురస్రాకారంలో



సౌకర్యంగా ఉండేట్టు చూసుకోవాలి. అలానే గదిగోడలు ఆకుపచ్చ, నీలం, పసుపు, తెలుపురంగుల్లో ఉంటే మంచిది. ఈ రంగులు ఏకాగ్రతను పెంచుతాయి. పిల్లలను చురుగ్గా ఉంచుతాయి. ఎరుపు, నలుపు వంటి రంగులైతే.. పిల్లల జ్ఞా పకశక్తిపై ప్రభావం చూపిస్తాయి. ✦ పిల్లల గదిలో వాళ్లకు ఇష్టమైన రోల్‌మోడల్స్, మ్యాప్స్, గడియారం వంటివి పెడితే ఇవన్నీ వారికి కొంత జ్ఞా నం, సమయపాలన, క్రమశిక్షణ దిశగా నడిపిస్తాయి. టివి, మ్యూజిక్ సిస్టమ్, అద్దాలు ఏర్పాటు చేయొద్దు.ఇవి వాళ్ల దృష్టిని పక్కకు మళ్లిస్తాయి. ✦. చిన్న కుండీలో మనీప్లాంట్ వంటి మొక్కల్ని పెంచితే పిల్లలు చదివే వాతావరణం ఆహ్లాదంగానూ, ఆరోగ్యవంతంగానూ ఉంటుంది. □

# ఆసియా కప్‌లో.. భారత్‌దే ఆధిపత్యం

## టైటిల్ అందించిన కెప్టెన్లు



సునీల్ గవాస్కర్ · దిలీప్ వెంగసర్కర్ · అజారుద్దీన్ · ఎంఎస్ ధోనీ · రోహిత్ శర్మ

**న్యూఢిల్లీ:** ఆసియా కప్ ప్రారంభమైనప్పటి నుంచి భారత జట్టుదే ఎక్కువ ఆధిపత్యం. ఇప్పటివరకు జరిగిన 16 ఎడిషన్లలో భారత్ అత్యధికంగా 8 సార్లు టైటిల్ గెలుచుకుంది. ప్రతి టైమ్ లైన్‌లో ప్రతి కెప్టెన్ తనదైన శైలితో జట్టుని గెలిపించడం భారత క్రికెట్ చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయం. అలా ఆసియా కప్‌లో ఇప్పటివరకు భారత్‌కు 5 కెప్టెన్లు టైటిల్ అందించారు. 1984లో జరిగిన తొలి ఆసియా కప్‌లో భారత్‌కు సునీల్ గావస్కర్ నాయకత్వం వహించాడు. అప్పట్లో కేవలం మూడు జట్లే భారత్, పాకిస్థాన్, శ్రీలంక పాల్గొన్నాయి. గావస్కర్ కెప్టెన్సీలో భారత్ పాకిస్థాన్‌పై 54 పరుగుల తేడాతో టైటిల్‌ను కైవసం చేసుకుంది. మొదటి కెప్టెన్‌గా ఆసియా కప్ ట్రోఫీని లిఫ్ట్ చేసిన గర్వకారణం ఆయనకే దక్కింది. అలాగే 1988 ఆసియా కప్‌లో భారత్ రెండోసారి విజేతగా నిలిచింది.

ఈసారి దిలీప్ వెంగసర్కర్ కెప్టెన్సీ వహించారు. శ్రీలంక, పాకిస్థాన్‌వంటి జట్లతో పోటీపడుతూ జట్టుని సమర్థవంతంగా నడిపించాడు. ఇక 1990/91, 1995లో భారత్ 2 సార్లు ఆసియా కప్ గెలుచుకుంది. ఈ రెండు విజయాలకు కెప్టెన్‌గా అజారుద్దీన్ ఉన్నారు. ప్రత్యేకంగా 1995లో జరిగిన ఫైనల్లో ఆయన 90 పరుగులు నాటౌట్‌గా చేసి జట్టుని విజేతగా నిలిపారు. భారత క్రికెట్‌లో మోస్ట్ సక్సెస్ ఫుల్ కెప్టెన్లలో ధోనీ ఒకడు. 2010లో శ్రీలంకపై భారత్ విజయం సాధించి ఆసియా కప్ ట్రోఫీని గెలుచుకుంది. ఆ తర్వాత 2016లో జరిగిన ఫైనల్లో బంగ్లాదేశ్‌పై గెలిచి మరోసారి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈసారి మ్యాచ్ టి20 ఫార్మాట్‌లో జరిగింది. అందుకే ధోనీ ఒడిఐ, టి20 రెండు ఫార్మాట్లలో ఆసియా కప్ గెలిపించిన ఏకైక భారతకెప్టెన్‌గా చరిత్రలో నిలిచాడు. కాగా 2018లో బంగ్లాదేశ్‌పై ఉత్కంఠ భరితమైనఫైనల్లో భారత్‌గెలిచి టైటిల్ సాధించింది. ఆ సమయంలో కెప్టెన్‌గా రోహిత్ శర్మ జట్టుని ముందుండినడిపాడు. 2023లో శ్రీలంకపై ఫైనల్లో విజయం సాధించినప్పుడు మాత్రం పూర్తి అధికారిక కెప్టెన్‌గా ట్రోఫీ లిఫ్ట్ చేశారు. ఆ ఫైనల్లో భారత్ అద్భుత ప్రదర్శనతో శ్రీలంకని కేవలం 50 పరుగులకే ఆలౌట్ చేసింది. ఈ స్వల్పలక్ష్యాన్ని టీమ్ ఇండియా 6.1ఓవర్లలో లక్ష్యాన్ని ఛేధించింది. ఇది ఆసియా కప్ చరిత్రలోనే ఒక రికార్డు విజయంగా నిలిచింది.



# మహిళల హాకీ ఆసియా కప్.. భారత్ చేతిలో థాయిలాండ్ చిత్తు

**న్యూఢిల్లీ:** మహిళల హాకీ ఆసియా కప్-2025, ప్రారంభ మ్యాచ్‌లో భారత మహిళలు థాయిలాండ్‌పై ఆధిపత్యం సంపాదించారు. చైనాలో శుక్రవారం జరిగిన ఈ తొలి మ్యాచ్‌లో భారత్ థాయిలాండ్‌ను 11-0 తేడాతో ఓడించింది. బ్యూటీ డంగ్ డంగ్, ఉదిత చెరో రెండు గోల్స్ చేశారు. పూల్ బి మ్యాచ్‌లో భారత్ తరఫున ముంతాజ్ ఖాన్ (7 నిముషం, 49 నిముషం), ఉదిత (30, 52), బ్యూటీ డంగ్ డంగ్ (45, 54) రెండేసి గోల్స్ చేయగా, సంగీతా కుమారి (10), నవనీత్ కౌర్ (16వ నిముషం), లాల్‌రెమ్సియామి (18), షర్మిలా దేవి (57)తో పాటు డిదానో (57) స్కోర్ చేశారు. తొలి క్వార్టర్‌లో ముంతాజ్ ఖాన్ (7), సంగీతా కుమారి (10) చేసిన 2 ఫీల్డ్ గోల్స్‌తో భారత్ ఆరంభంలోనే తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. 2వ క్వార్టర్‌లో భారత్ తన దాడి తీవ్రతను మరింత పెంచుకుని మరో 3 గోల్స్‌తో తమ ప్రయోజనాన్ని విస్తరించుకుంది. అనుభవజ్ఞులైన ఫార్వర్డ్ నవనీత్ కౌర్ (16) మరియు మిడ్‌ఫీల్డర్ లాల్రెమ్సియామి (18) వరుసగా 2 ఫీల్డ్ గోల్స్ చేశారు. ఆ తర్వాత ఉదిత (30) పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మార్చి మొదటి అర్ధభాగాన్ని బలంగా ముగించారు. రెండవ అర్ధభాగం కూడా ఇదే ధోరణిని అనుసరించింది. భారత్ థాయిలాండ్ సర్కిల్‌లో నిరంతరం దాడులకు పాల్పడి మూడవ క్వార్టర్‌లో 4 పెనాల్టీ కార్నర్‌లను గెలుచుకుంది. దీని ద్వారా బ్యూటీ డంగ్ డంగ్ (45) 45వ నిమిషంలో తన మొదటి గోల్ చేసింది. మ్యాచ్ చివరి క్వార్టర్‌లో భారత్ వరుసగా 5 గోల్స్ చేసి తొలి మ్యాచ్‌లో భారీ విజయాన్ని నమోదుచేసింది. ముంతాజ్ ఖాన్ (49), ఉదిత (52), షర్మిలా దేవి (57) పెనాల్టీ కార్నర్‌ల ద్వారా గోల్స్ చేయగా, బ్యూటీ డంగ్ డంగ్ (54) మరియు రుతుజా దాదాసో పిసల్ (60) తమ జట్టు తరఫున ఫీల్డ్ గోల్స్‌చేశారు. భారత్ తదుపరి మ్యాచ్‌లో ఈ నెల 6, శనివారం జపాన్‌తో తలపడుతుంది.

# పసికూనపై పాక్ ప్రతాపం.. యుఎఇపై 31 పరుగుల తేడాతో గెలుపు



**న్యూఢిల్లీ:** ముక్కోణపు టీ20 సిరీస్‌లో పాకిస్థాన్ ఫైనల్‌కు చేరింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ)తో షార్జా వేదికగా జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ 31 పరుగుల తేడాతో గెలుపొందింది. దీంతో ఈ ట్రై సిరీస్‌లో పాక్‌కు ఇది మూడో విజయం. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లో 5 వికెట్లు నష్టానికి 171 పరుగులు చేసింది. ఓపెనర్లు షాహిబ్‌జాదా ఫర్హాన్ (16), నయిమ్ ఆయుబ్ (11) విఫలం కాగా, వన్‌డౌన్ బ్యాటర్ జమాన్ అద్భుత అర్ధ శతకంతో ఇన్నింగ్స్ చక్కదిద్దాడు. ఈ ఎడమచేతి వాటం బ్యాటర్ 44 బంతులు ఎదుర్కొని 10 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 77 పరుగులతో ఆఖరి వరకూ అజేయంగా నిలిచాడు. ఫఖర్ జమాన్‌కు తోడుగా మహ్మద్ నవాజ్ (27 బంతుల్లో 37 నాటౌట్) వేగంగా ఆడాడు. దీంతో పాక్ మెరుగైన స్కోరు సాధించగలిగింది. యుఏఈ బౌలర్లలో హైదర్ అలీ 2 వికెట్లు తీయగా, జునైద్ సిద్ధిఖీ, మహ్మద్ రోషిద్ ఖాన్, ధ్రువ్ పరాశర్ ఒక్కో వికెట్ దక్కించుకున్నారు. ఇక పాక్ విధించిన 171 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో యూఏఈకి ఆదిలోనే దెబ్బ తగిలింది. కెప్టెన్, ఓపెనర్ మహ్మద్ వసీం (19)ను అబ్రార్ అహ్మద్ స్వల్ప స్కోరుకే పెవిలియన్‌కు పంపించాడు. అయితే మరో ఓపెనర్ అలిశాన్ షరాఫూ మాత్రం హాఫ్ సెంచరీతో రాణించాడు. 51 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో 68 పరుగులు సాధించాడు. కానీ పాక్ బౌలర్ల విజృంభణతో మిగిలిన బ్యాటర్లంతా పెవిలియన్‌కు క్యూ కట్టడంతో షరాఫూ అర్ధ శతకం వృధా అయింది. ఎథాన్ డిసౌజా (9), ఆసిఫ్ ఖాన్ (7), రాహుల్ చోప్రా (0), హర్షిత్ కౌశిక్ (3), జునైద్ సిద్ధిఖీ ఇలా వచ్చి అలా వెళ్లగా ధ్రువ్ పరాశర్ (18 నాటౌట్), హైదర్ అలీ (12 రనౌట్) డబుల్ డిజిట్ స్కోరు చేయగలిగారు. ఈ క్రమంలో నిర్ణీత 20 ఓవర్ల ఆట పూర్తయ్యేసరికి యూఏఈ 7 వికెట్లు నష్టానికి 140 పరుగులు చేయగలిగింది.




# యుఎస్ ఓపెన్ సెమీఫైనల్ మహిళల సింగిల్స్.. ఫైనల్‌కు సబలెంకా

## పెగులా సంచలన ఓటమి

**న్యూఢిల్లీ:** ఉత్కంఠభరితమైన మూడు సెట్ల సెమీఫైనల్లో టాప్ సీడ్, డిఫెండింగ్ ఓపెన్ ఛాంపియన్ అరినా సబలెంకా 4-6, 6-3, 6-4 తేడాతో నాల్గవ సీడ్ జెస్సికా పెగులాను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది. ఆర్థర్ ఆషే స్టేడియంలో శుక్రవారం జరిగిన టోర్నీలో సబలెంకాకు ఇది వరుసగా ఐదవ యుఎస్ ఓపెన్ సెమీఫైనల్. ఇది సబలెంకాకు ఏడవ గ్రాండ్ స్లామ్ ఫైనల్ అవుతుంది. పెగులా ప్రారంభంలోనే పూర్తి ప్రయోజనాన్ని పొందింది. ప్రారంభ సెట్‌ను ఆడి సబలెంకాను సమతుల్యత నుండి దూరంగా ఉంచింది. ఆమె తనను తాను మూడు అనవసర తప్పిదాలకు మాత్రమే పరిమితం చేసుకుంది. ఆస్ట్రేలియన్ ఓపెన్ మరియు రోలాండ్ గారోస్ ఫైనల్స్, అలాగే వింబుల్డన్ సెమీస్ రెండింటిలోనూ విఫలమైన 27 ఏళ్ల సబలెంకా, రెండవ సెట్‌లో మళ్ళీ మొదటి స్థానంలో నిలిచింది, ఈసారి ప్రారంభంలో 3-0 ఆధిక్యం కోసం పటిష్టం చేసింది, మూడో సెట్‌ను 30-40తో ప్రారంభించడంలో సహాయపడుతూ, పెగులా ఫోర్‌హ్యాండ్‌ను బేస్‌లైన్ దాటి పంపింది. ముఖ్యంగా తొమ్మిది నిమిషాల పాటు కొనసాగిన ఆరో గేమ్‌లో అమెరికన్ సబలెంకా సర్వీస్‌పై ఒత్తిడి తెస్తూనే ఉంటుంది. కానీ 30 ఏళ్ల పెనుగులా ఏడు బ్రేక్ అవకాశాలలో రెండింటిని మాత్రమే గోల్‌గా మార్చగలిగింది. మ్యాచ్ కోసం 5-4, 40-30తో సర్వ్ చేస్తూ, సబలెంకా నెట్‌లోకి కొట్టి పెగులా మరో మ్యాచ్ పాయింట్‌ను సేవ్ చేయగలిగింది. కానీ మూడవదాన్ని సేవ్ చేయలేకపోయింది, రెండు గంటల ఐదు నిమిషాల్లో పడిపోయింది.

# యుఎస్ ఓపెన్‌లో యుకీ భాంబ్రీ జోడీ ఓటమి



**న్యూఢిల్లీ:** ఓటమితో యుకీ భాంబ్రీ జోడీ యుఎస్ ఓపెన్-2025 టోర్నీ కలల పరుగు ముగిసింది. యుఎస్ ఓపెన్ పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో భారత్‌కు చెందిన యుకీ భాంబ్రీ-న్యూజిలాండ్‌కు చెందిన మైఖేల్ వీనస్ జోడీ బ్రిటిష్ ద్వయం జో సాలిస్‌బరీ-నీల్ స్కుప్స్కి చేతిలో ఓడిపోయారు. బ్రిటిష్ ద్వయంతో జరిగిన ఉత్కంఠభరితమైన సెమీఫైనల్లో 7-6(72), 6-7(58), 4-6 తేడాతో భాంబ్రీ-వీనస్ జంట ఓడిపోయారు. లూయిస్ ఆర్మ్‌స్ట్రాంగ్ స్టేడియంలో శుక్రవారం జరిగిన ఈ పోటీ, కనీసం మొదటి సెట్ టైబ్రేక్ ప్రారంభమయ్యే వరకు హోరాహోరీగా సాగింది. ఆ తర్వాత, భాంబ్రి-వీనస్ 7-6(2)తో మొదటి ఫ్రేమ్‌ను కైవసం చేసుకోవడానికి కేవలం 2 పాయింట్లు మాత్రమే వదులుకున్నారు. రెండవ సెట్‌లో, భాంబ్రి-వీనస్ మొదటి గేమ్‌లో తమ ప్రత్యర్థుల సర్వీస్‌ను బ్రేక్ చేయడం ద్వారా నియంత్రణ సాధించారు. భాంబ్రి-వీనస్ కూడా సర్వీస్‌ను వదులుకునే వరకు, ఆటలో ఎదురుదెబ్బ తప్పదని అనిపించింది. ఆ తర్వాత మరికొన్ని గట్టి, ఉత్కంఠభరితమైన ఆటలు జరిగాయి, ఫలితంగా మరో టైబ్రేక్ వచ్చింది. ఈసారి, టైబ్రేక్ మరియు సెట్ 7-6 (5)తో బ్రిటిష్ వారికి దక్కింది. మూడవ సెట్‌లో, సాలిస్‌బరీ-స్కుప్స్కి అకస్మాత్తుగా ఆధిపత్యం చెలాయించారు. ముఖ్యంగా నెట్ వద్ద. 5-3తో ఆధిక్యంలో, బ్రిటిష్ 3 మ్యాచ్ పాయింట్లను సంపాదించారు. వాటిలో మూడింటినీ వారు వృధా చేశారు. కానీ సాలిస్‌బరీ-స్కుప్స్కి 6-4తో నిర్ణయాత్మక సెట్‌ను గెలుచుకున్నారు.

# రూ.855కోట్లకు ఛార్టర్డ్ స్పీడ్ ఐపిఒ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 5:** ఛార్టర్డ్ స్పీడ్ సంస్థ రూ.855 కోట్ల ఐపిఒకోసం సెబీవద్ద డిఆర్‌హెచ్‌పి దాఖలుచేసింది. ఈక్విటీద్వారా 655 కోట్లు, ఆఫర్‌ఫర్‌సేల్ ద్వారా 200 కోట్లు సమీకరించేందుకు నిర్ణయించింది.ప్రమోటర్లు పంకజ్ గాంధీ, అల్కా పంకజ్ గాంధీలకు ఉన్న వాటాలను ఆఫర్‌ఫర్‌సేల్‌ద్వారా విక్రయిస్తారు. ఈ నిధుల్లో రూ.97 కోట్లు విద్యుత్ బస్సుల్లో పెట్టుబడులుపెడుతుంది. మరో 396.4 కోట్లు రుణాలచెల్లింపులకు వినియోగిస్తుంది. ఇతర మొత్తాన్ని సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగిస్తామని తెలిపింది. కంపెనీ ప్రిఐపిఒ ప్లేస్‌మెంట్‌కింద రూ.131కోట్లకు నిధులు సమీకరించాలనినిర్ణయించింది. అహ్మదాబాద్‌కేంద్రంగా ఉన్న ఛార్టర్డ్ స్పీడ్ 2007నుంచి అమలులో ఉంది. 2018లో పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా కన్వర్ట్ అయింది.

భారత్‌లోని ప్యాసింజర్ రవాణా సంస్థల్లో ఒక లీడింగ్ సంస్థగా కొనసాగుతోంది. ఈ యేడాది జూన్‌నాటికి కంపెనీ రెండువేల బస్సులను 500 నగరాల్లో నడిపింది. 3.5 లక్షలమంది ప్రయాణీకులను ప్రతినిత్యం తమ బస్సుల్లో చేరవేస్తున్నట్లు తెలిపింది. గుజరాత్, ఒడిశా,మధ్యప్రదేశ్; రాజస్థాన్,అ స్సాం రాష్ట్రాల్లో అంతర్‌రాష్ట్ర సర్వీసులు కూడా నడుపుతోంది. ఆపరేషన్స్‌తో రాబడులు 666.7 కోట్లు ఉండగా 2023లో 332 కోట్లు వచ్చాయి. తొలిత్రైమాసికంలో నికరలాభం 70 కోట్లుగా కంపెనీ ప్రకటించింది. మొత్తం 945 విద్యుత్ బస్సులు అనుబంధ సంస్థలద్వారా నడుపుతోంది. ఇష్యూకు మోతీలాల్ ఓస్వల్ ఇన్వెస్ట్‌మెంట్ సలహాదారులుగాను, ఎస్‌బిఐ కేపిటల్ మార్కెట్లు బుక్‌రన్నింగ్ లీడ్‌మేనేజర్లుగా ఉన్నారు.




# సెన్సెక్స్,నిఫ్టీలకు ఎఫ్‌ఎంసిజి, ఐటి రంగాల షాక్!



**ముంబయి, సెప్టెంబరు 6:** ఎఫ్‌ఎంసిజి, ఐటి రంగాల్లో ట్రేడర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపించడంతో మార్కెట్లు లాభనష్టాల్లో ఊగిసలాడాయి. జిఎస్‌టి 2.0 వచ్చినా లాభాలు ఒక్కరోజుకే పరిమితం అయ్యాయి. నిఫ్టీ 24,621.60 పాయింట్లవద్దనే నిలిచిపోయింది. ఇక బిఎస్‌సి సెన్సెక్స్ 7.25 పాయింట్లు క్షీణించి 80,710.76 పాయింట్లవద్ద ట్రేడింగ్ నిలిపివస్తే నిఫ్టీ 50 సూచీ కేవలం 6.70 పాయింట్లు మాత్రమే లాభపడింది. ఐటిసి 2.01శాతం, టిసిఎస్ 1.53శాతం, ఇన్ఫోసిస్ 1.29శాతం చొప్పున అమ్మకాలు సాగడంతో క్షీణించాయి. ఇక బిఎస్ఇ మిడ్‌క్యాప్‌సూచీ 0.10శాతం క్షీణిస్తే స్మాల్‌క్యాప్‌సూచీ 0.09శాతం పెరిగాయి. మార్కెట్లపరంగా 2134 కంపెనీల షేర్లు పెరిగితే 1957 కంపెనీలషేర్లు క్షీణించాయి. 181 షేర్లు స్థిరంగా కొనసాగాయి. భారత్‌పదేళ్ల బెంచ్‌మార్క్ బాండ్లు 0.46శాతం క్షీణించి 6.461శాతానికి చేరింది. విదేశీ కరెన్సీ మార్కెట్‌పరంగా రూపాయి మారకం విలువలు క్షీణించాయి. 88.25 వద్ద కొనసాగి చివరకు 88.12 వద్ద ముగిసింది.ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు అక్టోబరు 3వ తేదీనాటికి 0.33శాతం పెరిగి 106,770వద్ద ముగిసాయి. అమెరికా బాండ్లుకూడా 0.48శాతం క్షీణించి 4.156 కూపన్‌రేట్‌తో నడిచాయి. ఇక ప్రపంచ మార్కెట్లపరంగా యూరోపియన్ మార్కెట్లు శుక్రవారం భారీగానే ముగిసాయి. అమెరికా జాబ్ రిపోర్టుపై ఇన్వెస్టర్లు ఎదురుచూసారు. అలాగే రానునన ఫెడ్‌రిజర్వు వడ్డీరేట్లకోతలపైనా ఆసక్తిచూపించారు. జపాన్ నిక్కీ సేర్లు ఒత్తిడికి లోనయ్యాయి. అమెరికా ట్యారిఫ్‌లే ఇందుకు కారణం. ఇక స్టాక్స్‌పరంగా ఓలా ఎలక్ట్రిక్ 7.25శాతం, ప్రోస్టార్మ్ ఇన్ఫోసిస్టమ్స్ 9.79శాతం, ట్రాన్స్‌వరల్డ్ షిప్పింగ్‌లైన్స్ 8.15శాతం చొప్పున పెరిగాయి. అలాగే పిఎన్‌సి ఇన్‌ఫ్రాటెక్ 2.35శాతం, ఇండోటెక్ ట్రాన్స్‌ఫార్మర్స్ 2.35శాతం, పెరిగితే జైడస్ లైఫ్‌సైన్సెస్ 0.21శాతం క్షీణించాయి.

# స్పైస్‌జెట్‌కు రూ.238 కోట్ల నష్టం




**ముంబయి, సెప్టెంబరు 5:** ప్రైవేటురంగంలోని స్పైస్‌జెట్ జూన్‌త్రైమాసికంలో రూ.238 కోట్ల నష్టం చవిచూసింది. ఇదే కాలంలో గత ఏడాది 150 కోట్ల లాభాలను చవిచూసిన సంస్థ ఈ సారిమాత్రం నష్టాలు నమోదుచేసింది. ట్రావెల్ డిమాండ్ మందగించడం, కొన్ని రూట్లలో మరింతగా సర్వీసులు నిలిపి వేయడంకూడా ఇందుకు కారణం అయింది. దీనికితోడు ఆపరేషన్ సింధూర్‌తో రూట్లు అన్ని నిలిచిపోయాయి. దీనితో ఆపరేషన్‌కూడా సంస్థ నష్టాలకు కొంత కారణం అయింది. అలాగే పాక్‌గగనతలం మూసివేయడం కూడా ఒక కారణంగా చెపుతున్నారు. కొన్ని విమాన సర్వీసులు సర్వీసుకు గ్రౌండ్ అవడం, కొన్నింటికి లీజు వివాదాలు, ఆర్థిక ఒత్తిళ్లు కూడా పనితీరుపై ప్రభావంచూపించాయి. ఆపరేషన్స్ ద్వారా రాబడులు 35శాతంతగ్గాయి. 1695 కోట్ల నుంచి 1106 కోట్లకు పడిపోయాయి. ఇబిఐడిటిఎ కూడా 402 కోట్లనుంచి 18 కోట్లకు పడిపోయింది. సంస్థ చైర్మన్ అజయ్‌సింగ్ మాట్లాడుతూ అనుకోని తీవ్రస్థాయి సవాళ్లు రావడంతో సంస్థకు కొంతమేర రికవరీ కష్టం అయిందని, రానున్న కాలంలో అన్నింటినీ అధిగమిస్తామని వెల్లడించారు. జూన్‌త్రైమాసికంలో సంస్థ సంపద మొత్తం 446 కోట్లుపెరిగింది. గత ఏడాది 2398 కోట్ల లోటునుంచి ఈసారి కొంతమేర సంపదను పెంచుకోగలిగింది.

వాణిజ్యం

## జీఎస్టీ హేతుబద్ధీకరణతో

# ప్రభుత్వ రాబడుల లోటు తక్కువే!

## ఎస్‌బిఐ రీసెర్చి నివేదిక వెల్లడి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 5:** దేశంలో వస్తు, సేవల పన్ను (జిఎస్టీ) విధానంలో చేపట్టిన సంస్కరణల వల్ల ప్రభుత్వ ఖజానాపై పడే భారం చాలా స్వల్పమేనని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) తన తాజా పరిశోధన నివేదికలో వెల్లడించింది. జిఎస్టీ మండలి తీసుకున్న రేట్ల హేతుబద్ధీకరణ నిర్ణయం వల్ల ప్రభుత్వానికి ఏటా కేవలం రూ. 3,700 కోట్ల మేరకు ఆదాయం తగ్గుతుందని అంచనా వేసింది. ఈ మొత్తం చాలా తక్కువ కావడంతో ద్రవ్య లోటుపై ఎలాంటి ప్రభావం ఉండబోదని స్పష్టం చేసింది. 56వ జిఎస్టీ మండలి సమావేశంలో జిఎస్టీ శ్లాబులు ఇకపై రెండే ఉంటాయని చెప్పిన సంగతి తెలిసిందే. వాటిని ఈనెల 22వ తేదీనుంచే అమలుకు తెస్తామని కూడా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఇప్పటివరకు ఉన్న 5%, 12%,18%, 28%అనే నాలుగు అంచెల పన్ను విధానాన్ని రద్దు చేశారు. దీని స్థానంలో 5%, 18% అనే రెండు శ్లాబులతో పాటు కొన్ని ఎంపిక చేసిన వస్తు, సేవలపై 40%డీమెరిట్ రేటును ప్రవేశపెట్టారు. ఈ మార్పుల వల్ల ప్రభుత్వానికి ఏటా రూ. 48,000 కోట్ల నష్టం వస్తుందని ప్రభుత్వం అంచనా వేయగా, ఎస్బీఐ అంచనా దీనికి పూర్తి భిన్నంగా ఉండటం గమనార్హం. ఈ సంస్కరణల వల్ల వినియోగం పెరిగి ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని నివేదిక పేర్కొంది. ముఖ్యంగా, సామాన్యులకు ఇది ఎంతో ఊరటనిచ్చే అంశమని తెలిపింది. దాదాపు 295 నిత్యావసర వస్తువులపై పన్ను రేటును 12%నుంచి 5% లేదా సున్నా శాతానికి తగ్గించడంతో రిటైల్ ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గుతుందని అంచనా వేసింది. దీనివల్ల ఈ ఆర్థిక సంవత్సరంలో వినియోగదారుల ధరల సూచీ (సిపిఐ) ద్రవ్యోల్బణం 25 నుంచి 30 బేసిస్ పాయింట్ల వరకు తగ్గే అవకాశం ఉందని తెలిపింది. 2026-27 నాటికి ద్రవ్యోల్బణం మొత్తం మీద 65 నుంచి 75 బేసిస్ పాయింట్ల మేర తగ్గుముఖం పడుతుందని వివరించింది. ఈ సంస్కరణల ఫలితంగా జీఎస్టీ సగటు భారిత రేటు కూడా గణనీయంగా తగ్గనుంది. 2017లో జీఎస్టీని ప్రవేశపెట్టినప్పుడు 14.4%గా ఉన్న ఈ రేటు, తాజా మార్పులతో 9.5 శాతానికి దిగి వస్తుందని ఎస్బీఐ నివేదిక పేర్కొంది. అంతేకాకుండా, వ్యయాలు తగ్గడం వల్ల బ్యాంకింగ్ రంగానికి కూడా ఈ సంస్కరణలు సానుకూల ఫలితాలనిస్తాయని అభిప్రాయపడింది.




# భారత్‌లో తొలి టెస్లాకారు కొనుగోలుచేసిన మహారాష్ట్ర మంత్రి

**ముంబయి, సెప్టెంబరు 5:** ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా అధికారికంగా భారత విపణిలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ఈ ఏడాది జులై 15న ఆర్థిక రాజధాని ముంబైలో తొలి షోరూంను ప్రారంభించింది. ఆ తర్వాత ఢిల్లీలో రెండో షోరూంను కూడా లాంఛ్ చేసింది. భారత విపణిలోకి అడుగుపెట్టిన తర్వాత టెస్లా తాజాగా తన తొలి కారును కస్టమర్‌కు డెలివరీ చేసింది. తెలుపు రంగు టెస్లా 'వై మోడల్' కారును మహారాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రతాప్ సర్‌నాయక్ కొనుగోలు చేశారు. ముంబై బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోని టెస్లా ఎక్స్‌పీరియన్స్ సెంటర్ నుంచి తొలి కారును ఇవాళ మంత్రికి సంస్థ ప్రతినిధులు డెలివరీ చేశారు. కారు తాళాలను అందజేశారు. ఈ సందర్భంగా దేశంలోనే తొలి టెస్లా కారును కొనుగోలు చేయడం పట్ల మంత్రి ప్రతాప్ సర్‌నాయక్ సంతోషం వ్యక్తం చేశారు. విద్యుత్ వాహనాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతోనే తాను ఈ కారును కొనుగోలు చేసినట్లు మంత్రి వెల్లడించారు ప్రస్తుతం ఎలక్ట్రిక్ కార్లలో అత్యధిక అమ్మకాలతో రికార్డు నెలకొల్పిన 'వై' మోడల్ కార్లను భారత వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చింది టెస్లా. రియర్‌వీల్ డ్రైవ్, లాంగ్‌రేంజ్ వేరియంట్ కార్లను అమ్మకానికి ఉంచింది. ఇక ధర విషయానికొస్తే రియర్‌వీల్ డ్రైవ్ (ఆర్‌డబ్ల్యూడీ) వేరియంట్ ధర రూ. 59.89 లక్షలు, లాంగ్‌రేంజ్ ఆర్‌డబ్ల్యూడీ వేరియంట్ ధరను రూ. 67.89 లక్షలుగా నిర్ణయించింది. వీటి 'ఆన్ రోడ్' ధరల్ని పరిశీలిస్తే ఆర్‌డబ్ల్యుడి వెర్షన్ ఆన్‌రోడ్ ధర రూ. 61.07 లక్షలుకాగా, లాంగ్‌రేంజ్ వెర్షన్ ఆన్‌రోడ్ ధర రూ. 69.15 లక్షలుగా ఉంది. టెస్లా అధికారిక వెబ్‌సైట్ ప్రకారం, ఇందులో 18 శాతం జిఎస్టీతో సహా రూ. 50,000 అడ్మినిస్ట్రేషన్, సర్వీస్ ఫీజు కూడా ఉంటుంది. అయితే, భారత్‌లో సగటు ఎలక్ట్రిక్ కారు ధర రూ.22 లక్షలు ఉంది. టెస్లా మోడల్ వై ధర దాదాపు రూ.60 లక్షల వరకు ఉంది. మరోవైపు ఎన్నో అంచనాలతో భారత మార్కెట్‌లోకి అడుగుపెట్టిన ఈ సంస్థకు నిరాశే ఎదురైంది. ఆశించిన స్థాయిలో బుకింగ్స్ జరగలేదని సమాచారం. జులై నుంచి ఇప్పటి వరకూ మొత్తం 600 బుకింగ్స్ మాత్రమే వచ్చాయి. కంపెనీ అంచనాల కంటే ఇవి చాలా తక్కువ. ఎందుకంటే టెస్లా ప్రపంచ వ్యాప్తంగా కేవలం నాలుగు గంటల్లోనే ఈ సంఖ్య కార్లను విక్రయిస్తుంది. దీంతో భారత్‌లో టెస్లాకు అనుకున్నంత స్పందన రాలేదని కంపెనీకి చెందిన కీలక వ్యక్తులను ఊటంకిస్తూ ఆంగ్లమీడియా వెల్లడించింది. టెస్లాకు బ్రాండ్ పేరు ఉన్నప్పటికీ ఎక్కువ ధర కారణంగా భారత్ ఈవీ మార్కెట్‌లో పెద్దగా ప్రభావం చూపలేకపోతోందన్నది మార్కెట్ టాక్.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.